




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 05 గురువారం | జూన్,2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 261
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## ఆర్సీబీ విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట



- 11 మంది మృతి, చాలా మందికి తీవ్ర గాయాలు
- 18 ఏళ్ల తర్వాత తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ అందుకున్న ఆర్సీబీ
- టీమ్‌ను అభినందిస్తూ చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవాలు
- ఆర్సీబీ ఆటగాళ్లను చూసేందుకు భారీగా ఎగబడిన అభిమానులు
- తొక్కిసలాట.చేతులెత్తేసిన పోలీసులు..సీఎం సిద్ధరామయ్య దిగ్భ్రాంతి

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవాల్లో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 11 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో అభిమానులకు తీవ్ర గాయాల పాలయ్యారు. 18 ఏళ్ల తర్వాత తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ అందుకున్న ఆర్సీబీ టీమ్‌ను.. చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్సీబీ ఆటగాళ్లను చూసేందు కు అభిమానులు భారీగా ఎగబడటంతో తొక్కిసలాట జరిగింది. భారీగా తరలివచ్చిన ఆర్సీబీ ఫ్యాన్స్‌ను అదుపు చేయడంలో పోలీసులు చేతులెత్తేయడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఆర్సీబీ విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట.. నలుగురు మృతి, 10 మందికి తీవ్ర గాయాలు మంగళవారం జరిగిన ఐపీఎల్ ఫైనల్‌లో పంజాబ్‌ను ఓడించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ఐపీఎల్ చరిత్రలో తొలిసారి కప్‌ను ముద్దాడింది. ఈ క్రమంలోనే గత 18 ఏళ్లుగా ఆర్సీబీ ఫ్యాన్స్ ఎదురుచూస్తున్న తరుణం రావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు.. తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు.. ఇవాళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి చేరుకుంది. ఈ క్రమంలోనే ఆర్సీబీ ఆటగాళ్లను చూసేందుకు ఫ్యాన్స్, జనం భారీగా ఎగబడ్డారు. ఆర్సీబీ విక్టరీ జరుపుకునేందుకు భారీగా అభిమానులు రావడంతో చిన్నస్వామి స్టేడియం వద్ద వేలాది మంది గుమిగూడారు.భారీగా వచ్చిన స్టేడియానికి పోటెత్తిన ఆర్సీబీ ఫ్యాన్స్‌ను అడ్డుకునేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నించారు. ఈ తొక్కిసలాటలో ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో అభిమానులు తీవ్ర గాయాల పాలయ్యారు.

## ఉద్యోగాలు పదిలం

- 73 శాతం భారతీయ నిపుణుల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం
- గతేడాదితో పోలిస్తే ఉద్యోగ ధీమా 11 శాతం పాయింట్లు వృద్ధి
- టైర్ 1 నగరాల్లోని 31 శాతం మంది ఉద్యోగంపై పూర్తి విశ్వాసం
- కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంపై 78 శాతం మంది సానుకూల వైఖరి
- కెరీర్ భవిష్యత్తు నైపుణ్యాభివృద్ధి ముఖ్యమన్న 85 శాతం మంది
- ఈ ఏడాది కొత్త టెక్నికల్ నైపుణ్యాలు నేర్చుకోవాలని 81% ప్రణాళిక

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమ ఉద్యోగాలు నిలబడతాయనే నమ్మకం భారతీయ నిపుణుల్లో గణనీయంగా పెరిగింది. దాదాపు పది మందిలో ఏడుగురికి పైగా (73 శాతం) ఉద్యోగులు తమ కొలువుల భద్రతపై విశ్వాసం వ్యక్తం చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 11 శాతం పాయింట్ల పెరుగుదల కావడం విశేషం. ప్రముఖ గ్లోబల్ ఎడ్‌టెక్ సంస్థ 'గ్రేట్ లెర్నింగ్' బుధవారం విడుదల చేసిన నివేదికలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. నివేదిక ప్రకారం, టైర్ 1 నగరాల్లోని 31 శాతం మంది నిపుణులు తమ ఉద్యోగ భద్రతపై పూర్తి విశ్వాసంతో ఉండగా, టైర్ 2 నగరాల్లో ఈ సంఖ్య 18 శాతంగా ఉంది. అలాగే, 5,000 మందికి పైగా ఉద్యోగులున్న పెద్ద సంస్థల్లో పనిచేస్తున్న వారిలో 85 శాతం మంది ఉద్యోగ భద్రతపై నమ్మకం వ్యక్తం చేయగా, 50 మంది కంటే తక్కువ సిబ్బంది ఉన్న చిన్న కంపెనీలలో ఈ శాతం 58 శాతానికే పరిమితమైంది.
కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్ కారణంగా ఉద్యోగ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నిపుణులు తమను తాము సన్నద్ధం చేసుకుంటున్నారు. సుమారు 78 శాతం మంది నిపుణులు ఏఐ తమ కెరీర్‌పై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసక్తికరంగా, బీఈ/బీటెక్ నేపథ్యం ఉన్నవారితో పోలిస్తే ఎంబీఏ (89 శాతం), బీకాం (84 శాతం) గ్రాడ్యుయేట్లు ఏఐ విషయంలో మరింత ఆశాజనకంగా ఉన్నారు. దేశీయ ఐటీ రంగంలో ఇటీవలి పరిణామాలే దీనికి కారణమని నివేదిక పేర్కొంది. సాంప్రదాయకంగా ప్రవేశ, మధ్య-స్థాయి నిపుణులను ఎక్కువగా నియమించుకునే అనేక పెద్ద ఐటీ కంపెనీలు, ఏఐ వినియోగం

## ఇక ఉద్యమ బాట

- గోదావరి నీళ్ల పరిరక్షణకు జాగృతి ఆధ్వర్యంలో
- ఉద్యమం నిర్వహించేందుకు కవిత సిద్ధం
- ఇప్పటికే తండ్రికి మద్దతుగా ధర్నా చేసిన కవిత
- కవిత పోరాటాలకు దూరంగా ఉన్న బీఆర్ఎస్ నేతలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కవిత లేఖ బీఆర్ఎస్ లో సంచలనంగా మారింది. కేటీఆర్ లక్ష్యంగా కవిత కీలక వ్యాఖ్యలు చేసారు. తండ్రి కేసీఆర్ కు మద్దతుగా నిలుస్తూనే కేటీఆర్ ను టార్గెట్ చేస్తున్నారు. కొత్త పార్టీ ఏర్పాటు.. పార్టీ మార్పుకు ఛాన్స్ లేదని కవిత క్లారిటీ ఇచ్చారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వటాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వేదిక నుంచి కాకుండా జాగృతి సంస్థ పేరుతో కవిత ధర్నా చేసారు. ఈ ధర్నాకు బీఆర్ఎస్ శ్రేణులు దూరంగా ఉన్నారు. కవిత కార్యాచరణను కేసీఆర్ నిశితంగా గమనిస్తున్నారు.
ఎమ్మెల్సీ కవిత వ్యవహారం కీలక మలుపు తీసుకుంది. కవిత బీఆర్ఎస్ వీడుతున్నారనే ప్రచారానికి ముగింపు దొరికింది. బీఆర్ఎస్ లో యాక్టివ్ గా వ్యవహరించిన కవిత.. ఇప్పుడు తన తండ్రి కోసం తన సొంత సంస్థ జాగృతి ద్వారా ధర్నా నిర్వహించారు. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ట్విట్టర్ లో స్పందిస్తే సరి పోతుందా అంటూ కేటీఆర్‌ను కవిత ఇప్పటికే టార్గెట్ చేసారు. ఇప్పుడు తన తండ్రి కోసం ధర్నా చేసారు కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా నోటీసులు ఇచ్చిందని కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. తెలంగాణకు నీళ్లు, నిధులు తీసుకురావటం కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బ్యారేజులు కాదని.. 21పంపు హౌస్‌లు, కాళేశ్వరంతో 35శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు వస్తున్నాయని స్పష్టం చేశారు.
కవిత చేసిన ఈ ధర్నాకు బీఆర్ఎస్ నేతలు దూరంగా ఉన్నారు. నీళ్లు ఇచ్చిన కేసీఆర్‌కు.. రేవంత్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడాన్ని

## ఏపీ క్వాంటం మిషన్ ఏర్పాటు

- కీలకమైన నిర్ణయాలు తీసుకున్న ఏపీ కేబినెట్
- 175 ఎంఎస్ఎంఈ పార్కులు, 17 ఖైదీలకు క్షమాభిక్ష..!
- శ్రీకాకుళంలోని ఉద్దానం, చిత్తూరు జిల్లా కుప్పంలోని పలు ప్రాంతాలకు ఆర్వో ప్లాంట్లకు నిధుల

2



**అమరావతి-నవభూమిబ్యూరో**
అమరావతి సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఏడాది పాలనలో 25 పేపర్ లెస్ కేబినెట్ భేటీలు నిర్వహించిన చంద్రబాబుకు మంత్రులు అభినందనలు తెలిపారు. శ్రీకాకుళంలోని ఉద్దానం, చిత్తూరు జిల్లా కుప్పంలోని పలు ప్రాంతాలకు ఆర్వో ప్లాంట్లకు నిధుల కేటాయింపులకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం 17 మంది యావజ్జీవ ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేయాలని కూడా నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత ఏదైనా నేరం చేస్తే క్షమాభిక్ష రద్దవుతుంది. ఎస్పీఎఫ్‌లో 248 కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ ఇవ్వడంతో పాటు ఆ మేరకు కానిస్టేబుళ్ల సంఖ్యను తగ్గించడానికి కేబినెట్ అంగీకారం తెలిపింది. వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడపగా మార్చేందుకు ఇచ్చిన నోటిఫికేషన్ కు ఆమోదం తెలిపింది. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో పోలీసు అకాడమీకి భూమి ఉచితంగా బదిలీకి ఆమోదం తెలిపారు. ఏలూరులో నిర్మించే హైదరాబాద్ ఐఇన్‌స్టిట్యూట్‌కు మాజీ ఐఏఎస్ దమయంతి ఉచితంగా ఇచ్చిన భూమిని బదలాయించేందుకు కూడా ఆమోదం తెలిపారు. దీనికి స్టాంప్ డ్యూటీ మినహాయిస్తారు. ఏపీ సీఆర్డీఏ తాజా

## ఇకపై అంగన్వాడీల్లో ఎగ్ బిర్యానీ

- వారానికి ఒకటి, రెండు సార్లు ఎగ్ బిర్యానీ వడ్డించేలా మెనూలో మార్పులు : మంత్రి సీతక్క
- చిన్నారులకు అందిస్తున్న ఆహారపదార్థాలను మరింత రుచికరంగా మారుస్తామన్న మంత్రి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. ఇకపై అంగన్వాడీల్లో వారానికి ఒకటి, రెండు సార్లు ఎగ్ బిర్యానీ వడ్డించేలా మెనూలో మార్పులు చేయబోతన్నట్లు

## గద్వాల ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ రైతుల ఆగ్రహం

- వాహనాలకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు
- రాజోలి మండలం పెద్ద ధన్వాడలో తీవ్ర ఉద్రిక్తత
- ఫ్యాక్టరీ వద్దంటూ 10 గ్రామాల ప్రజల నిరసన
- ప్రజలను అదుపు చేయలేకపోయిన పోలీసులు

2



**గద్వాల-నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లాలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు తీవ్ర ఉద్రిక్తతకు కారణంగా మారింది. ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానిక రైతులు తీవ్ర ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్న కంపెనీకి చెందిన వాహనాలను తగలబెట్టారు. గుట్టు చప్పుడు కాకుండా కంపెనీ పనులు ప్రారంభించేందుకు అక్కడికి వచ్చిన గాయత్రీ కంపెనీకి చెందిన వారిని

## అమరావతిలో వరల్డ్ క్లాస్ క్రికెట్ స్టేడియం

- అధికారులకు మంత్రి నారా లోకేశ్ ఆదేశాలు
- మంత్రి లోకేశ్ నివాసంలో ఉపాధి కల్పన మంత్రుల కమిటీ సమావేశం
- 11 నెలల్లో 9.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్న లోకేశ్
- ఈ ప్రాజెక్టుల ద్వారా 8.5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం అని వెల్లడి

2



**అమరావతి-నవభూమిబ్యూరో**
గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాధించలేని భారీ పెట్టుబడులను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కేవలం 11 నెలల స్వల్ప వ్యవధిలోనే రాష్ట్రానికి తీసుకువచ్చిందని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి, ఉపాధి కల్పన మంత్రుల కమిటీ ఛైర్మన్ నారా లోకేశ్ అన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో, 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంపై ఏర్పాటు చేసిన మంత్రులు, ఉన్నతాధికారుల కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.

## 4,302కు చేరిన కోవిడ్ కేసులు

- కోవిడ్‌తో 24 గంటల్లో ఏడుగురు మృతి
- మహారాష్ట్రలో 4, తమిళనాడు, ఢిల్లీలో ఒక్కొక్కరు చొప్పున మృతి
- కేరళలో తాజాగా 43 కేసులు..మొత్తం కేసుల సంఖ్య 1,373
- కొత్త వేరియెంట్లను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** దేశంలో మరోసారి కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. కొవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య 4,302కు చేరినట్టు కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో ఏడుగురు మృతి చెందినట్టు సమాచారం. వీరిలో ముగ్గురు 22-27 ఏళ్ల మధ్యలో ఉన్నారని, వీరిలో శ్వాస సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నాయని చెబుతున్నారు. మహారాష్ట్రలో 4, తమిళనాడు, ఢిల్లీలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు.
కొవిడ్ యాక్టివ్ కేసుల్లో ముందున్న కేరళలో తాజాగా 43 కేసులు వెలుగుచూడటంతో మొత్తం కేసుల సంఖ్య 1,373కు చేరింది. పశ్చిమబెంగాల్‌లో కొత్తగా 60 కేసులు నమోదై 432కు చేరుకున్నాయి. ఢిల్లీలో కొత్తగా 64 కేసులు నమోదై 457కు చేరింది. గత కరోనా మహమ్మారి సమయంలో తీవ్ర ప్రభావం కనిపించిన మహారాష్ట్రలో కొత్తగా 16 యాక్టివ్ కేసులు నమోదు కావడంతో మొత్తం కేసుల సంఖ్య 510కి చేరింది.
వ్యాధి లక్షణాలు కనిపించిన వారిలో సబ్‌వేరియంట్స్ ఎల్.7, ఎన్‌బీ.1.8.1లు వేరియంట్లుగా గుర్తించామని, అయితే ఇవి ఆందోళన కలిగించే వేరియంట్లా కాదా అనేది మానిటర్ చేస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల తెలిపింది.
కాగా, కొత్త సబ్ వేరియంట్లు వెలుగుచూస్తున్నప్పటికీ జేఎన్-1 వేరియంట్ ఎక్కువ మందిలో కనిపిస్తోందని, 53 శాతం పాజిటివ్ కేసుల్లో ఈ వేరియంట్ కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్‌లో తమిళనాడులో ఎన్‌బీ.1.8.1 వేరియంట్ కనిపించగా, ఈ నెల ప్రారంభంలో గుజరాత్‌లో నాలుగు కేసుల్లో ఎల్ఎఫ్.7 ఉన్నట్టు గుర్తించారు. ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని, శ్వాససంబంధిత ఇబ్బందులు, గొంతు సమస్యలు, జీర్ణాశయంలో ఇబ్బందులు ఉంటే సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని

## 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కలకు ముహూర్తం

- 2027 మార్చి 1 నుంచి దేశంలో తదుపరి జనాభా గణన
- 70 ఏళ్ల తర్వాత తొలిసారిగా కులాల వారీగా వివరాల సేకరణ
- జమ్మూ కాశ్మీర్, లడఖ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబర్‌లోనే ప్రారంభం
- పారదర్శకత కోసమే కుల గణన అంటున్న కేంద్ర ప్రభుత్వం
- 2011 తర్వాత ఇదే మొదటి జనాభా లెక్కింపు

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
భారతదేశంలో తదుపరి దేశవ్యాప్త జనాభా గణన (సెన్సస్) 2027 మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానుందని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఈసారి సెన్సస్‌లో ఒక కీలక మార్పు చోటుచేసుకోనుంది. దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత తొలిసారిగా కులాల వారీగా వివరాలను కూడా సేకరించనున్నారు. ఈ మేరకు సెన్సస్ చట్టం, 1948, మరియు సెన్సస్ నియమాలు, 1990 ప్రకారం రెండు దశల్లో ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.
కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో ఈ ప్రక్రియ ముందుగానే ప్రారంభం కానుంది. ముఖ్యంగా మంచుతో కప్పబడిన, ఏకకాలంలో గణన సాధ్యం కాని ప్రాంతాలైన లడఖ్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని భాగాలు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 2026 అక్టోబర్ నుంచే జనాభా గణన మొదలవుతుంది. ఈ ప్రాంతాలకు 2026 అక్టోబర్ 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను రిఫరెన్స్ తేదీగా నిర్ణయించారు. మిగిలిన దేశానికి 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలు రిఫరెన్స్ తేదీగా ఉంటుంది. ఈ రిఫరెన్స్ తేదీలను వివరిస్తూ అధికారిక ప్రకటన 2025 జూన్ 16న అధికారిక గెజిట్‌లో ప్రచురితమయ్యే అవకాశం ఉంది.
కులాల వివరాలను జనాభా గణనలో చేర్చాలన్న నిర్ణయాన్ని ఏప్రిల్ 30న జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ధృవీకరించారు. ఈ చర్య పారదర్శకతను, జాతీయ స్థాయిలో ఏకరూపతను తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. "కొన్ని రాష్ట్రాలు కుల సర్వేలను పారదర్శకంగా నిర్వహించాయి, కానీ మరికొన్ని అలా చేయలేదు. ఈ వ్యత్యాసాలు సందేహాలకు

# మాగంటి గోపినాథ్ శవ రాజకీయాలు: ఫసియుద్దీన్ ఆరోపణ



**హైదరాబాద్-నవభూమి:** జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కంటతడి పెట్టుకున్నారు. బొరబండకు చెందిన సర్దార్ మరణాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేమాగంటి గోపీనాథ్ రాజకీయం చేశారని ఆయన ఆరోపించారు. సర్దార్ ఆత్మహత్య చేసుకున్నా.. తానే కారణమన్నట్లుగా ఎమ్మెల్యే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై దాడి చేయించేందుకు గోపీనాథ్ ప్రయత్నించారని ఆరోపించారు. సర్దార్ మరణానికి తాను కారణం కాదని అంతిమ మాగంటి గోపినాథ్ శవ రాజకీయాలు..ఈ సందర్భంగా బుధవారం ఫసియుద్దీన్ మీడియాతో మాట్లాడారు. సర్దార్ తనకు దగ్గరి వాడని .. అతని మరణం తనను కలిచి వేసిందని అన్నారు. సర్దార్ చనిపోయాడని తెలియగానే వెళ్లాలనుకున్నానని, కానీ అక్కడ తనను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్దార్ ప్రమాదవ శాత్తు చనిపోయాడని పోలీసులు రిపోర్ట్ కూడా ఇచ్చారని.. కానీ సూసైడ్ చేసుకున్నాడని ఎమ్మెల్యే మాగంటి అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు.

మాగంటి గోపినాథ్ శవ రాజకీయాలు చేశారని, తనపై, తన ఇంటిపై మాగంటి దాడి చేయించడానికి ప్రయత్నించారని అన్నారు. తనపై దాడి చేయాలని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించారని అన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై నగర కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. కొంత మంది రౌడీ షీటర్లతో తనకు ప్రాణ హాని ఉందని.. ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరుతున్నానని ఫసియుద్దీన్ అన్నారు.

## నవ వార్త





# ఇఫ్లూలో పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల




**హైదరాబాద్-నవభూమి:** ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) లో వివిధ పీజీ డిప్లొమా కోర్సులతోపాటు పీహెచ్‌డీ ప్రవేశాలకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం లింక్, ఇతర వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ **www.efluniversity.ac.in** లో చూసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 040 - 27689647, 27689481, 27689733 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# తెలంగాణ టెట్ ఎగ్జామ్స్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్-నవభూమి:** ఉపా ధ్యాయ అర్హత పరీక్ష (టెట్) 2025 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటీ ) పద్ధతిలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. రోజూ రెండు సెషన్లలో ఉ.9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జూన్ 9 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది. ఈసారి టెట్‌కు 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి ఎగ్జామ్ షెడ్యూల్ కోసం టెట్ వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు.




# బక్రీద్ రోజున వీరికి బడి బాట నుంచి మినహాయింపు

**హైదరాబాద్-నవభూమి:** బక్రీద్ పండుగ సందర్భంగా ఈనెల 7వ తేదీన ముస్లిం టీచర్లకు బడిబాట కార్యక్రమం నుంచి మినహాయింపునిస్తూ పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉపాధ్యాయ సంఘాల వినతి పత్రం మేరకు ఈనెల ఏడో తారీఖు బడిబాట నుంచి ముస్లిం ఉపాధ్యాయులకు మినహాయింపునిచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు.




# నిర్మానుష్య ప్రదేశంలో బ్యాగ్.. తెరిచి చూస్తే షాక్



**హైదరాబాద్-నవభూమి:** నగరంలోని బాచుపల్లి మహిళ మృతదేహం కలకలం రేపుతోంది. ట్రావెల్ బ్యాగ్‌లో మహిళ డెడ్‌బాడీని పోలీసులు గుర్తించారు. బ్యాగులో కుళ్లి స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైంది. అసలు ఆ మహిళ ఎవరు, ఎక్కడి నుంచి తీసుకువచ్చారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీ నిర్మానుష్య ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సూట్‌కేస్‌లో మహిళ మృతదేహాన్ని వదిలి వెళ్లారు. బ్యాగ్ నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు బ్యాగ్‌ను పరిశీలించగా.. మహిళ డెడ్‌బాడీ బయటపడింది. మృతురాలు సుమారు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండి, మెరూన్ కలర్ పంజా డ్రెస్‌తో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.దాదాపు మూడు నుంచి నాలుగు రోజుల ముందు యువతిని చంపిన తర్వాత ఓ పథకం ప్రకారమే నిర్మానుష్య ప్రదేశంలో పడేసినట్లు తెలుస్తోంది. బాల్‌నగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు ఏర్పడి.. మృతురాలి ఆచూకీ, హత్య చేసిన వారి వివరాల కోసం దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మహిళ ఎవరు, ఏంటి అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మహిళ ఎవరనేది గుర్తిస్తే నిందితులు ఎవరనేది దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇద్దరు వ్యక్తులు అనునాస్పదంగా ఆ నిర్మానుష్య ప్రదేశంలో తిరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజ్‌ను ఆధారంగా చేసుకుని దర్యాప్తు కొనసాగుతోంది.

# ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్.. మంత్రి దామోదర్ ఏమన్నారంటే..

**హైదరాబాద్-నవభూమి:** ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ అవతరణ దినోత్సవం (జూన్2)రోజున ఫుడ్ పాయిజన్ ఘటన జరిగిందని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 92 మంది రోగులు ఫుడ్ పాయిజన్ కారణంగానే అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో అస్వస్థతకు గురైన బాధితులను మంత్రి దామోదర ఇవాళ(బుధవారం) పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో మంత్రి మాట్లాడారు.ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి దామోదర మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించాలని మంత్రి దామోదర ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని చెప్పుకొచ్చారు. డైయిట్ కారణంగానే ఈ ఫుడ్ పాయిజాన్ జరిగినట్లుగా తెలుస్తోందని అన్నారు.

ఆ రోజు ఒక స్వీట్ కూడా అదనంగా రోగులకు ఇచ్చారని వివరించారు మంత్రి దామోదర రాజనర్సింహ.


# ఈ అల్లంవెల్లుల్లి పేస్ట్ తింటే డైరెక్ట్‌గా కోమాలోకే



**హైదరాబాద్-నవభూమి:** నేటి కాలంలో ఏం తినాలన్నా భయపడే పరిస్థితుల్లో ఉన్నాం. కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా రెచ్చిపోతున్నారు కొందరు కేటుగాళ్లు. తాగే నీటి నుంచి ఖరీదైన సుగంధ ద్రవ్యాల వరకు ప్రతి దాన్ని కల్తీ చేసి.. జనాల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. ఒకప్పుడంటే.. తినే ప్రతి దాన్ని స్వయంగా ఇంట్లోనే తయారు చేసుకునే వారు. పంటలకు కూడా పెద్దగా రసాయనాలు వాడే వారు కాదు. దీంతో అప్పుడు కల్తీలు, రసాయనాల బెడద పెద్దగా లేదు.కానీ నేటి కాలంలో.. మనం తినే తిండిలో ఏది కల్తీనో.. ఏది మంచిదో తెలుసుకోవడం చాలా కష్టం అవుతుంది.ఇక కల్తీరాయుళ్ల పని పట్టడానికి ఫుడ్ సేఫ్టీ అధికారులు నిత్యం తనిఖీలు చేస్తున్నప్పటికీ వీరు మాత్రం మారడం లేదు. తాజాగా హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ బయట పడింది. దీన్ని తింటే కిడ్నీ సమస్యలే కాక.. డైరెక్ట్‌గా కోమాలోకి వెళ్లే అవకాశం ఉందంటున్నారు అధికారులు. ఆ వివరాలు..తాజాగా పాతబస్తీ బండ్లగూడలో పోలీసులు తనిఖీ నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ ప్రాంతంలోని కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి చేసి.. భారీ పరిమాణంలో నిల్వ ఉంచిన కల్తీ అల్లంవెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్ చేశారు. సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తాజాగా.. పటేల్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహమ్మద్ ఫైసల్ అనే వ్యక్తి ఇంట్లో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించారు. ఇతడుఎఫ్‌కే ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో హానికరమైన రసాయనాలను ఉపయోగించి తయారు చేసిన కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టును ప్రజలకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ఈ కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారీ కోసం మహమ్మద్ ఫైల్.. టైటానియమ్ డైఆక్సైడ్, పసుపుపొడిని వినియోగిస్తున్నాడని అధికారులు తెలిపారు. ఈ రెండింటిని కలిపి కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నాడు. మహమ్మద్ తయారు చేసిన అల్లం వెల్లుల్లి పేస్ట్.. భారత ప్రభుత్వం సూచించిన ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్‌ని పాటించడం లేదని అధికారులు గుర్తించారు.టైటానియమ్ డైఆక్సైడ్‌తో తయారు చేసిన ఈ అల్లంవెల్లుల్లి పేస్ట్ వినియోగిస్తే.. కిడ్నీలు పాడవుతాయని.. చివరకు కోమాలోకి వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇక ఈ దాడుల్లో 870 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, 4 కిలోల టైటానియమ్ డైఆక్సైడ్, 4 కిలోల పసుపుపొడి, 16 కిలోగ్రాముల మోనో సైట్రేట్‌ను స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఇలాంటి కల్తీ ఆహారం పట్ల జనాలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# పెళ్లి సంబందాల కోసం ఆన్లైన్‌లో వెతుకుతున్నారా



**హైదరాబాద్-నవభూమి:** ఒకప్పుడు పెళ్లి సంబంధాలు అంటే పెళ్లిల్లపేరయ్యలు సెట్ చేసేవారు. చాలా వరకు బంధువులు, స్నేహితులు సంబంధాల గురించి చెప్పేవారు. పెళ్లి చూపులకు వెళ్లి నచ్చితే.. వెంటనే ముహుర్తాలు పెట్టుకునేవారు. కానీ నేడు పరిస్థితి మారింది. ప్రస్తుతంపెళ్లి చేయాలంటే మ్యారేజ్ బ్యూరోలను సంప్రదించాలి.. ఆన్‌లైన్‌లో సంబంధం కోసం సర్చ్ చేయాలి. మరీ మీలో కూడా ఎవరైనా పెళ్లిసంబంధాల కోసం ఇలా ఆన్లైన్‌లో సర్చ్ చేస్తున్నారా.. అయతే పోలీసులకు మీ కోసం కీలక అలర్ట్ జారీ చేశారు. ఆ వివరాలు..పెళ్లి సంబంధాల కోసం ఆన్‌లైన్‌లో సర్చ్ చేసేవారికి పోలీసులు కీలక అలర్ట్ జారీ చేశారు. మాట్రిమోనియల్ వెబ్‌సైట్లలో ఫేక్ ప్రొఫైల్స్ ఉండొచ్చు జాగ్రత్త అంటున్నారు. ఆకర్షణీయమైన ఫొటోలు చూసి.. మోసపోవద్దని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ పోలీసులు తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ చేశారు. పెళ్లి సంబంధాల పేరుతో అపరిచిత వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు చెప్పవద్దని సూచించారు.స్కామ్ అలర్ట్ పేరిటి చేసిన ఈపోస్టులో పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యమి తెలిపారు. పెళ్లిసంబంధాల కోసం ఆన్‌లైన్‌లో సర్చ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రొఫైల్ ఫోటో చూసి మోసపోవద్దని.. తెలియని వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు ఇవ్వవద్దని తెలిపారు. అంతేకాక తియ్యని మాటల మోజులో పడి.. డబ్బులు పంపకండి అనిహెచ్చరించారు. ఇప్పుడు ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.మన దగ్గర గత కొంత కాలంగా పెళ్లి సంబంధాల పేరిట చోటు చేసుకుంటున్న మోసాల సంఖ్య భారీగా పెరిగిపోతుంది. కొన్ని సందర్భాల్లో తెలిసిన వారే ఇలాంటి మోసాలకు పాల్పడుతుండటం గమనార్హం. కొన్ని రోజులు క్రితం రెండో వివాహం చేసుకోవాలని వారికి పెళ్లి సంబంధాలు చూస్తామంటూ ఇద్దరు మహిళలు ఘరానా మోసానికి పాల్పడిన సంగతి తెలిసిందే. తాజాగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇక మరో చోట ఓ వ్యక్తి పెళ్లి సంబంధం పేరుతో స్నేహితుడినే నిండా ముంచాడు. పెళ్లి సంబంధం పేరుతో స్నేహితుడికి యువతిని పరిచయం చేసిన కేటుగాడు.. ఆ తర్వాత అందినకాడికి డబ్బు దోచుకుని పరారయిన ఘటన కూడా వెలుగు చూసింది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకునే పోలీసులు ఇలాంటి అలర్ట్ జారీ చేశారు.

# అమరావతిలో వరల్డ్ క్లాస్ క్రికెట్ స్టేడియం

**(1వపేజీ తరువాయి)** రాష్ట్రానికి కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించేందుకు యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకోసం ఒక సమగ్ర స్కిల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని మంత్రి లోకేశ్ అన్నారు.

బీసీసీఐ సహకారంతో అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు వేగవంతం చేయాలని, దీని ద్వారా కూడా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు అనుమతుల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు, వాట్సాప్ గవర్నెన్స్‌తో అనుసంధానం చేయాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి 9.20 లక్షల కోట్ల రూపాయల విలువైన 78 భారీ పరిశ్రమలు, అలాగే 13,895 కోట్ల రూపాయల విలువైన 1,19,580 చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని మంత్రి లోకేశ్ వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని యువతకు సుమారు 8.5 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు, అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వస్తున్న ఎన్టీపీసీ, బీపీసీఎల్, రిలయన్స్, టాటా పవర్ వంటి పెద్ద సంస్థల కోసం ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ)లో పరిశ్రమల వారీగా ప్రత్యేక ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్లను (పీఎంయూ) ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలు వాస్తవంగా ప్రారంభమయ్యే వరకు ఈ యూనిట్లు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు అవసరమైన భూమి కేటాయింపులతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి అతిపెద్ద తీరప్రాంతం ఉన్నందున పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, ముఖ్యంగా బీచ్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

విశాఖపట్నంలో ఒబెరాయ్, వరుణ్ బీచ్ శాండ్స్ వంటి ప్రఖ్యాత స్టార్ హొటళ్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయడంతో పాటు, ప్రభుత్వం తరఫున విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని చెప్పారు. రాష్ట్రంలో బీచ్ శాండ్, కోల్ గ్యాసిఫికేషన్ మైనింగ్ రంగాల్లో కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను అన్వేషించాలని సూచించారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ద్వారా ఎక్కువ మందికి ఉపాధి లభించే అవకాశం ఉన్నందున, ఆయా పరిశ్రమలకు ఆర్థిక చేయూత అందించేందుకు పీఎంఈజీపీ (ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్) పథకంతో అనుసంధానించాలని అధికారులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో, ఒకవైపు కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తూనే, మరోవైపు ఇప్పటికే అంగీకరించిన ప్రాజెక్టులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ' విధానాలను అమలు చేస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే కంపెనీలతో నేరుగా సంప్రదింపులు జరపాలని మంత్రి లోకేశ్ ఉన్నతాధికారులకు సూచించారు.ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో సాయికాంత్ వర్మ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్, ఎన్ఆర్ఈడీసీఏపీ వీసీ అండ్ ఎండీ కమలాకర్ బాబు, గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కలకు ముహూర్తం

**(1వపేజీ తరువాయి)**తావిచ్చాయి, సామాజిక సామరస్యానికి భంగం కలిగించే అవకాశం ఉంది" అని వైష్ణవ్ పేర్కొన్నారు.

భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. ఆ తర్వాత 2021లో జరగాల్సిన సెన్సస్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయి, 2020 ఏప్రిల్ 1 నుంచి క్షేత్రస్థాయి పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి కారణంగా నిరవధికంగా వాయిదా పడింది. 2011 జనాభా గణన రెండు దశల్లో జరిగింది. ఇంటింటి గణన, గృహ గణన ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2010 వరకు, జనాభా లెక్కింపు ఫిబ్రవరి 2011లో జరిగాయి.

రాబోయే జనాభా గణనలో కులాల వివరాలను చేర్చడం ఒక చరిత్రాత్మక పరిణామంగా పరిగణిస్తున్నారు. బ్రిటిష్ వారి హయాంలో 1881 నుంచి 1931 మధ్య చివరిసారిగా సమగ్రమైన కులాల వారీ గణన జరిగింది. 2011లో యూపీఏ ప్రభుత్వం సామాజిక-ఆర్థిక కుల గణన చేపట్టి, కులాల సమాచారాన్ని సేకరించినప్పటికీ, ఆ డేటాను పూర్తిగా ప్రచురించడం గానీ, ఉపయోగించడం గానీ జరగలేదు. పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా మాట్లాడుతూ, సమాజంలో లోతుగా పాతుకుపోయిన నిర్మాణాత్మక అసమానతలను వెలికితీయడానికి, సమ్మిళిత విధానాలను రూపొందించడానికి కుల గణన చాలా అవసరమని గతంలో అభిప్రాయపడ్డారు.

# ఇకపై అంగన్వాడీల్లో ఎగ్ బిర్యానీ

**(1వపేజీ తరువాయి)**ప్రకటించారు. అలానే అంగన్వాడీల ద్వారా చిన్నారులకు అందిస్తున్న ఆహారపదార్థాలను మరింత రుచికరంగా మారుస్తామని తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివద్ధి సంస్థలో బుధవారం నాడు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధోమధన సదస్సులో సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై చర్చించడమే కాక కీలక ప్రకటనలు చేశారు. ఆ వివరాలు..చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. వారికి అంగన్వాడీల ద్వారా అందిస్తున్న విద్య, ఆరోగ్య భద్రత అంశాలను మెరుగుపరుచుకునే లక్ష్యంతో పని చేయాలని సూచించారు. అలానే అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీలు, బాలింతలు కింద కూర్చోవాలంటే.. ఇబ్బందిపడుతున్నారని తాము గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. ఈసమస్యలను తొలగించేందుకు.. త్వరలోనే అంగన్వాడీకేంద్రాలకు బెంచీలను సరఫరా చేస్తామని ప్రకటించారు. అలానే ప్రస్తుతం అంగన్వాడీ టీచర్లు వాడుతున్న మొబైల్ ఫోన్ల స్థానంలో అధునాతనమైన వాటిని అందజేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.అలానే బడిగంట తరహాలోనే.. అంగన్వాడీ కేంద్రాల్లో కూడా బెల్స్ విధానం తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. గంట మోగించడం ద్వారా చిన్నారుల్లో బాల్యం నుంచే క్రమశిక్షణ, ఉత్సాహం, పెరుగుతాయని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల మీద పని ఒత్తిడి తగ్గించేందుకు త్వరలోనే 14 వేల ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. ప్రైవేటే ప్లే స్కూల్స్‌కి దీటుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతున్నామని చెప్పుకొచ్చారు.

# ఉద్యోగాలు పదిలం

**(1వపేజీ తరువాయి)** పెరగడంతో నియామకాలను తగ్గించాయి. ఈ మార్పు టెక్నాలజీ డిగ్రీలున్న నిపుణుల దృక్పథాన్ని ప్రభావితం చేసిందని నివేదిక తెలిపింది.

2026 ఆర్థిక సంవత్సరంలో, తమ కెరీర్‌లను భవిష్యత్తుకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవడానికి నైపుణ్యాభివృద్ధి (అప్‌స్కిల్లింగ్) ప్రాముఖ్యతను 85 శాతం మంది నిపుణులు గుర్తించారు. గత ఏడాది ఇది 79 శాతంగా ఉంది. ఈ ఏడాది కొత్త సాంకేతిక నైపుణ్యాలను సంపాదించడానికి 81 శాతం మంది పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. టైర్ 1 నగరాల్లోని నిపుణులు ఈ విషయంలో మరింత ఉత్సాహంగా ఉన్నారు. వీరిలో 46 శాతం మంది అప్‌స్కిల్లింగ్‌ను 'అత్యంత ముఖ్యం'గా భావిస్తుండగా, టైర్ 2 నగరాల్లో ఈ సంఖ్య 26 శాతంగా ఉంది.

# ఏపీ క్వాంటం మిషన్ ఏర్పాటు



**(1వపేజీ తరువాయి)**భేటీలో తీసుకున్న నిర్ణయాల్ని ఆమోదించారు. ఏపీ పరిశ్రమల బిల్లు ద్వారా కార్మిక రంగ సంస్కరణలు, పారిశ్రామిక సంస్థలపై భారం తగ్గించడానికి ఆమోదం తెలిపారు.ఈ సవరణవల్ల మహిళలు రాత్రిపూట కూడా పనిచేసేందుకు భద్రత, రవాణా తదితర సౌకర్యాలు కల్పించేందుకు వీలు కలుగుతుంది. విశాఖలో హరిత హొటల్ యాత్రీ నివాస్ ఆధునీకీకరణ పనులకు అనుమతుల ధృవీకరణకు కేబినెట్ అంగీకారం తెలిపింది. అమరావతిలో ఏపీ క్వాంటం మిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ డే కోసం పిలిచిన టెండర్లకు ఆమోదం తెలిపారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి నిర్ణయం తీసుకున్నారు.

# ఆర్సీబీ విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట

**(1వపేజీ తరువాయి)**తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా జరగడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు పరిహారం ప్రకటిస్తున్నాం. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తాం. మరణించినవారిలో యువత ఎక్కువగా ఉన్నారు. చిన్నస్వామి స్టేడియం సామర్థ్యం 35వేలు అయితే దాదాపు 2 లక్షల మంది వచ్చారు. దీంతో తొక్కిసలాట జరిగింది" అని కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య తెలిపారు.

# గద్వాల ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ రైతుల ఆగ్రహం

**(1వపేజీ తరువాయి)**అడ్డుకున్నారు.

**ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా కార్లు, టెంట్ లు ధ్వంసం చేసిన రైతులు**

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు తీవ్రస్థాయిలో నిరసన బాట పట్టారు. గద్వాల్ జిల్లాలోని పెద్ద ధన్వాడలో దీంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో కంపెనీ తరఫున పనులు చేయడానికి ఈరోజు పలు వాహనాలు వచ్చిన క్రమంలో ఆగ్రహానికి లోనైన స్థానిక రైతులు ఫ్యాక్టరీ పనులు చేయడానికి వచ్చిన వాహనాలను తగలబెట్టారు. గాయత్రి ఇథనాల్ కంపెనీకి చెందిన కార్లు, టెంట్లను రైతులు ధ్వంసం చేశారు.

**కాలుష్యం కోరల్లో గ్రామాలు చిక్కుకుంటాయని ఆందోళన**

కంటైనర్ డబ్బాలకు రైతులు నిప్పు పెట్టారు. కంపెనీకి చెందిన నిర్మాణపనులు చేయిస్తున్న కూలీలను రైతులు తరిమికొట్టారు. ఈ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న రైతులు ఒకవేళ ఈ కంపెనీ ఏర్పాటు చేస్తే ధన్వాడ చుట్టుపక్కల ఉన్న పది గ్రామాల ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానది తీరంలో ఇటువంటి ఫ్యాక్టరీల ఏర్పాటు వల్ల పర్యావరణానికి తీరని నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు.

**స్థానిక రైతుల డిమాండ్ ఇదే**

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు అనుమతులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, సమీప గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో, దీంతో ఆందోళన చేస్తున్న రైతులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. రైతులు ఆందోళన చేపట్టనున్నారన్న సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలం వద్ద మోహరించినా రైతుల ఆందోళనను పోలీసులు అదుపు చేయలేకపోయారు.భారీ సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకోవడంతో పోలీసులు వారిని కంట్రోల్ చేయడంలో విఫలమయ్యారు. దీంతో రైతులు కంపెనీకి చెందిన వాహనాలను ధ్వంసం చేశారు. 10 గ్రామాల రైతులు ఆందోళన చేపట్టి, ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు.

# ఇక ఉద్యమ బాట

సహించమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబు ఏపీకి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే.. మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేదా అని నిలదీశారు. వెంటనే రేవంత్‌రెడ్డి.. అపెక్స్ కౌన్సిల్, కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు చిన్న సమస్యలు సాధారణ మేనని తెలిపారు. కుంగిన మేడిగడ్డ పిల్లర్‌కు రిపేర్ చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు మీద ఆధారపడి బీజేపీ.. కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. గోదావరిలో వెయ్యి టీఎంసీల నీళ్లు వచ్చేవరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు.

## పేరు మార్పు ప్రకటన

నేను, రామారావు సంకుల, తండ్రి పేరు వెంకటేశ్వర రావు, H.No. 9-15, గుర్రాలచెరువు, అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ - 507301.

నా పెద్ద కుమారుని పేరు అలెగ్జాండర్ (వయసు 5 సం.) నుండి అలెగ్జాండర్ మహాదేవ్‌గా, మరియు నా చిన్న కుమారుని పేరు స్టాలిన్ (వయసు 3 సం.) నుండి అనిరుద్ మహాదేవ్‌గా మార్చిన విషయాన్ని పత్రిక ద్వారా ప్రకటిస్తున్నాను. ఇందుకు అనుగుణంగా వారు ఇక నుండి పై కొత్త పేర్లతో పిలవబడతారు మరియు అన్ని అధికారిక ప్రయోజనాలకూ ఈ పేర్లనే ఉపయోగిస్తారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ గురువారం 05 జూన్ 2025

## ఇథనాల్ ఫ్యాక్టరీపై వ్యతిరేకత.. ప్రజల్లో ఆగ్రహావేశం.. వాహనాలకు నిప్పు

**గద్వాల-నవభూమి:** జిల్లాలోని రాజోలి మండలంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పెద్ద ధన్వాడ ప్రతిపాదిత ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ 12 గ్రామాల ప్రజలు ఈరోజు (బుధవారం) నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇందుకు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో ఉదయం నుంచి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎవ్వరినీ కూడా ఇథనాల్ కంపెనీ పరిసరాల్లోకి రానీయకుండా గట్టి భద్రతను కల్పించారు. అంతేకాకుండా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని హౌజ్ అరెస్ట్ చేసి ఇంట్లో నుంచి బయటకు రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఉగ్రరూపం దాల్చింది. తాము శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తుంటే పోలీసులు అరెస్టులు ఎలా చేస్తారంటూ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ఏర్పాటు చేసే స్థలానికి పలు గ్రామాల ప్రజలు చేరుకున్నారు. కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇథనాల్ కంపెనీ కోసం ఏర్పాటు చేసిన కంటైనర్‌కు నిప్పు పెట్టారు. పలు వాహనాలను కూడా ధ్వంసం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. ఆందోళనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఇథనాల్ కంపెనీ వద్దంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శాంతియుతంగా చేసే నిరసనలకు అనుమతి ఇవ్వకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇథనాల్ కంపెనీ వల్ల జరిగే అనర్థాల గురించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అఖిలపక్షం నేతలు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో చిత్తనూర్ వద్ద ఉండే ఇథనాల్ కంపెనీ నుంచి వచ్చే దుష్పరిణామాల నేపథ్యంలో రాజోలు వద్ద పెద్దధన్వాడ గ్రామంలో ఇథనాల్ కంపెనీని పెట్టవద్దంటూ చాలా రోజులుగా నిరసనలు కొనసాగుతున్నాయి.

## ఆర్థిక స్వావలంబనకే శాంతికి పునాది

"2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తాం" అని ప్రధాని మోదీ సంకల్పం ప్రకటించారు. కానీ, మాటలతో కాదు... దేశాన్ని ముందుకు నడిపించేది చేతలే. దేశానికి ఉన్న కలలు ఎంతో గొప్పవిగా ఉన్నాయి. కానీ ఆ కలలు నిజమవ్వాలంటే కళ్లలో ఉత్సాహం, చేతుల్లో శ్రమ, పాలకుల వద్ద పాలనలో పట్టుదల అవసరం. భారత్ ఇప్పుడు ఒక దశకు చేరుకుంది మళ్లీ వెనక్కి తగ్గాలా, లేక దూసుకెళ్లాలా అన్న సందిగ్ధంలో ఉంది. ఒకవేళ మోదీ చూపిన దారి నడవాలంటే... చర్యలే ప్రధానము. ప్రతిజ్ఞలు గొప్పగా ఉన్నాయి. కానీ ప్రతీ ప్రతిజ్ఞకు ప్రత్యక్ష ఫలితాలున్నప్పుడే ప్రజలు విశ్వసిస్తారు. 2047 కల నిజమవ్వాలంటే, ఇప్పుడు నుంచే మార్పు అవసరం. విజన్ ఉంది. వేదిక సిద్ధం. కానీ వృద్ధిరేటు వేచి ఉండదు. చేతలు కదలాల్సిన సమయం ఇదే. చైనా మూడు దశాబ్దాలు శ్రమించి అభివృద్ధిని అందుకుంది. మనకు అలాంటి ఓ నిర్ణయాత్మక శ్రమ ఏదైనా మొదలైందా? ఈ దేశానికి మాటలు వినడం అలవాటు అయింది. ఇప్పుడు చేతల్లో మార్పు కనిపిస్తేనే దేశం మారుతుందని ప్రజలు నమ్ముతున్నారు. దేశ అభివృద్ధికి శ్రద్ధ, వ్యూహం, సమష్టి కృషి అవసరం. శబ్దాల కన్నా కార్యాచరణ మిన్న. విజన్ వికసిత్ భారత్. మార్గం కష్టం. దీక్ష ఉన్నదా? ప్రశ్న ఇప్పుడిదే. పర్యవేక్షణలూ, ప్రణాళికలూ పుష్కలంగా ఉన్నాయి. కానీ గమ్యం చేరాలంటే వాటిని మట్టిపట్టాలుగా మలచే శక్తి అవసరం.

భారత్ ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితుల్లో చిక్కుకున్నది. చైనాతో మనకు సరిహద్దు సమస్యలున్నాయి. చైనాకు అమెరికాకు పొసగదు. అయినప్పటికీ, ఈ రెండు దేశాలూ పాకిస్థాన్‌కు ఎంతో దగ్గర. ఇప్పుడు అలాంటి పాక్‌తో మనం ఘర్షణలకు దిగాం. ఇక, భారత్‌కు పొరుగున ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్, మాల్దీవులతోనైనా మనకు సత్సంబంధాలున్నాయా? అంటే, అవును అంటూ గట్టిగా చెప్పలేని పరిస్థితి. ఇవన్నీ గమనించే.. ప్రధాని మోదీ 'ఇది యుద్ధాల సమయం కాదు.. బలంగా ఉంటేనే శాంతి స్థాపన జరుగుతుంది' అని ప్రకటించారు. ఇక్కడ బలమంటే సైనిక శక్తి మాత్రమే కాదు, దేశ ఆర్థిక స్థిరత్వం కూడా. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశానికి ఇప్పుడు ఆర్థికపరిపుష్టి ఎంతో అవసరం.

22 ఏండ్లు కష్టపడాల్సిందే..: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని 'వికసిత్ భారత్' పేరిట ప్రధాని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్థిక పరిమాణం విషయంలో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపడమే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇది జరుగాలంటే వచ్చే 22 ఏండ్ల పాటు భారత జీడీపీ వృద్ధిరేటు కనీసం 7.8 శాతంగా నమోదవ్వాలని గత నెలలో ప్రపంచబ్యాంకు ఓ నివేదికలో వెల్లడించింది. అయితే, గడిచిన ఆర్థిక సంవత్సరం మన జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగానే నమోదైంది. 4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చెప్తున్న భారత్.. ఏటికేడాది 8.5 శాతం వృద్ధిరేటు నమోదు చేస్తే ప్రతీ సంవత్సరం 340 బిలియన్ డాలర్ల సొమ్ము ఆర్థికవ్యవస్థకు అదనంగా చేకూరుతుంది. ఇది పాకిస్థాన్ మొత్తం జీడీపీకి సమానం. ఇంతటి సొమ్ము ఏటికేడాది మన ఆర్థికవ్యవస్థకు అదనంగా జత కలిస్తేనే, రక్షణ దళానికి అవసరమైన ఆయుధాలు, మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేసుకోగలం. లక్షల మందిని పేదరికం నుంచి బయటపడేయగలం. అది జరుగని పక్షంలో అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దలేం. ప్రపంచంలో మనది ఇప్పుడు నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా కొందరు చెప్పుకొంటున్నారు. అయితే, ఇదే సమయంలో దేశంలో ఒక్కో పౌరుడి తలసరి ఆదాయం ఎంత ఉన్నదో కూడా చూడాల్సి ఉంటుంది. దేశంలో జనాభా పెరుగుతూనే ఉన్నది. దీనికి అనుగుణంగా ఆర్థికవ్యవస్థ పరిమాణం పెరగాల్సి ఉంటుంది. త్వరలో మూడో స్థానంలో ఉన్న జర్మనీని కూడా మనం దాటేయగలమేమో గానీ, చైనాను కాదు. ఎందుకంటే ఆర్థిక పరిమాణంలో చైనాకు, మనకు ఎంతో అంతరం ఉన్నది.

మూడు విడతలు ఇలా..: మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిగా కంటే ఆర్థికమంత్రిగా ఎక్కువగా గుర్తిస్తారు. 90వ దశకంలో ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలే దీనికి కారణం. ఆయన ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు జీడీపీ వృద్ధిరేటు 1.25 శాతం నుంచి 7.5 శాతం వరకూ ఎగబాకింది. ఐదేండ్ల వ్యవధిలో విదేశీ మారక నిల్వలు నాలుగు రెట్లు పెరిగాయి. పేదరికం స్థాయిలూ తగ్గుముఖం పట్టాయి. ఇక, మోదీ మూడు పర్యాయాల పాలన విషయానికి వస్తే.. తొలి విడతలో హామీలతో నింపారు. మేకిన్ ఇండియా, జీఎస్టీ, ఎఫ్‌డీఐ, భూ సంస్కరణల పేరిట పలు వాగ్దానాలు ఇచ్చారు. భూ సంస్కరణల హామీ ఎప్పుడో అటకెక్కింది. ఇక, రెండో పర్యాయం అంతా.. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, సాగుచట్టాలు, కరోనా సంక్షోభంతో కొనసాగింది. మూడోసారి అధికారం చేపట్టి ఏడాది గడిచినప్పటికీ, గొప్ప నిర్ణయాలేమీ కనిపించట్లేదు.

పదునులేని పథకాలు: వ్యాపారం చేయడం ప్రభుత్వం పనికాదంటూ ప్రభుత్వరంగ సంస్థ ల్లో (పీఎస్‌యూ) పెట్టుబడుల ఉపసంహరణకు మోదీ ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. అయితే, లాభాల్లో ఉన్న సంస్థలను విక్రయించడంపై విమర్శలు వచ్చాయి. ఒక్క ఎయిర్ ఇండియా విక్రయమే సజావుగా సాగినట్టు చెప్తారు. ఇదే సమయంలో 'మేకిన్ ఇండియా' లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం చేరుకోలేకపోయింది. 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా జీడీపీలో తయారీరంగం వాటాను 25 శాతానికి తీసుకువెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే, ప్రస్తుతం జీడీపీలో తయారీ రంగం వాటా 13 శాతానికి పడిపోయింది. 1967 తర్వాత ఇదే కనిష్ఠం. ఇక, 2015లో తీసుకొచ్చిన 'స్కిల్ ఇండియా' పథకం కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. 2022 నాటికి దేశంలో 40 కోట్ల మంది యువతకు నైపుణ్యాన్ని మెరుగుపర్చాల్సి ఉండగా, 4 కోట్ల మందికి కూడా ఈ పథకం కింద శిక్షణను ఇవ్వలేకపోయారు. చైనా శ్రామిక శక్తిలో 60 శాతం మందిలో నైపుణ్యాలుంటే, భారత్‌లో ఇది 10 శాతానికి మించి ఉండదు. ఇలాంటి సమయంలో జీడీపీ వృద్ధిరేటు ఎలా పరుగు పెడుతుందన్నది ప్రధాన ప్రశ్న.

నల్ల చట్టాలపై బ్యాక్ స్టెప్: దేశంలో 45 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే, జీడీపీలో సాగురంగం వాటా 15 శాతంగానే ఉన్నది. ఇక, 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. తమను సంప్రదించకుండా తీసుకువచ్చిన ఈ నల్ల చట్టాలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని అన్నదాతలు తెగేసి చెప్పారు. ఆందోళనలు మిన్నంటడంతో దిగివచ్చిన ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకున్నది. ఒకవేళ, నిజంగా ప్రభుత్వం చెప్తున్నట్టు వ్యవసాయ దిగుబడిని పెంచి, రైతుల క్షేమం కోసమే ఈ చట్టాలను తీసుకొచ్చినట్టయితే, రైతులతో ముందే ఎందుకు సంప్రదింపులు చేపట్టలేదు? ప్రభుత్వాన్ని ఏ శక్తి ఆపింది? ఇక, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదు.

# చైతన్య, నారాయణలకు ఫస్ట్ ర్యాంకు రాలేదు!


తుమ్మలపల్లి ప్రసాద్

విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి కష్టపడటంలో తప్పు లేదు, ఇబ్బంది కూడా లేదు. కానీ నేటి తల్లితండ్రుల కలలను విద్యార్థులు సాకారం చేయాలి! తల్లితండ్రులకు ఉన్న ఈ కలలే కొందరు విద్యా వ్యాపారం చేయడానికి మూడు పువ్వులు ఆరు కాయలుగా దోహదపడుతుంది. మోస పోయేవారు ఉన్నంత కాలం మోసం చేసేవారు ఉంటారు. ఐఐటీల్లో చదివితేనే అది ఒక చదువు, మిగిలిన చదువులన్నీ పనికిరానివనే ఒక ఫోబియా నేడు దేశవ్యాప్తంగా చాలా మందిలో ఉంది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని కొందరు విద్యా వ్యాపారాలకు తెరలేపారు. వారి వ్యాపార ప్రకటనల ముందు అసలు విషయం మరుగునపడి, తల్లితండ్రులకు ఒక సినిమా చూపిస్తున్నారు. సినిమా టైటిళ్ళే కాస్త నయం అనిపిస్తుంది. చైతన్య, నారాయణ పేర్లతో దినపత్రికలు, టీవీ చానెల్స్ లలో పెద్ద పెద్ద ప్రకటనలకు ఫిదా అయిపోతున్నారు చాలా మంది. దీంతో దేశ వ్యాప్తంగా లక్షల కోట్ల విద్యా వ్యాపారం సజావుగా సాగేందుకు ప్రత్యక్షంగా పరోక్షంగా అందరూ తలో చెయ్యి వేస్తున్నారు.

అసలు వారికి ఫస్ట్ ర్యాంకే రాలేదు:

ఐఐటీల్లో చేరేందుకు నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్ డ్ ఫలితాలు ఈనెల 2వ తేదీన విడుదల అయ్యాయి. ఫలితాలు విడుదల అయిన మరుక్షణం నుంచే టీవీ చానెళ్లలో ఫస్ట్ ర్యాంకు తమదంటే తమదంటూ అందరూ ఊదరగొట్టారు. మరునాడు 3వ తేదీ ఉదయం అన్ని ప్రధాన దినపత్రికల్లో పేజీలకు పేజీలు విద్యా వ్యాపార ప్రకటనలే దర్శనమిచ్చాయి. ఆ ప్రకటనల్లో వాస్తవం ఏమిటనేది ఎవరూ చూడటం







లేదు. శ్రీచైతన్య, నారాయణ ఈ రెండు విద్యా సంస్థల వారు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు తమదే అంటూ తాటికాయంత పెద్దక్షరాలతో ఇచ్చారు. టెక్నికల్ గా దొరకకుండా ఉండేందుకు భూతద్దంలో చూస్తే కనిపించే విధంగా అసలు ర్యాంకు కూడా వేశారు. మూడు, ఆరు ర్యాంకుల విద్యార్థులను ఇద్దరూ వేసుకున్నారు. శ్రీచైతన్య కాలేజీ వారు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు అని వేసుకున్న వంగల అజయ్ రెడ్డి కి ఓపెన్ కేటగిరిలో 19వ ర్యాంకు వచ్చింది. ఇతనికి ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో ఫస్ట్ ర్యాంకు వస్తే అది కనిపించకుండా అసలు ఫస్ట్ ర్యాంకు తమదే అన్నట్లు ప్రకటన ఇచ్చారు. అదే విధంగా నారాయణ కాలేజీ వారు తాము తక్కువ తిన్నామా అంటూ ఈడబ్ల్యూఎస్ - పిడబ్ల్యూడి కనిపించకుండా ఫస్ట్ లెటర్ ను పెద్దక్షరాలతో ఇచ్చుకున్నారు. అసలు ఫస్ట్ ర్యాంకు రాజస్థాన్ కోటా విద్యార్థి రజిత్ గుప్తా కు వచ్చింది. మూడు, ఆరు ర్యాంకులు వచ్చిన ఇద్దరు విద్యార్థులను రెండు కాలేజీల వారు వేసుకున్నారు. అంటే వీళ్ళకు ర్యాంకులు రాకపోయే సరికి ఇలా వేసుకున్నారా? దీనిని బట్టే కార్పోరేట్ విద్యా సంస్థల మోసాలు ఇట్టే తెలిసిపోతున్నాయి.

18 వేల సీట్ల కోసం లక్షల మంది పోటీ!!

ప్రతి ఒక్క తల్లితండ్రుల కల తమ పిల్లలను ఐఐటి చదివించాలని. ఇంటర్ తర్వాత ఐఐటీలో జాయిన్ కావడం కోసం ఒకటో తరగతి నుండే నారాయణ, చైతన్య, లాంటి విద్యా సంస్థల్లో ఏసీ క్యాంపస్ లలో లక్షలకు లక్షలు ఫీజులు చెల్లించి తమ పిల్లలను చదివిస్తున్నారు. ఒకటో తరగతికే మూడు లక్షల రూపాయల వరకు ఫీజు ఉందంటే అర్థం చేసుకోవచ్చు. పిల్లలు ఏ తరగతి నుండి చదివినా, ఎన్ని లక్షలు ఫీజులు చెల్లించినా అసలక్కడ సీట్లు ఉండాలి కదా! దేశ వ్యాప్తంగా 18,160 మాత్రమే ఐఐటి సీట్లు ఉన్నాయి. వీటితో పాటు ఎన్ఐటి, త్రిపుల్ ఐటి తో పాటు ఇతరత్రా సీట్లు చూసినా భారతదేశ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న సీట్లు 62, 853 మాత్రమే. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఇంటర్ చదివిన విద్యార్థులు పది లక్షల మంది ఉంటే, వారిలో ఎంపిసీ పాసైన విద్యార్థులే మూడు లక్షల మంది ఉన్నారు. ఎంపీసీ గ్రూప్ లో జాయిన్ అయ్యారంటేనే ఇంజనీరింగ్ వారి లక్ష్యం అయి ఉంటుంది కదా! రెండు తెలుగు రాష్ట్రాల్లోనే మూడు లక్షల మంది విద్యార్థులంటే దేశ వ్యాప్తంగా ఇంకా ఎన్ని లక్షల మంది విద్యార్థులు పోటీ పడతారో అర్థం చేసుకోవచ్చు. వీరంతా ఎంత బాగా చదివినా, ఉన్న సీట్లు 18 వేలు మాత్రమే. బాగా చదివిన వారందరికీ కూడా సీటు వచ్చే అవకాశం ఉండదు కదా? అలాంటప్పుడు ఒకటో తరగతి నుంచే ఐఐటి పేరుతో పిల్లలను మానసిక ఒత్తిడికి గురి చేయడం ఎందుకు? గొర్రె పోకడ లాగా అందరూ ఐఐటీల వైపు కాకుండా ఎన్నో రకాల చదువులు ఉన్నాయి. వేటికి ఉండే అవకాశాలు వాటికి ఉన్నాయి. ఏ చదువును కూడా చిన్న చూపు చూడాల్సిన పనిలేదు. మామూలు ఇంజనీరింగ్ లో ఇన్స్ట్రుమెంటేషన్ కోర్సు చేసిన విద్యార్థులకు కూడా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో నెలకు లక్ష రూపాయల జీతంతో ఉద్యోగం చేస్తున్న వారు ఉన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ చేసిన వారు కార్పొరేట్ ల్యాబ్ కంపెనీల్లో నెలకు లక్ష రూపాయల జీతం డ్రా చేస్తున్న వారు లేకపోలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే అవకాశాలు కోకొల్లలు ఉన్నాయి. చదువంటే ఒక్క ఐఐటీయే అని ఎందుకు అనుకోవాలి.

కోర్టులు సుమోటోగా స్వీకరించాలి:

లక్షల మంది తల్లిదండ్రులను ఆకర్షించే తప్పుడు వ్యాపార ప్రకటనలు ఇచ్చే కార్పోరేట్ విద్యా సంస్థల మీద చర్యలు తీసుకునేందుకు ఏ ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు కనీసం న్యాయస్థానాలు అయినా ముందుకు వచ్చి సుమోటోగా కేసును స్వీకరించాలని పలువురు ప్రజాతంత్ర వాదులు కోరుతున్నారు. దీనికంటే ముందు తల్లితండ్రుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది.

-తుమ్మలపల్లి ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్
స్టేట్ బ్యూరో చీఫ్ - నవభూమి దినపత్రిక
సెల్: 9912010030

# ఎంఐటీలో గళం విప్పిన తెలుగు యువతి



ఒక యువతి ఒక వేదిక ఒక గళం. ఇజ్రాయెల్ మద్దతుతో పాలస్తీనా ప్రజలపై కొనసాగుతున్న దమన చర్యలను ఎంఐటీ వేదికపై ఖండిస్తూ, తెలుగు మూలాలున్న మేఘా వేమూరి ఇచ్చిన ప్రసంగం అమెరికా విద్యార్థి ఉద్యమ చరిత్రలో ఓ కొత్త అధ్యాయాన్ని రాసింది. 1960ల వియత్నాం యుద్ధాన్ని నిరసించిన విద్యార్థుల ఓ తరం ఇప్పుడు గాజా కోసం మరోసారి గళమెత్తుతోంది.

అమెరికా వర్సిటీల్లో నిరసనల వెల్లువ! మేఘా అమెరికాలోని జర్జియా తెలుగు కుటుంబంలో పుట్టి పెరిగిన యువతి కావడం వల్లే ఇంతటి ధైర్యసాహసాలు ప్రదర్శించిందనుకుంటే అది పూర్తిగా నిజమనిపించుకోదు. ఇండియా నుంచి వెళ్లిన కొద్ది మంది ఉత్తరాది, కర్ణాటక విద్యార్థులు కూడా మేఘా మాదిరిగానే అమెరికా ప్రభుత్వ నియంతృత్వ లేదా అక్రమ విధానాలను తప్పుపట్టిన సందర్భాలు గత రెండేండ్లలో లేకపోలేదు. మేఘా వేమూరి అనే ఎంఐటీ తెలుగు విద్యార్థి చరిత్ర సృష్టించింది. ప్రపంచ ప్రఖ్యాత అమెరికా యూనివర్సిటీ మెసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో గత గురువారం జరిగిన అధికారిక కార్యక్రమంలో క్లాస్ ఆఫ్ 2025 ప్రెసిడెంట్ కూడా అయిన మేఘా, పాలస్తీనాకు అనుకూలంగా మాట్లాడుతూ అమెరికా, తన వర్సిటీ ఎంఐటీ అనుసరిస్తున్న ఇజ్రాయెల్ అనుకూల విధానాలపై నిప్పులు చెరిగింది. మెరుగైన జీవనశైలితో కూడిన 'బంగారు భవిత' కోసం తెలుగు రాష్ట్రాల్లో బీటెక్, ఇతర సాంకేతిక కోర్సులు పూర్తిచేసి ఎంఎస్, బీఎస్ చదవడానికి అమెరికా యూనివర్సిటీల్లో చేరడానికి పరుగులు తీసే వేల మంది తెలుగు విద్యార్థుల వంటిదాన్ని కాదని మేఘా వేమూరి తన క్యాంపస్ ప్రసంగం ద్వారా నిరూపించింది.

మేఘా అమెరికాలోని జర్జియా తెలుగు కుటుంబంలో పుట్టి పెరిగిన యువతి కావడం వల్లే ఇంతటి ధైర్యసాహసాలు ప్రదర్శించిందనుకుంటే అది పూర్తిగా నిజమనిపించుకోదు. ఇండియా నుంచి వెళ్లిన కొద్ది మంది ఉత్తరాది, కర్ణాటక విద్యార్థులు కూడా మేఘా మాదిరిగానే అమెరికా ప్రభుత్వ నియంతృత్వ లేదా అక్రమ విధానాలను తప్పుపట్టిన సందర్భాలు గత రెండేండ్లలో లేకపోలేదు. సాధారణంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా వెళ్లి యూజీ, పీజీ కోర్సులు చదివే విద్యార్థులు రాజకీయ వాసన ఉండే ఇలాంటి నిరసనలకు దూరంగా ఉంటారు. నాలుగేండ్ల ఎంఐటీ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో కంప్యూటర్ సైన్స్, న్యూరో సైన్స్, లింగ్విస్టిక్స్ చదివిన మేఘా మే 29 ప్రసంగం కారణంగా స్నాతకోత్సవంలో ఆమె పాల్గొనడాన్ని ఎంఐటీ యాజమాన్యం నిషేధించింది. ఆమె డిప్లొమాను తమ ఇంటికి పంపుతారని మేఘా తండ్రి శరత్ వేమూరి తెలిపారు. ఇజ్రాయెల్ పాలస్తీనా వివాదం విషయంలో అమెరికా వైఖరిని తప్పుబడుతూ మాట్లాడిన పలువురు అంతర్జాతీయ విద్యార్థులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కారు ఇప్పటికే చర్యలు తీసుకున్నది. వారి వీసాల రద్దుకు అగ్రరాజ్యం చేసిన ప్రయత్నాలను అనేక సందర్భాల్లో అమెరికా కోర్టులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఏపీలోని కృష్ణా జిల్లా ఘంటశాల గ్రామంలో మూలాలున్న మేఘా ఎం వేమూరి తన ప్రజాస్వామిక ప్రసంగం ద్వారా అమెరికా యూనివర్సిటీల్లో అక్కడి జనానికి ఆదర్శప్రాయంగా రాజ్యాంగం పేర్కొనే విలువల ప్రాధాన్యాన్ని ప్రపంచ ప్రజలకు గుర్తుచేసింది. అంతేకాదు, 2023 అక్టోబర్ మొదటివారం ఇజ్రాయెల్‌లో గాజా ప్రాంతం నుంచి పాలస్తీనా తీవ్రవాద సంస్థ హమాస్ దాడి తర్వాత పరిణామాలు మానవాళికి దిగ్భ్రాంతి పరిచేలా ఉన్నాయి. గాజాలోని పాలస్తీనా అరబ్‌లకు తిండి, తాగునీరు లేకుండా చేస్తూ దవాఖానలపై ఇజ్రాయెలీ సేనలు గత రెండున్నరేండ్లుగా దాడులు చేస్తున్నాయి. ఈ యూదు దురహంకార దేశం దాడులు, అణచివేత విధానాల ఫలితంగా గాజాలో ఒక్క వర్సిటీ కూడా లేకపోవడం సిగ్గుచేటని ఎంఐటీ ప్రసంగంలో మేఘా వేమూరి తేల్చిచెప్పింది. మరో పక్క గాజా పట్టీని అమెరికాకు స్వాధీనం చేయాలంటూ డొనాల్డ్ ట్రంప్ అడ్డగోలుగా మాట్లాడుతూనే ఉన్నారు. అమాయక గాజా జనంపై దాష్టీకాలను ఖండిస్తూ 2024 వేసవి ముందునుంచే అమెరికా విశ్వవిద్యాలయాల్లో శ్వేతజాతి, అంతర్జాతీయ విద్యార్థులు నిరసనలు తెలుపుతున్నారు. మొన్నటి మేఘా వేమూరి ప్రసంగం అమెరికా వర్సిటీల్లో 1960ల చివరినాటి వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమాలు, ప్రదర్శనలను అన్నితరాల వారికీ గుర్తుచేసింది. భారతదేశం నుంచి ముఖ్యంగా తెలుగు ప్రాంతాల నుంచి అమెరికాకు డాక్టర్లు, ఇంజినీర్లు వలస పోవడం 1960ల్లోనే మొదలైంది. డెమొక్రాటిక్ పార్టీకి చెందిన అధ్యక్షుడు లిండన్ జాన్సన్ హయాంలో దేశంలోకి వృత్తి నిపుణుల వలసలను ప్రోత్సహించేలా చట్టాలు చేశారు. మరి ఈ నేపథ్యంలో అప్పుడు వియత్నాంలో అమెరికా సేనల ఆగడాలను దునుమాడుతూ అమెరికా విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు వేల సంఖ్యలో వీధుల్లోకి రావడం సంచలనంగా మారింది. అంతేగాక అగ్రరాజ్యం విదేశాంగ విధానం మారడానికి కూడా దారితీసింది.

వియత్నాం యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలతో అట్టుడికిన అమెరికా యూనివర్సిటీలు: వియత్నాంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతీయ విమోచన పోరాటాన్ని అణచివేయడానికి కమ్యూనిస్టు వ్యతిరేకత పేరుతో అమెరికా తన సేనలు పంపి అమానుష రీతిలో కార్పెట్ బాంబింగ్ చేయడాన్ని, తమను ఆ యుద్ధంలో పాల్గొనడానికి బలవంతంగా పంపడాన్ని అమెరికా యువత 1960 ల చివరిలోనే తీవ్రంగా నిరసించింది. వందలాది అమెరికా యూనివర్సిటీల విద్యార్థులు వీధుల్లోకి వచ్చి పోలీసులతో ఘర్షణలకు సైతం వెనుకాడకుండా శాంతియుత మార్గంలో పోరాడారు. 1968లో వియత్నాం యుద్ధానికి నిరసనగా న్యూయార్క్‌లోని ప్రపంచ ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీలో ఉవ్వెత్తున నిరసన జ్వాలలు రగిలాయి. ఇప్పుడు కూడా గాజా ప్రజలపై అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ దమనకాండకు నిరసనగా కొలంబియా వర్సిటీ విద్యార్థులు ప్రదర్శనలు జరిపారు.

ఆరు దశాబ్దాల్లో అమెరికా జనం గళంలో వచ్చిన చెప్పుకోదగిన మార్పు: అయితే 1965 నుంచి 2025 వరకూ ఆరు దశాబ్దాల కాలంలో అమెరికా ప్రజల రాజకీయ భావాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. అతి గొప్ప ప్రజాస్వామ్య దేశంగా పేరు మోసిన అమెరికాలో ప్రజాతంత్ర వ్యతిరేక ధోరణులు 45 ఏండ్ల కిందటే అంటే 1980 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి, హాలీవుడ్ మాజీ నటుడు రోనాల్డ్ రీగన్ గెలుపుతో పెల్లుబికాయి. మార్పును వ్యతిరేకించి మితవాద ధోరణులు అట్లాంటిక్ ఆవలి అగ్రరాజ్యంలో అప్పుడే మొదలయ్యాయి. ఈ అప్రజాస్వామిక, పెత్తందారీ అనుకూల పోకడలు 2000 ఎన్నికల్లో గెలిచిన మరో రిపబ్లికన్ జార్జి డబ్ల్యు బుష్ హయాంలో మరింత ముదిరాయి. చివరికి ఇలాంటి రాజకీయ ధోరణులు జనంలో ఇంకా ముదిరి పాకాన పడటం 2016, నవంబర్ ఎన్నికల్లో ప్రస్తుత ప్రెసిడెంట్ ట్రంప్ తొలిసారి గెలుపునకు దారితీసింది. ట్రంప్ 2024 చివరలో రెండోసారి విజయం సాధించడానికి ఆరు నెలల ముందు నుంచే అమెరికా వర్సిటీల్లో ఇజ్రాయెల్ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తాయి. ఇంత జరుగు తున్నా అమెరికా ప్రజల్లో ఇజ్రాయెల్‌కు వ్యతిరే కంగా ఆగ్రహావేశాలు అంతగా వ్యక్తం కావడం లేదు. వియత్నాం యుద్ధ కాలం నాటి ప్రజాస్వామిక స్పృహ జనంలో కనిపించడం లేదు. యూదు జాత్యహంకారానికి వ్యతిరేకంగా రావాల్సినంత వ్యతిరేకత రావడం లేదు. అంటే అమెరికన్లు మార్పును వ్యతిరేకించే అభివృద్ధి నిరోధకులుగా మారిపోయారా? ఎంఐటీలో సామ్రాజ్యవాద వ్యతిరేక ధోరణులపై పోరాడే భావనలు ప్రచారం చేసే 'రిటెన్ రివెల్యూషన్' అనే విద్యార్థి సంస్థలో చురుకుగా పనిచేసే మేఘా వేమూరి వంటి స్థానిక విద్యార్థులు ఎంతమంది తమ వర్సిటీల వేదికలపై ఎంతకా లం పోరాడితే అమెరికాలో ప్రజాస్వామిక విలువలు మళ్లీ వేళ్లూనుకుంటాయో కాలమే నిర్ణయిస్తుంది.

నాంచారయ్య మెరుగుమాల

ఆర్థిక వృద్ధిపై డంబాలు బడేభాయ్ నుంచి ఛోటేభాయ్ ట్రిలియన్ ఎకానమీ మంత్రాన్ని పుణికిపుచ్చుకున్నట్టు కనిపిస్తున్నది. తెలంగాణ కోసం ఇటు రాయి దీసి అటు పెట్టని సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగం బడాయి బాబు ఎచ్చులను బలాదూర్ చేసేలా ఉంది.

# జ్ఞాననేత్రం

## భక్తి




వర్ధమాన మహావీరుడికి ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో గోశాలక్ ఒకడు. అతను పండితుడు. వాక్చాతుర్యం ఉండేది. అయినా ఎక్కువమంది మహావీరునివైపే ఆకర్షితులు కావడం చూసి... అతనికి లోలోపల కొంత అసూయగా ఉండేది. ఒకసారి మహావీరుడు, గోశాలక్ కాలినడకన పొరుగు ఊరికి వెళుతున్నారు. కాలిబాట పక్కన ఒక చోట చిన్న పూల మొక్క ఉండడం గోశాలక్ గమనించాడు. దాన్ని మహావీరుడికి చూపిస్తూ "గురువర్యా! ఈ పూల మొక్కను చూడండి. ఇది పెరిగి పెద్దదవుతుందంటారా? పూలు పూస్తుందంటారా?" అని ప్రశ్నించాడు.

ఎవరో ఒక మనిషి భవిష్యత్తు గురించి అడిగితే... జ్యోతిష్కులు ఆ వ్యక్తి పుట్టిన రోజు, సమయం, ప్రాంతం తెలుసుకుంటారు. తిథి, వార, నక్షత్ర, గ్రహ స్థితులను పరిగణనలోకి తీసుకొని, లెక్కలు వేసి... ఆ మనిషి భవిష్యత్తు ఎలా ఉంటుందో చెబుతారు. కానీ మొక్కల భవిష్యత్తు గురించి ప్రశ్నిస్తే... పేరుమోసిన జ్యోతిష్కులైనా ఏమీ చెప్పలేరు. నవ్వి ఊరుకుంటారు. ఈ ప్రశ్న వేసి, మహావీరుడు ఏ సమాధానం చెబుతాడా? అని గోశాలక్ ఎదురుచూస్తున్నాడు.

ఆ ప్రశ్న విన్న మహావీరుడు ఆ మొక్క దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు గోశాలక్ "తప్పించుకొనే ప్రయత్నం చేయకండి. నా ప్రశ్నకు కచ్చితమైన జవాబు ఇవ్వండి" అన్నాడు.

మహావీరుడు కళ్ళు తెరిచి, లేచి నిలబడి "ఈ మొక్క పెరిగి పెద్దదవుతుంది. సమృద్ధిగా పూలు పూస్తుంది" అని చెప్పాడు. కటివేళ్ళతో సహా పెకిలించి అవతల పారేశాడు. "ఇది పెరుగుతుందట! పూలు పూస్తుందట!" అని నవ్వాడు. మహావీరుడు చిరునవ్వులు చిందిస్తూ ముందుకు నడిచాడు. గోశాలక్ ఆయనను అనుసరించాడు. వారిద్దరూ కొంత దూరం వెళ్ళాక... ఆ ప్రాతంంలో పెద్ద వర్షం మొదలైంది. ఏడు రోజులపాటు ఎడతెరిపిలేని వానలు, గాలులతో ఆ ప్రదేశమంతా చిందరవందరయింది. వానలు తగ్గడంతో మహావీరుడు, గోశాలక్ తిరుగు ప్రయాణం ప్రారంభించి, మళ్ళీ ఆ మొక్క ఉన్న చోటికే వచ్చారు. గాలీ, వర్షం కారణంగా ఆ మొక్క అటూ దొర్లి, ఇటు దొర్లి... మళ్ళీ దాన్ని వేర్లు భూమిలో నిలిచేలా లేచి నిలబడింది. దాన్ని ఆశ్చర్యంతో గమనించిన గోశాలక్... మహావీరుడి వైపు చూశాడు.

అప్పుడు మహావీరుడు నవ్వుతూ "ఆ మొక్క పెరిగి పెద్దదై... పూలు పూసే దృశ్యాన్నే కాదు, నువ్వు దాన్ని కూకటి వేర్లతో పెకిలించి పారేసే దృశ్యాన్ని కూడా ఆనాడే చూశాను. ఒక్కసారి కాదు, వందసార్లు నీవు అలా చేసినా... ఆ మొక్క కచ్చితంగా పెరుగుతుంది. పూలు పూస్తుంది. ఇది తథ్యం" అంటూ ముందుకు కదిలాడు. సాధారణ జ్యోతిష్కులు ఏవేవో లెక్కలు వేయాల్సి ఉంటుందేమో! జ్ఞానులు తమ జ్ఞాననేత్రంలో దర్శించి చెప్పేది నిజం కాక తప్పదు.



## కొవిడ్‌పై ముందస్తు చర్యలు చేపడుతున్నాం...

**పుదుచ్చేరి-నవభూమి:** కొవిడ్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి పేర్కొన్నారు. తమినాడు మాజీముఖ్యమంత్రి కరుణానిధి 102 జయంతిని పురస్కరించుకుని పుదుచ్చేరి ప్రభుత్వం తరుపున వేడుకలు నిర్వహించారు. పుదుచ్చేరి బీచ్ రోడ్డులో వున్న మేరీ హాలులో కరుణానిధి చిత్రపటానికి సీఎం రంగస్వామి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూడేళ్ళ క్రితం ప్రపంచ దేశాలను వణికించిన కరోనా మహమ్మారి ఈ రాష్ట్రంలో వ్యాపించకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలు మాస్కు ధరించాల్సిన అవసరం లేదని, ఒకవేళ కరోనా బారినపడిన వారికి చికిత్స అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు సిద్ధం చేసినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వ సూచనలు పాటిస్తూ ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండలు మండుతున్న కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించాలని పలు రాజకీయ పార్టీల నేతలు కోరుతున్నారని, దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. సీఎంతో పాటు మంత్రులు లక్ష్మీనారాయణన్, సాయిశరవణకుమార్, ప్రతిపక్షనేత శివ, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాజవేలు, ఎమ్మెల్యేలు కెనడి, సంపత్, సెంథిల్‌కుమార్, కేసపీ రమేష్, భాస్కర్ తదితరులు కూడా కరుణానిధి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు.



## భారీ వర్షాలు, వరదలకు కొట్టుకుపోయిన కీలక వంతెన

### చిక్కుకున్న గ్రామస్తులు



**ఇటానగర్-నవభూమి:** ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు, వరదల వల్ల అరుణాచల్ ప్రదేశ్‌లో కీలకమైన వంతెన కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలతో రాకపోకలు, సంబంధాలు తెగిపోయాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా గ్రామస్తులు చిక్కుకుపోయారు. దిబాంగ్ వ్యాలీ జిల్లాలోని మావాలి గ్రామంలో కీలకమైన సస్పెన్షన్ వంతెన వరదలకు నదిలో కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామంతో రాకపోకలతోపాటు కమ్యూనికేషన్ స్తంభించిపోయాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా పిల్లలతో సహా గ్రామస్తులు అక్కడ చిక్కుకుపోయారు.

కాగా, మావాలి గ్రామస్తులతో సంప్రదింపులు జరిపేందుకు జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారు. మే 30న రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినా ఫలితం లేకపోయింది. డ్రోన్‌ల ద్వారా ఆహార ప్యాకెట్లను జారవిడచేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే ఎడతెగని వర్షం కారణంగా ఆ మిషన్ కూడా విఫలమైంది. మరోవైపు ఈశాన్య రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరదలు ముంచెత్తడంతోపాటు కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఇప్పటి వరకు 30 మందికి పైగా మరణించారు. వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌తోపాటు రెస్క్యూ దళాలు ప్రయత్నిస్తున్నాయి.

## భారత్ ఓ అద్భుతమైన ప్రదేశం.. అయోధ్యను సందర్శించిన ఎలాన్ మస్క్ తండ్రి




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తండ్రి ఎరోల్ మస్క్ భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరానికి వెళ్లారు. అక్కడ నూతనంగా నిర్మించిన అయోధ్య రామ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. భారతదేశం ఓ అద్భుతమైన ప్రదేశం అని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలు ప్రేమ, దయ కలిగిన వ్యక్తులు అని అన్నారు. కాగా, దక్షిణాఫ్రికాకు చెందిన ఎరోల్ మస్క్.. తన స్కూల్ ఫ్రెండ్ అయిన మాయే మస్క్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత కొన్నేళ్లకే వీరు విడాకులు తీసుకున్నారు. మాయే మస్క్ తన ముగ్గురు పిల్లల్ని ఒంటరిగానే పెంచింది. సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంది. ఇక ఎలాన్ మస్క్‌కు తన తండ్రి ఎరోల్ మస్క్‌తో విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. తండ్రంటే మస్క్‌కు అస్సలు ఇష్టం ఉండదు. 'మా నాన్న దుర్మార్గానికి ప్రతిరూపం. ఒక మనిషి ఎంత దారుణానికి ఒడిగట్టగలడో, అంతా తను చేయగలడు' అని ఓ సందర్భంలో స్వయంగా మస్క్ భారంగా వెల్లడించాడు.

## మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లకు ఏసీబీ నోటీసులు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీశ్ సిసోడియా , సత్యేందర్ జైన్ లకు ఢిల్లీకి చెందిన అవినీతి నిరోధక శాఖ నోటీసులు జారీచేసింది. ఢిల్లీలోని స్కూల్ బిల్డింగులు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవల ఆ ఇద్దరిపై కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఏసీబీ ఇవాళ వారికి నోటీసులు ఇచ్చింది. ఈ నెల 6న సత్యేందర్, 9న సిసోడియా ఢిల్లీలోని ఏసీబీ బ్యూరో కార్యాలయానికి రావాలని నోటీసులలో ఆదేశించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోడియా విద్యాశాఖ మంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ మంత్రిగా పనిచేశారు. వారి నేతృత్వంలో ఢిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం చేశారు. ఈ నిర్మాణ పనుల్లో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ పనులకు సంబంధించి మొత్తం 34 మందికి కాంట్రాక్టులు దక్కగా వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గరి సంబంధాలు ఉన్నట్లు తేలింది. కాంట్రాక్టర్‌లు నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తిచేయకపోగా భారీగా ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తరగతి గదులను కేవలం 30 సంవత్సరాలు మన్నిక ఉండేలా నిర్మించారని, కానీ వాటికి అయిన ఖర్చు మాత్రం చాలా ఎక్కువగా ఉందని విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్‌లు గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్‌లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో వ్యయం దాదాపు ఐదురెట్లు పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని రిపోర్టులో తెలిపింది. ఈ కేసులో మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లను విచారించేందుకు మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఏప్రిల్‌లో వారిపై కేసులు నమోదయ్యాయి.

## ఆర్సీబీ ఆటగాళ్లు రాష్ట్రం గర్వించేలా చేశారు : కర్ణాటక డిప్యూటీ సీఎం



**కర్ణాటక -నవభూమి:** ఐపీఎల్ సీజన్-2025 ట్రోఫీని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉందని కర్ణాటక డిప్యూటీ సీఎండీకే శివకుమార్ అన్నారు. ఆర్సీబీ ఆటగాళ్లు కర్ణాటక రాష్ట్రం గర్వించేలా చేశారని పొగిడారు. తాను మ్యాచ్ పూర్తిగా చూశానని, ఆర్సీబీ యువకులు అద్భుతంగా ఆడారని అన్నారు. కర్ణాటక ప్రజల తరఫున వారికి తాను అభినందనలు తెలియజేస్తున్నానని చెప్పారు. తాము ఆర్సీబీ జట్టును స్వాగతిస్తున్నామని, వాళ్లను ఎలా గౌరవించాలనే అంశంపై మా పోలీసులు, ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నదని తెలిపారు. తాను కర్ణాటక హోంమంత్రితో, పోలీసులతో మాట్లాడుతానని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెప్పారు. ఆర్సీబీ టీమ్‌ను స్వాగతించే సందర్భంగా ట్రాఫిక్‌తోపాటు తదితర అంశాలను మేనేజ్ చేయాల్సి ఉందని, దీనిపై కసరత్తు జరుగుతోందని తెలిపారు. ఆర్సీబీ టీమ్ రాష్ట్రంలో అడుగుపెట్టగానే సంబురాలు చేసుకోవడం కోసం తాము ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

# పాక్‌కు గూఢచర్యం కేసులో మరో యూట్యూబర్ అరెస్ట్




**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత నుంచి పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్కులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎవరైనా మన దేశానికి, దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని లీక్ చేస్తున్నారా అని జల్లెడ పడుతున్నారు. ఈక్రమంలోనే అనేక మంది పట్టుబడుతుండగా.. తాజాగా మరో యూట్యూబర్ పట్టుబడ్డాడు. ముఖ్యంగా జ్యోతి మల్హోత్రతో ఇతడికి చాలా దగ్గరి సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు.. ఆమె అరెస్ట్ అయిన తర్వాత ఇతడు పాక్ అధికారులతో ఉన్న చాటింగ్, వారి నెంబర్లను డిలీట్ చేయాలని ప్రయత్నించినట్లు కూడా గుర్తించారు. పంజాబ్‌లోని రూపనగర్ జిల్లా మహలాన్ గ్రామానికి చెందిన జస్బీర్ సింగ్.. "జాన్ మహల్" అనే పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ పెట్టాడు. అయితే ఇతడి ఛానెల్‌కు 1.1 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఇతడికి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారి, ఐఎస్ఐకు సమాచారం అందిస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కుంటున్న షకీర్ అలియాస్ జుట్ రాంధావాతో కూడా సంబంధాలు ఉన్నాయి. చాలా కాలంగా ఇతడితో జస్బీర్ సింగ్ మాట్లాడుతున్నాడు. అలాగే పాకిస్థాన్ రాయబార కార్యాలయ అధికారి ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో కూడా టచ్‌లో ఉన్నాడు. జ్యోతి మల్హోత్రతో కూడా దగ్గరి సంబంధాలు..

ఇది మాత్రమే కాకుండా ఇటీవలే అరెస్ట్ అయిన మరో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రతో కూడా దగ్గరి సంబంధాలు సాగిస్తున్నాడు. అలాగే డానిష్ ఆహ్వానం మేరకు జస్బీర్ సింగ్ ఢిల్లీలోని పాకిస్థాన్ రాయబార కార్యాలయంలో జరిగిన పాక్ జాతీయ దినోత్సవానికి కూడా హాజరయ్యాడు. 2020, 2021, 2024లలో దాయాది దేశంలో పర్యటించాడు. అయితే ఈ విషయాలు అన్నీ గుర్తించిన పోలీసులు జస్బీర్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా ఇతడి వద్ద నుంచి ఫోన్లు, కెమెరాలు, ల్యాప్‌టాప్ వంటి వేర్వేరు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆపై వాటిని ల్యాబ్‌కు పంపించారు.

**పాక్‌కు చెందిన అనేక మంది నెంబర్లు..!**


ఈక్రమంలోనే జస్బీర్ సింగ్ పాకిస్థాన్‌కు చెందిన అనేక మందితో సంప్రదింపులు జరుపుతున్నాడని.. ఇప్పటికీ వారితో టచ్‌లో ఉన్నాడని తేలింది. అయితే జ్యోతి మల్హోత్ర ఇటీవలే అరెస్ట్ కాగా.. దాయాదా దేశానికి చెందిన వారందరి నెంబర్లు తొలగించేందుకు జస్బీర్ సింగ్ ప్రయత్నించాడనే ఆరోపణలు కూడా వచ్చాయి. దీనిపై కూడా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే పాక్‌కు గూఢచర్యం చేస్తున్న కేసులో పంజాబ్‌కు చెందిన ఏడుగురు అరెస్ట్ అయ్యారు.

# ఒక్క ఇంజెక్షన్ ఐదుగురు ప్రాణాలను తీసింది



**న్యూఢిల్లీ-నవభూమి:** ఒక్కొక్కరూ ఒక్కో సమస్యతో ఆ ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు కూడా వారిని కాపాడేందుకు పలు శస్త్ర చికిత్సలు చేశారు. ఆపై ఐసీయూ, సర్జికల్ వార్డుల్లో పెట్టి 24 గంటలూ అబ్జర్వ్ చేస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్న మంగళవారం రోజు అర్ధరాత్రి డ్యూటీలో ఉన్న ఓ నర్సు మాత్రం వారికి తప్పుడు ఇంజెక్షన్ ఇచ్చింది. ముఖ్యంగా ఐదుగురు రోగులకు ఒకేలాంటి సూది వేయగా.. వారందరికీ క్షణాల్లోనే తీవ్రమైన నొప్పులు ప్రారంభం అయ్యాయి. ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులు వైద్యులకు చెప్పి వారిని తీసుకొచ్చేలోపే రోగులు ప్రాణాలు కోల్పోయారు. నిమిషాల వ్యవధిలోనే మొత్తంగా ఐదుగురు చనిపోయారు. దీంతో రోగుల కుటుంబ సభ్యులు ఓవైపు తీవ్రంగా రోదిస్తూనే మరోవైపు వైద్యులు చేసిన నిర్లక్ష్యం గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా కేంద్రంలో గల సాహిద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ మంగళవారం రోజు అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ముఖ్యంగా పలు ఆరోగ్య సమస్యలతో వచ్చిన ఐదుగురు రోగులకు ఆసుపత్రి యాజమాన్యం శస్త్ర చికిత్సలు చేసింది. ఆపై వీరిలో ముగ్గురిని ఐసీయూలో ఉంచగా.. మిగతా ఇద్దరిని సర్జికల్ వార్డులో ఉంచింది. అయితే ఎప్పటిలాగే మంగళవారం రోజు అర్ధరాత్రి 11 గంటలకు డ్యూటీలో ఉన్న సిబ్బంది.. వీరికి రెండో రౌండ్ ఇంజెక్షన్లు వేసింది. అయితే అప్పటి వరకు బాగానే ఉన్న ఈ రోగులు అంతా.. సూది వేసిన కొన్ని క్షణాల్లోనే నొప్పితో విలవిల్లాడిపోయారు. దీంతో రోగుల పక్కనే ఉన్న కుటుంబ సభ్యులకు ఏం జరుగుతుందో అర్థం కాక వెంటనే సిబ్బంది వద్దకు పరుగులు పెట్టారు. దీంతో సిబ్బంది కూడా వెంటనే రోగుల వద్దకు వచ్చి చెక్ చేసే ప్రయత్నం చేసింది. కానీ ఆలోపే వారు ప్రాణాలు కోల్పోయారు. సూది వేసిన పావుగంట లోపే వీరంతా చనిపోయారు. నిమిషాల వ్యవధిలోనే పక్క పక్కనే ఉన్న రోగులంతా ప్రాణాలు కోల్పోవడం, కాసేపటి ముందే సిబ్బంది ఇంజెక్షన్లు ఇవ్వడంతో.. తప్పుడు సూది వల్లే వారంతా చనిపోయినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఇదే విషయమై వైద్య సిబ్బందితో గొడవకు దిగారు. మరోవైపు తమ వాళ్లు చనిపోవడం జీర్ణించుకోలేక గుండెలవిసేలా రోదించారు. ఏది ఏమైనా నిర్లక్ష్యంగా వ్యవహరించి.. ఐదుగురి నిండు ప్రాణాలు తీసిన సిబ్బందికి కఠిన శిక్ష పడాలనే ఉద్దేశంతోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ఆస్పత్రిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు చనిపోయిన ఈ ఐదుగురిని భగవాన్ పరాజా, సుక్రు మాఝీ, రుకుని పెంటియా, బాటి ఖారా, ఫుల్మటి మాఝీలుగా గుర్తించారు. అయితే మొదటి ముగ్గురు ఐసీయూలో ఉండగా.. చివరి ఇద్దరి మాత్రం సర్జికల్ వార్డులో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ ఐదుగురికి పోస్టుమార్టం చేసిన తర్వాతే వీరి మృతికి గల కారణాలు తెలుస్తాయని వెల్లడిస్తున్నారు. ఈ ఘటనపై ఆస్పత్రి యాజమాన్యం ఇంకా స్పందించలేదు. కానీ మృతుల కుటుంబాలు మాత్రం.. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని అంటున్నారు. ఆపరేషన్ తర్వాత కూడా చాలా బాగున్న రోగులు.. ఇంజెక్షన్ వేసిన 15 నిమిషాల్లోనే ప్రాణాలు కోల్పోయారని గుర్తు ఇచ్చారు. డోస్ అయినా ఎక్కువగా ఇచ్చి ఉండాలి లేదా తప్పుడు ఇంజెక్షన్ అయినా ఇచ్చి ఉండాలని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# అంగన్వాడీ మెనూలోకి బిర్యానీ, పులావ్, పాయసం



**న్యూఢిల్లీ-నవభూమి:** నాలుగు నెలల క్రితం ఓ బుజ్జి బాలుడు తనకు అంగన్వాడీలో ఉప్మా వద్దని.. బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలంటూ క్యూట్ క్యూట్‌గా అడిగిన వీడియో వైరల్ అయిన విషయం అందరికీ తెలిసిందే. అప్పట్లో ఈ వీడియోపై అనేక మంది స్పందించి.. అంగన్వాడీలో బిర్యానీ పెట్టాలని డిమాండ్ చేశారు. శిశు సంక్షేమ శాఖ మంత్రి సైతం దీనిపై స్పందించారు. మెనూపై రివ్యూ చేయాలని అప్పట్లోనే అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత అంతా ఈ విషయం మర్చిపోయారు. కానీ మంత్రి మాత్రం బుడ్డోడి క్యూట్ రిక్వెస్ట్‌ను గుర్తుంచుకుని.. అతడు కోరినట్లుగానే అంగన్వాడీలో బిర్యానీ పెట్టేందుకు సిద్ధం అయ్యారు. అది మాత్రమే కాకుండా అంగన్వాడీ మెనూలో చాలానే మార్పులు చేశారు. మరి ఏమేం పెట్టబోతున్నారో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి.

ఈ ఏడాది ఫిబ్రవరి ప్రారంభంలో కేరళలోని ఓ నాలుగేళ్ల బాలుడు అంగన్వాడీలో ఉప్మా వద్దని.. బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలంటూ తన తల్లిని అడిగిన వీడియో నెట్టింట తెగ వైరల్ అయింది. ముఖ్యంగా త్రాజుల్ ఎస్ శంకర్ అనే ఈ బాలుడు.. తల్లి చేసిన బిర్యానీ తింటూ.. అమాయకంగా ఆమెను ఈ కోరిక కోరాడు. బుజ్జి బుజ్జిగా మాట్లాడుతూ బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలనగా తల్లి వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టింది. ఇలా క్షణాల్లోనే ఈ వీడియో వైరల్ అయి.. ఆ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వరకూ వెళ్లింది. బుడ్డోడి క్యూట్ రిక్వెస్ట్‌కు ఫిదా అయిన మంత్రి వీణా జార్జ్.. అంగన్వాడీ మెనూపై రివ్యూ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే నెటిజన్లు సైతం పెద్ద ఎత్తున కామెంట్లు చేశారు. నీకు నేను బిర్యానీ ఇప్పిస్తానని కొందరు.. అంగన్వాడీలోనే బిర్యానీ పెట్టాలని మరికొందరు డిమాండ్ చేశారు. అయితే ఇదంతా జరిగి చాలా రోజులే కావొస్తుండగా.. ఈ విషయాన్ని అంతా మర్చిపోయారు. కానీ మంత్రి వీణా జార్జ్ మాత్రం అస్సలే మర్చిపోలేరు. చిన్నారి చిలుక పలుకులు పలుకుతూ అడిగిన రిక్వెస్ట్‌ను గుర్తుంచుకుని మరీ అతడి కోరిక తీర్చారు. ముఖ్యంగా కేరళలోని అంగన్వాడీ మెనూలో పెద్ద ఎత్తున మార్పులు చేపట్టారు. బిర్యానీని సైతం చేర్చారు. అయితే ఈ విషయాన్ని నేరుగా మంత్రియే మంగళవారం రోజు జరిగిన అంగన్వాడీల పునఃప్రారంభ కార్యక్రమంలో వెల్లడించారు. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలన్నింటికీ ఒకటే మెనూ ఉంటుందని చెప్పారు. అందులో ఎగ్ బిర్యానీ, పులావ్, దాల్ పాయసం, సోయా డ్రై కర్రీ, లడ్డూలను చేర్చినట్లు వివరించారు. అయితే ఇంతకాలం రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల అంగన్వాడీల్లో వేర్వేరు మెనూలు ఉండేవని.. కానీ ఇప్పుడు మాత్రం అందరికీ ఒకటే మెనూ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు వారానికి రెండు సార్లు మాత్రమే పిల్లలకు పాలు అందించేవాళ్లమని.. కానీ ఇకపై వారానికి మూడు సార్లు పాలు అందిస్తామని మంత్రి వీణా జార్జ్ చెప్పారు. ముఖ్యంగా బుడ్డోడు కోరినట్లుగా బిర్యానీ చేర్చగా.. రాష్ట్ర ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చిన్న గ్రామంలో వాతావరణాన్నీ అంచనాకట్టగల కొత్త మాన్‌సూన్ మోడల్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** మీ పరిసరాల్లో కురిసే భారీ వర్షాన్ని , మీకు కేవలం కొన్ని కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్న మీ స్నేహితుడి పరిసరాల్లో ఉన్న తేలికపాటి వర్షాన్ని కచ్చితంగా అంచనా వేయగలిగితే ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకోండి. ఒక జిల్లాలోని ఓ ప్రాంతంలో కుండపోత వర్షం కురుస్తుందని అంచనా కట్టే సూపర్ పవర్ మీకు ఉంటే ఎలా ఉంటుందో ఒకసారి ఊహకు తెచ్చుకోండి. అదీ ఓ 10 రోజుల ముందుగానే చెప్పగలిగితే ఎలా ఉంటుందో ఆలోచించండి. ఆ.. అది సాధ్యమయ్యే పని కాదులే అనుకుంటున్నారా..?..కానీ అలా కచ్చితమైన అంచనా కట్టడం ఇప్పుడు సాధ్యమే. భారతీయ శాస్త్రవేత్తలు 'భారత్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్ అని పిలువబడే సూపర్-డిటెయిల్డ్ కంప్యూటర్ మోడల్‌ను అభివృద్ధి చేశారు. దాంతో ఊహలకే పరిమితమైన ఈ అంచనా సామర్థ్యం ఇప్పుడు వాస్తవ రూపం దాల్చింది. అంతేకాదు 10 రోజులు ముందుగానే చిన్న వర్షపు మేఘాలను చూడటంలోనైనా, భారీ వర్షాన్ని అంచనా కట్టడంలో అయినా ఈ బీఎఫ్ఎస్ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. వాస్తవానికి ఈ కొత్త అంచనా వ్యవస్థ అంతర్జాతీయ వాతావరణ మోడలింగ్ వ్యవస్థల కంటే మెరుగైనదిగా ఉంటుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ శాస్త్రవేత్తల బృందం అభివృద్ధి చేసిన హై-రిజల్యూషన్ మోడలింగ్ వ్యవస్థ ప్రతి 6.5 కిలోమీటర్ల పరిధిలో వాతావరణం ఎలా ఉంటుందో అంచనా వేయగలదు, నిర్ధారణ చేయగలదు. అంటే ఈ %దీఖీ% వ్యవస్థ చిన్నపట్టణాల నుంచి గ్రామాల వరకు వాతావరణ మార్పులను చాలా సూక్ష్మంగా అంచనా వేయగలదు. ఈ 6.5 కిలోమీటర్ల రిజల్యూషన్ మోడల్ ప్రస్తుతం ఉన్న 12 కిలోమీటర్ల రిజల్యూషన్ మోడల్ కంటే చాలా సూక్ష్మ స్థాయిలో వాతావరణ నమూనాలను చూడగలుగుతుంది. అంచనా వేయగలుగుతుంది. సాంకేతికంగా హై-రిజల్యూషన్ గ్లోబల్ ఫోర్‌కాస్టింగ్ మోడల్ అని పిలువబడే యునైటెడ్ స్టేట్స్ సహా బహుళ దేశాలు ఉపయోగించే సంఖ్యా వాతావరణ అంచనా నమూనా అయిన ప్రస్తుత హై-ఎండ్ గ్లోబల్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్ తో పోల్చబడింది. మార్చిలో ప్రతిష్టాత్మక యూరోపియన్ జియోసైన్సెస్ యూనియన్‌లో తమ 'హై-రిజల్యూషన్ గ్లోబల్ ఫోర్‌కాస్ట్ మోడల్' అనే వర్క్‌ను వాతావరణ పరిశోధకులు ప్రచురించారు. వాతావరణ వైపరీత్యాలను ముందే అంచనా వేయగలిగే ఈ వ్యవస్థ ప్రజలకు చాలా ముఖ్యమైనది. పరిశోధనలో భాగంగా వాతావరణ శాస్త్రవేత్తలు జూన్ 2022 నుంచి సెప్టెంబర్ 2022 వరకు ప్రతిరోజూ %ఎ+ఖీవీ% మోడల్‌ను అమలు చేశారు. వారి కొత్త మోడల్ గత సంఘటనలను ఎలా అంచనా వేసిందో చూడటానికి వారు చారిత్రక డేటాను ఉపయోగించారు. రాబోయే రుతుపవన వర్షాలను 10 రోజుల ముందుగానే ఈ మోడల్ అంచనా వేయగలదని, వరదలకు సిద్ధం కావడానికి తగినంత సమయం ఉంటుందని ఈ పరిశోధనలో వెల్లడైంది. ఇప్పటివరకు వాతావరణ పరిశోధకులు పెద్ద ప్రాంతాల్లో మాత్రమే రుతుపవన మేఘాల కదలికలు, గాలి నమూనాలను కచ్చితంగా అంచనా వేయగలిగారు. నిర్దిష్ట ప్రాంతాలలో లేదా ప్రదేశాలలో పడే వర్షాన్ని కచ్చితంగా అంచనా వేయడం కష్టంగా ఉండేది. నిర్దిష్ట ప్రదేశాలలో రోజువారీ లేదా వారంవారం వాతావరణ మార్పును వారు అంచనా వేయలేకపోయారు. ఇటీవల ప్రారంభమైన వ్యవస్థతో పరిశోధకులు ఇప్పుడు ఒక నిర్దిష్ట గ్రామంలో, చిన్న పట్టణంలో కుండపోత వర్షం పడుతుందా.. లేదంటే తేలికపాటి చినుకులు పడుతాయా అని కచ్చితంగా అంచనా వేయగలుగుతారు.

## ముంబై ఎయిర్‌పోర్ట్‌లో షాకింగ్ ఘటన

### డ్రైవర్లు, సిబ్బంది మధ్య తీవ్రమైన ఘర్షణ



**న్యూఢిల్లీ-నవభూమి:** జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే ముంబై ఎయిర్‌పోర్ట్ లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. అక్కడ కారు డ్రైవర్లు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది మధ్య తీవ్రమైన ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరినొకరు రోడ్డుపై పడేసి మరీ కొట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. విమానాశ్రయంలోని పార్కింగ్ స్థలం వద్ద వాహనాలు నిలిపే విషయంలో క్రిస్టల్ సెక్యూరిటీ సిబ్బంది పలువురు డ్రైవర్లకు మధ్య మాటల యుద్ధం సాగింది. మాటా మాటా పెరగడంతో అది కాస్తా ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు తీవ్రంగా కొట్టుకున్నారు. కాలర్లు పట్టుకుని, రోడ్డుపై పడేసి పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఈ ఘర్షణతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో కొద్దిసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ ఘర్షణ తీవ్రరూపం దాల్చడంతో అక్కడే విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ అధికారులు జోక్యం చేసుకున్నారు. ఇరువర్గాలను శాంతింపజేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ గొడవ కారణంగా విమానాశ్రయ కార్యకలాపాలకు స్వల్ప అంతరాయం కలిగింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. మరోవైపు ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. వ్యాన్‌ను ఢీ కొట్టిన ట్రక్కు.. 9 మంది దుర్మరణం



**న్యూఢిల్లీ-నవభూమి:** మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఝబువా జిల్లాలో సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ట్రైలర్ ట్రక్కు ఓ వ్యానును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెఘ్‌నగర్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన కొందరు వివాహ కార్యక్రమాన్ని ముగించుకొని తమ గ్రామానికి వ్యాన్‌లో వెళ్తున్నారు. అదే సమయంలో సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ట్రైలర్ ట్రక్కు.. సంజెలి రైల్వే క్రాసింగ్ వద్ద తాత్కాలిక రహదారి గుండా నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి దాటుతుండగా అదుపు తప్పింది. పక్కన వెళ్తున్న వ్యాన్‌పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు ఝబువా పోలీసు సూపరింటెండెంట్ పద్మవిలోచన్ శుక్లా తెలిపారు. మరో ఇద్దరు గాయపడినట్లు చెప్పారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## రైల్వే టిక్కెట్ల వెనుక బిగ్ స్కాం మోసపోయిన లక్షల మంది

**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ తాజాగా ఓ షాకింగ్ విషయాన్ని ప్రకటించింది. లక్షలాది ప్రయాణికులు ప్రతిరోజూ ఎదుర్కొనే టికెట్ బుకింగ్ సమస్య వెనుక ఉన్న రహస్యాన్ని తాజాగా బయట పెట్టింది. ప్రధానంగా పండుగ సీజన్లలో రైల్వే టికెట్లు కొన్ని సెకన్లలోనే సేల్ అవుతుంటాయి. దీంతో అనేక మంది ప్రయాణికులు తీవ్ర అసంతృప్తికి లోనవుతుంటారు. కానీ అలా టిక్కెట్లు త్వరగా అయిపోవడం వెనుక ఓ భారీ స్కామ్‌ఉందని, తాజాగా వెలుగులోకి వచ్చిందని తెలిపింది. ఈ క్రమంలో చేసిన విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. గత అయిదు నెలల్లో టికెట్ బుకింగ్ విండో ఓపెన్ కావడానికి ఐదు నిమిషాల ముందే 2.9 లక్షల జనరేట్ అయ్యాయి. ఇది నిబంధనలకు పూర్తిగా వ్యతిరేకం. ఆ క్రమంలో టికెట్లు ముందుగానే బుక్ చేసి, తరువాత మోసపూరితంగా ఎక్కువ ధరలకు ప్రయాణికులకు అమ్మేస్తున్నారు. వారు బాట్స్ అనే ఆటోమేటెడ్ టూల్స్‌తో టికెట్లను క్షణాల్లో బుక్ చేసేవారు. దీంతో సాధారణ ప్రయాణికులు లాగిన్ అయ్యేలోపే టికెట్లు అమ్ముడవుతూ ఉండేవి. సమస్య ఎంత పెద్దదంటే..ఒకవేళ మీరు కూడా ప్రయాణించేందుకు IRCTCలో టైముకు లాగిన్ అయి టికెట్ల కోసం ప్రయత్నిస్తే మీకు వెంటనే Waiting List రావడం లేదా Tickets Not Available అని మెసేజ్ వస్తే మాత్రం అప్పుడు అది స్కాం అని చెప్పవచ్చు. ఎందుకంటే మీ కంటే ముందే వందల బాట్స్ ఆ టికెట్లను కావాలనే బుక్ చేస్తాయి. తర్వాత వాటిని ఎక్కువ ధరకు సేల్ చేస్తారు. ఇది చిన్న మోసం కాదని, ఒక పెద్ద ముఠాగా మారిపోయి, దేశవ్యాప్తంగా స్కాం చేశారని అధికారులు పేర్కొన్నారు. ముందుగానే..దీంతో ప్రత్యేక రైళ్ల టికెట్లు, తత్కాల్ టికెట్లు ఇలా ఏదైనా బుక్ చేయాలంటే ప్రయాణికులు భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5
హైదరాబాద్
గురువారం
05 । జూన్ । 2025



# నాలుగు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

**చెన్నై- నవభూమి:** బంగాళాఖాతంలో పశ్చిమ దిశ గాలుల్లో వేగం కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం నుండి ఈ నెల 8వ తేదీ వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుతం వేడి వాతావరణం నెలకొన్న కారణంగా కనిష్ఠంగా 90 డిగ్రీల నుండి గరిష్ఠంగా 102 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గరిష్ఠంగా వేలూరు, తూత్తుకుడి, తిరుచ్చి, మదురై, కరూర్ జిల్లాల్లో 102 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో ఆ జిల్లాల



ప్రజలు ఉక్కపోతతో తల్లడిల్లిపోయారు. అదేవిధంగా చెన్నై, ఈరోడ్, పాళయంకోట్ట, తంజావూరులో 10 డిగ్రీలు, నాగపట్నం, తిరుపత్తూరు, తిరుత్తణిలో 90 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక వేలూరు, కరూర్(%ఎవశ్రీబతీబ, ఖుతీశీశీతీ%), దిండుగల్, చెన్నై ప్రాంతాల్లో సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదైనట్లు మంగళవారం వాతావరణ పరిశోధనా కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో పశ్చిమ దిశగా వీస్తున్న గాలులు వేగం పుంజుకున్న కారణంగా బుధవారం నుండి వచ్చే ఆదివారం వరకు రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని

## తేల్చిచెప్పేశారు.. బస్సు ఛార్జీలు పెంచం



**చెన్నై-నవభూమి:** బస్సు ఛార్జీలు పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శివశంకర్ మరోమారు స్పష్టం చేశారు. గత రెండు,మూడు రోజులుగా సోషల్ మీడియాలో రాష్ట్రంలో బస్సు ఛార్జీలు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనే కథనాలపై మంత్రి శివశంకర్ స్పందించారు. ఆయన అరియలూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బస్సు ఛార్జీలు పెంచుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదన్నారు. ప్రైవేటు బస్సుల యజమానులు ఛార్జీలు పెంచాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారని, న్యాయస్థానం సూచన మేరకు ప్రైవేటు బస్సు ఛార్జీలు పెంచడంపై ప్రజాభిప్రాయం తెలుసుకుని నివేదిక అందజేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించిందని అయితే, కొన్ని మీడియా సంస్థలు బస్సు ఛార్జీలు పెంచుతున్నట్లు తప్పుడు కథనాలు ప్రసారం చేశాయని మంత్రి తెలిపారు. %కేంద్రప్రభుత్వం డీజిల్ ధరను పలుసార్లు పెంచినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వ రవాణా సంస్థలు బస్సు ఛార్జీలు పెంచలేదన్నారు. పది రోజుల క్రితం రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపు ఉండదని ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టంచేశారని, ఆ రీతిలోనే బస్సు ఛార్జీల పెంపు కూడా ఉండబోదని మంత్రి శివశంకర్ తెలిపారు.

## అత్యాచారం కేసులో రహస్యాలివిగో

### ఆ సార్ ఎవరో సమాధానం చెప్పండి




**చెన్నై-నవభూమి:** అన్నా విశ్వవిద్యాలయంలో జరిగిన అత్యాచారం కేసుతో కోట్టూరుపురం డీఎంకే స్థానిక నాయకుడు షణ్ముగంకు, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యంకు సంబంధాలున్నాయని బీజేపీ రాష మాజీ అధ్యక్షుడు అన్నామలై సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ.. అత్యాచార కేసులో బాధితురాలికి సంపూర్ణంగా న్యాయం చేకూరలేదని, అందుకే తాను సేకరించిన ఆధారాలను వెల్లస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 23 రాత్రి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు జ్ఞానశేఖరన్‌ను బంధించి స్టేషన్‌కు తీసుకెళ్ళిన కోట్టూరుపురం పోలీసులు స్టేషన్‌లో ఉంచకుండా విడిచిపెట్టారు. ఆ రోజు రాత్రే ఈ అత్యాచారం కేసుతో ఎవరెవరికి సంబంధాలున్నాయో ఆ ఆధారాలన్నీ నాశనం చేశారని ఆరోపించారు. 23 రాత్రి నిందితుడు జ్ఞానశేఖర్ మొబైల్ ఫ్లైట్‌మోడ్‌లో ఉన్నమాట వాస్తవమేనని, ఆ తర్వాతే అంటే రాత్రి 8.52 తర్వాత అతడు సీనియర్ పోలీసు అధికారికి ఫోన్ చేసిన మాట నిజమేనన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ హోదా కలిగిన ఆ పోలీసు అధికారి రాత్రి 9.01 గంటలకు జ్ఞానశేఖరన్‌కు ఎందుకు ఫోన్ చేశారో తెలియటం లేదన్నారు. ఇక ఈ కేసులో సీబీసీఐడీ నమోదు చేసిన రెండో ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్) ఏ దశలో ఉందో వెల్లడించలేదన్నారు.

## ఆన్‌లైన్ గేమ్స్ నియంత్రణ చట్టం సబబే



**చెన్నై- నవభూమి:** : ఆన్‌లైన్ గేమ్స్‌ను క్రమబద్ధీకరించడానికి తమిళనాడు ప్రభుత్వం చేసిన చట్టం చెల్లుబాటవుతుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. 2022లో ఆన్‌లైన్ జూదాలు, క్రీడలను క్రమబద్ధీకరించడానికి తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక చట్టం రూపొందించింది. ఆ చట్టంలోని అంశాలను గత ఫిబ్రవరి 14న ప్రభుత్వ గెజిట్‌లో వెలువరించింది. ఆ చట్టం ప్రకారం రాష్ట్రంలో ఆన్‌లైన్ క్రీడలు ఆడేందుకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేయాలని పేర్కొంటూ.. అర్ధరాత్రి 12 నుంచి వేకువజాము 5 గంటల వరకు ఆన్‌లైన్ క్రీడలు ఆడటంపై నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆన్‌లైన్ గేమ్స్ సంస్థల తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. మంగళవారం తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం చెల్లుబాటు అవుతుందని తేల్చిచెప్పింది. గోప్యత ప్రాథమిక హక్కే అయినా ఆ హక్కు సంపూర్ణం కాదని, సమాజానికి హాని కలుగుతుంది కనుక వ్యక్తిగతపరమైన గోప్యతలో జోక్యం తప్పనిసరి అవుతుందని స్పష్టం చేసింది.

## కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌ల ప్రవేశంపై నిషేధం



**న్యూఢిల్లీ- నవభూమి:** మెడికల్ రిప్రజెంటేటివ్‌లు కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులతో సమావేశం కావడంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస(డీజీహెచ్ఎస్) నిషేధం విధించింది. ఈ మేరకు మే 28న ఆయా ఆస్పత్రుల ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆధునిక వైద్య విధానాలు, ఔషధాలకు సంబంధించిన సమాచారాన్ని వైద్యులతో పంచుకునేందుకు మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఈ-మెయిల్, మరేదైనా డిజిటల్ మీడియాను వినియోగించాలని డీజీహెచ్ఎస్ సూచించింది. ఈ ఉత్తర్వులను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రస్తుతం ఫార్మా సంస్థలకు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఇష్టారీతిన వైద్యులతో సమావేశం అవుతున్నారు. ఫలితంగా రోగులకు అందే వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. నిజానికి, కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌ల ప్రవేశంపై నిషేధం విధిస్తూ డీజీహెచ్ఎస్ గతంలోనే ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేస్తూ తాజా ఆదేశాలు జారీ చేసింది.

# నెలకు రూ.8 లక్షలు సంపాదిస్తున్న ఆటో డ్రైవర్



**న్యూఢిల్లీ-నవభూమి:** డబ్బులు ఎవరికీ ఊరికే రావు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఏదో ఒక పని చేస్తేనే మన చేతిలోకి డబ్బు వస్తుంది. కూలీ పనికి వెళ్లే వారి దగ్గరి నుంచి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే అపర కుబేరుల వరకు అంతా పని చేస్తేనే సంపాదన చేతికి వస్తుంది. ఒక్క రోజు పని మానేసినా దాని ప్రభావం సంపాదనపై పడుతుంది. ఇదంతా మనకు తెలిసిందే. కానీ మనం ఇప్పుడు చూడబోయే ఓ ఆటో డ్రైవర్ మాత్రం ఏ పనీ చేయకుండానే లక్షలకు లక్షలు సంపాదిస్తున్నాడు. తనతోటి డ్రైవర్లంతా రోజంతా ఎండనక, వాననకా.. రాత్రీ, పగలనే తేడా లేకుండా రోడ్లపై తిరుగుతుంటే.. అతడు మాత్రం ఓ చోట ఆటోను ఆపుకునే డబ్బులు సంపాదిస్తున్నాడు. ఎలాంటి పెట్టుబడి కూడా పెట్టకుండానే నెలకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు సంపాదిస్తున్నాడు. అసలే పనీ చేయకుండా అతడికి డబ్బెవరు ఇస్తున్నారు, ఆయన కథేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి. దేశరాజధాని ఢిల్లీకి చెందిన అబ్దుల్ సామీ ఓ సాధారణ ఆటో డ్రైవర్. తన వద్ద ఆటో తప్ప ఏమీ లేదు. పెద్దగా చదువు కూడా లేకపోవడంతో ఉద్యోగం చేసే ఆలోచన లేదు. అలా అని వ్యాపారం చేద్దామన్నా పెద్దగా డబ్బులు కూడా లేవు. అందుకే తనకు వచ్చిన డ్రైవింగ్‌నే నమ్ముకుని జీవితాన్ని సాగిస్తున్నాడు. ముఖ్యంగా ఆటోను నడుపుకుంటూనే తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇన్నాళ్లూ ఇదే పని చేయగా.. గత కొంత కాలం కిందటే ఇతడికి ఓ అద్భుతమైన ఐడియా వచ్చింది. అదే ఇతడి జీవితాన్ని మార్చేసింది. అలా అని ఇతడేదో వ్యాపారం చేస్తున్నాడనో, ఇన్వెస్టుమెంట్లు పెడుతూ కోట్లు సంపాదిస్తున్నాడని అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్లే. ఎందుకుంటే అబ్దుల్ సామీ అవేవీ చేయట్లేదు. కేవలం న్యూ ఢిల్లీలోని అమెరికా కాన్సులేట్ ముందు తన ఆటోను నిలుపుకుని కూర్చుంటున్నాడు. అక్కడకు ఇంటర్వ్యూ కోసం వచ్చే వారికి ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తూ డబ్బులు సంపాదిస్తున్నాడు. ముఖ్యంగా అక్కడకు వచ్చే వారు లగేజీతో రాగా.. సిబ్బంది లోపలికి అనుమతించడం లేదు. దీంతో వాటిని ఎక్కడ పెట్టాలో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడాన్ని అబ్దుల్ సామీ ఓసారి గుర్తించాడు. దీంతో లోపలికి వెళ్లే వారిని పిలిచి తన ఆటోలో లగేజీ పెట్టుకోవాలని సూచించాడు. కానీ అందుకోసం తనకు రూ.1000 ఛార్జి చేయాల్సి ఉంటుందని చెప్పాడు. అంతదూరం వెళ్లి ఇంటర్వ్యూకు వెళ్లకుండా ఉండలేని ప్రజలు అతడి వద్ద బ్యాగులను పెట్టుకోవడం ప్రారంభించారు. దీంతో ఆటో నడపడం మానేసి అబ్దుల్ సామీ.. దీన్నే తన పనిగా మార్చుకున్నారు. ఇలా రోజూ అక్కడకు 20 నుంచి 30 మంది కస్టమర్లు వస్తుండగా.. ఈ ఆటో డ్రైవర్ 20 వేల నుంచి 30 వేల రూపాయలను సంపాదిస్తున్నాడు. ఇలా నెలకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు కూర్చునే డబ్బులు పొందుతున్నాడు. అయితే ఇటీవలే రాహుల్ రూపానీ అనే ఓ వ్యక్తి వీసా కోసం అక్కడకు ఇంటర్వ్యూకు వెళ్లగా.. ఈ విషయాన్ని గుర్తించాడు. ముఖ్యంగా తన బ్యాగును సిబ్బంది లోపలికి అనుమతించకపోవడంతో.. అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ అబ్దుల్ సామీ అతడిని పిలిచాడు. తన వద్ద బ్యాగు పెట్టుకుని లోపలికి వెళ్లాలని.. అందుకోసం తాను రూ.1000 ఛార్జీ చేస్తానని అన్నాడు. చాలా దూరం నుంచి వెళ్లిన తాను ఇంటర్వ్యూకు కచ్చితంగా అటెండ్ కావాల్సి ఉండగా.. వెయ్యి రూపాయలు ఇచ్చి బ్యాగు అతడి వద్ద పెట్టాడు. అలాగే తానొక్కడే కాకుండా మరికొంత మంది కూడా ఇలాగే అతడి వద్ద లగేజీలు పెట్టుకోవడం గమనించాడు రాహుల్ రూపానీ. ఇదే విషయమైన అబ్దుల్ సామీని అడగ్గా.. అతడు కూడా నిజం చెప్పాడు. ఇలాగే ప్రతిరోజూ తాను డబ్బులు సంపాదిస్తున్నట్లు వివరించాడు.

# విషాదంగా మిస్సింగ్ జంట కథ



**ఇండోర్-నవభూమి:** హనీమూన్ కోసం మెఘాలయకు అదృశ్యమైన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరానికి చెందిన కొత్త జంట కథ విషాదంగా ముగిసింది. 11 రోజులపాటు ఆచూకీ లేకుండా పోయిన రాజా రఘువంశీ మృతదేహం మంగళవారం లోయలో లభ్యమైంది. అతడ్ని హత్యచేసినట్టు పోలీసులు నిర్ధారించారు. ఘటనా స్థలిలో హత్యకు ఉపయోగించిన వేటకొడవలి, రఘు వంశీ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఈస్ట్ ఖాసీ హిల్స్ ఎస్పీ వివేక్ సియోం తెలిపారు. రాజా మృతదేహం లభ్యమైన ప్రాంతంలోనే వేటకొడవలి లభ్యమైందని, ఇంది ఇది ఖచ్చితంగా హత్యేనని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆయన అన్నారు. అయితే, సోనమ్ ఏమైంది అనేది తెలియరాలేదు. ఆ జాడ గురించి పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ కేసును మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కూడా పర్యవేక్షించిన విషయం తెలిసిందే. ఇండోర్‌కు చెందిన రఘువంశీ, అతడి భార్య సోనమ్ హనీమూన్ కోసం మే 20న బయలుదేరారు. మే 22న మెఘాలయలోని నోంగ్రియాట్‌కు చేరుకున్నారు. మర్నాడు మే 23న చిరపుంజిలో 'షిపారా హోంస్టే' రిసార్ట్ చెకౌట్ చేసిన అనంతరం కనిపించకుండా పోయారు. మే 24న అద్దెకు తీసుకున్న బైక్ సోహ్రారిమ్ వద్ద కనిపించింది.

రఘువంశీ సోదరుడదు మాట్లాడుతూ:.. 'బైక్ కనిపించిన ప్రదేశం నుంచి శవం లభ్యమైన ప్రాంతం 25 కిలోమీటర్లు దూరం. ఇది కిడ్నాప్, దోపిడీ, హత్య. స్థానిక పోలీసులు మాకు సరిగా సహకరించడం లేదు' అని అన్నారు. ఘటనపై సీబీఐ విచారణకు ఆయన డిమాండ్ చేశారు. గతంలోనే ఆచూకీ తెలిపిన వారికి రూ. 5 లక్షల బహుమతి ప్రకటించిన విషయం తెలిసిందే. మేఘాలయ టూరిజం మంత్రి పౌల లైంగ్డో ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'ఈ ఘటన మరచిపోలేనిది. కానీ, పోలీసులు విచారణ పూర్తయే వరకు ఊహాగానాలు చేయొద్దు' అని ఆయన సూచించారు. హనీమూన్ జంట మిస్సింగ్ వ్యవహారంపై సీఎం కాన్రాడ్ సంగ్మా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కొత్త దంపతులకు సంబంధించి ఇది దురదృష్టకర ఘటన అని ఆయన అన్నారు. వాళ్లు అదృశ్యమైనట్టు సమాచారం తెలియడంతో వెంటనే స్పందించామని చెప్పారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్కూడా తనతో మాట్లాడారని, ఆ రాష్ట్ర హోంశాఖ నుంచి కూడా ఫోన్లు వచ్చాయన్నారు. పోలీసులు, అధికారులు, స్థానిక ప్రజలు కూడా ఆ జంట కోసం వెతుకుతున్నట్టు ఇంతకు ముందు ఆయన తెలిపారు అంతేకాదు, పర్యాటకులు తమకు కుటుంబ సభ్యుల్లాంటివారని పేర్కొన్నారు. కాగా, నవ దంపతుల జాడ తెలుసుకోడానికి మేఘాలయ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, స్పెషల్ ఆపరేషన్ టీమ్‌లను నియమించారు. కాగా, ఈ సంఘటన పర్యాటకుల భద్రతపై సుదీర్ఘ చర్చకు దారి తీసే అవకాశం ఉంది. సోనం ఆచూకీ లభించకపోతే ఇది మరింత విషాదంగా మారే ప్రమాదం ఉంది.

# ఆగని మారణహోమం



**గాజా-నవభూమి:** గాజాలో దారుణం.. ఇజ్రాయెల్ దుర్మార్గం లాంటి పెద్ద స్టేట్‌మెంట్లను ఇట్టే ఇచ్చేయటం ఇష్టం లేదు. గాజాలో జరుగుతున్నది తప్పా? ఒప్పా? అన్నది ఇక్కడ చెప్పట్లేదు. కేవలం జరుగుతున్న ఘటనల్ని చెప్పటం మాత్రమే లక్ష్యం. జరుగుతున్న పరిణామాలు.. అందులోని వేదనను చెప్పాల్సిన బాధ్యత ఉంది. ఒక దేశం మీద కోపం ఉండొచ్చు. దాని విధానాలతో నష్టం వాటిల్లిన వేళ.. తగినరీతిలో బుద్ధి చెప్పటం కోసం అమాయక ప్రాణాల్ని బలి తీసుకోవాల్సిన అవసరం లేదు. అందుకు భిన్నంగా ఇష్టారాజ్యంగా వ్యవహరించే పాలకులకు తగినశాస్తి చేయటం.. వారిని నుంచి అధికారాన్ని దూరం చేస్తే సరిపోతుంది. కానీ.. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో జరుగుతున్న పరిణామాలు అందుకు భిన్నంగా అమాయక ప్రాణాల్ని తీయటమే కనిపిస్తుంది. గాజాలోని పాలస్తీనియన్ల మీద ఇజ్రాయెల్ వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆహార పంపిణీ కేంద్రం వద్దకు వెళ్లే వారిని లక్ష్యంగా తీసుకొని కాల్పులు జరపగా.. అందులో 27 మంది మృతి చెందారు. మరణించిన వారిలో ముగ్గురు చిన్నారులు.. ఇద్దరు మహిళలు ఉండటం గమనార్హం. గడిచిన మూడు రోజుల్లో ఇది మూడో కాల్పుల ఘటన కావటం గమనార్హం. కాల్పుల నేపథ్యంలో బుల్లెట్లు తగిలిన క్షతగాత్రులను అంబులెన్సుల్లో వేరే ఆసుపత్రులకు తరలిస్తూ ఉండటం.. నేల మీద పడిన పిండి సంచులు రక్తపు మరకలతో తడిచి ఉండటం.. లాంటి భీతావహ ద్రశ్యాలు కనిపిస్తున్నాయి. తమ బలగాల వైపు వస్తున్న అనుమానితుల్ని మాత్రమే తాము కాల్చినట్లుగా ఇజ్రాయెల్ ఆర్మీ చెబుతోంది. కాల్పులకు ముందుగా వార్నింగ్ కాల్పులు చేపట్టామని.. అయినా వారు తమ తీరు ఆపలేదంటున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పుడు ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాలు ఆకలిని ఏ మాత్రం తీర్చలేనివిగా ఉన్నాయి. గతంలో గాజాలోని సుమారు 20 లక్షల మందికి నిత్యం 600 ట్రక్కుల్లో ఆహారపదార్థాలు అందేవి.. వీరికి ఆ ఆహారమే ఆధారం..అయితే.. ఇజ్రాయెల్ సైన్యం నెలల తరబడి ఆ ప్రాంతాన్ని దిగ్బంధనం చేయటంతో ఆహార నిల్వలు పూర్తిస్థాయిలో

# టెకీల ఫుల్ ప్రెషర్.. మౌనంగా భరిస్తున్నారా?




**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికాలోని టెక్నాలజీ రంగంలో వీసాపై పనిచేస్తున్న నిపుణులు ఈ మధ్య కాలంలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ వీసా వారి ఉద్యోగంతో ముడిపడి ఉండటం వల్ల, ఉద్యోగులు తమకు ఇష్టం లేని పనులు చేయడానికి లేదా అదనపు పని భారాన్ని నిరాకరించడానికి సంకోచిస్తున్నారు. ఇది ఉద్యోగికి, సంస్థకు మధ్య ఉన్న సంబంధంలో అసమానతలను స్పష్టంగా తెలియజేస్తోంది. కార్యాలయాల్లో పెరుగుతున్న పని భారం: అనేక అమెరికన్ సంస్థలు H-1B వీసా కలిగిన ఉద్యోగులను అన్యాయంగా ఎక్కువ పనికి లోనుచేస్తున్నాయి. వీరు వారాంతాల్లో పని చేయమని అడగడం, పని గంటలకు బయట సందేశాలు పంపడం, అదనపు బాధ్యతలు అప్పగించడం వంటివి సాధారణంగా మారిపోయాయి. ఈ ఉద్యోగులు ఈ అదనపు పని భారాన్ని నిరాకరించలేరు, ఎందుకంటే అలా చేస్తే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉంది, దాంతో పాటు వారి వీసా కూడా రద్దు అవుతుంది. ఈ భయం వారిని మౌనంగా అన్నింటినీ భరించేలా చేస్తోంది. Also Read – అమెరికాలో విద్యార్థులను భయపెడుతున్న ICE మెయిల్స్ వలసదారులపై కఠిన వైఖరి: ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం వలసదారులపై కఠినమైన వైఖరిని అవలంబిస్తోంది. రాజకీయ నాయకులు H-1B వ్యవస్థను "మోసం"గా అభివర్ణిస్తూ, మరింత నియంత్రణలు, పరిమిత వీసాల జారీకి పిలుపునిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో, H-1Bఉద్యోగులు మరింతగా ఒత్తిడికి గురవుతున్నారు. సంస్థల బాధ్యతరాహిత్యం: అమెరికా సంస్థలు తమ ఉద్యోగులను రక్షించాల్సిన బాధ్యతను కలిగి ఉన్నప్పటికీ, వారు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. నైపుణ్యాలు గల వలసదారులకు ఇలాంటి ఒత్తిడిని కలిగించడమే కాకుండా, చివరికి వారు దేశం విడిచి వెళ్ళే పరిస్థితిని సృష్టిస్తున్నారు. దీని ప్రభావం అమెరికా ఆర్థిక వ్యవస్థపైనా పడనుంది, ఎందుకంటే ఇది దేశానికి అవసరమైన నైపుణ్యాలను కోల్పోయేలా చేస్తుంది. Also Read - ఆస్ట్రేలియాలో భారత సంతతి వ్యక్తిపై పోలీసుల అరాచకత్వం భవిష్యత్తుపై ప్రభావం: సంస్థలు మరియు పాలక వ్యవస్థలు ఇలా కఠినంగా వ్యవహరిస్తూ, శ్రమదోపిడీకి అండగా నిలిస్తే, ఒక స్థాయికి మించి ఎవరూ మౌనంగా ఉండలేరు. ఎంతో మంది తల్లిదండ్రులు, యువ నిపుణులు తమ భవిష్యత్తును అమెరికాలో నిర్మించుకోవాలని ఆశిస్తున్న సమయంలో, ఈ తరహా దోపిడీ వారిని వేరే మార్గాల గురించి ఆలోచించేలా చేస్తోంది. ఇది అమెరికాకు దీర్ఘకాలంలో నష్టం చేకూరుస్తుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవడం అత్యవసరం. %H-1B% ఉద్యోగుల హక్కులను రక్షించడం, పని ప్రదేశాల్లో వారికి మద్దతు ఇవ్వడం, మరియు వలస విధానాలపై మరింత మానవతా దృక్పథాన్ని అవలంబించడం వంటివి చేయాలి. లేదంటే, అమెరికా తన ఆకర్షణను కోల్పోయి, నైపుణ్యాలు గల వలసదారులను ఇతర దేశాలకు మళ్ళించుకునే ప్రమాదం ఉంది.

## లద్దాఖ్‌లో 85 శాతం ఉద్యోగాలు స్థానికులకే



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో ఉద్యోగాలు, భాషలు, ప్రజా ప్రాతినిధ్యంపై ప్రత్యేక విధానాలను ప్రకటిస్తూ మంగళవారం కేంద్ర ప్రభుత్వం పలు ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగాల్లో 85 శాతం పోస్టులను స్థానికులకే కేటాయించింది. స్వయంప్రతిపత్తి మండలి అయిన లద్దాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మూడో వంతు సీట్లను మహిళలకు రిజర్వు చేసింది. ఇంగ్లిష్, హిందీ, ఉర్దూలతో పాటు స్థానికభాషలైన భోటి, పుర్గీలను అధికార భాషలుగా ప్రకటించింది. అవిభాజ్య జమ్మూ-కశ్మీర్ రాష్ట్రంలో అంతర్భాగంగా ఉన్నప్పుడు లద్దాఖ్‌కు కూడా రాజ్యాంగంలోని 370వ అధికరణం వర్తించేది. అది రద్దయిన తరువాత తమకు రాజ్యాంగపర రక్షణలు లేకుండాపోయావని స్థానికులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఈ ప్రత్యేక సౌకర్యాలను ప్రకటించింది. లద్దాఖ్‌లో 15 ఏళ్లపాటు నివసించిన వారుబీ ఏడేళ్లపాటు ఇక్కడి విద్యాలయాల్లో చదివి 10వ తరగతిగానీ, 12వ తరగతిగానీ పరీక్షలు రాసినవారు ఈ ఉద్యోగాలకు అర్హులు.

## చెప్పినదానికన్నా ఎక్కువే



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ చేసిన దాడులు పాకిస్థాన్‌లో తీవ్ర విధ్వంసం సృష్టించాయా? మన ప్రభుత్వం అధికారికంగా వెల్లడించినదాని కంటే కూడా ఎక్కువ ప్రాంతాలను వాయుసేన ధ్వంసం చేసిందా? పాక్ తనకు భారీ నష్టం జరిగిందని స్వయంగా ప్రకటించడం ఏమిటి? నిజంగా భారీ నష్టం జరిగిందా? దీని వెనుక భారత్‌ను బద్నాం చేసే కుట్ర ఉందా?.. భారత ఆపరేషన్‌కు ప్రతిగా చేపట్టిన 'ఆపరేషన్ బన్యన్ ఉన్ మర్సూస'కు సంబంధించి పాక్ విడుదల చేసిన 'సవివర సమాచార పత్రం (డోజియర్)' ఇవే ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారత్ మరో ఎనిమిది ప్రాంతాల్లోనూ దాడులు చేసినట్టు పాక్ అందులో పేర్కొంది. డోజియర్‌లో మ్యాప్‌లతో సహా..పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. మే 7న అర్ధరాత్రి పాక్, పీఓకేలలోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా పాక్ పెద్ద సంఖ్యలో డ్రోన్లు, స్వల్ప శ్రేణి క్షిపణులతో భారత్‌లోని పౌర ప్రాంతాలపై దాడులకు ప్రయత్నించింది. వీటిని అడ్డుకుని, పాక్‌ను నిలువరించేందుకు మన వాయుసేన.. 10వ తేదీన భారీ ఎత్తున దాడులకు దిగింది. పాక్‌లోని 11 ఎయిర్‌బేసలు, వ్యూహాత్మక స్థావరాలు (నూర్‌ఖాన్, రఫీఖి, మురిద్, సుక్కుర్, సియాల్‌కోట్, మర్సుర్, చునియన్, సర్గోధా, స్కరు, భొలారి, జకోబాబాద్)ను క్షిపణి దాడులతో ధ్వంసం చేశామని ప్రకటించింది. వాటికి ఆధారాలను కూడా చూపింది. అయితే పాక్ ఇందులో మూడు ఎయిర్‌బేసలు మురిద్, రఫీఖి, మర్సుర్‌తోపాటు బలూచిస్థాన్ ప్రాంతంలోని సముంగ్లి ఎయిర్‌బేసలపై మాత్రమే భారత్ దాడి చేసినట్టు డోజియర్‌లో పేర్కొంది. వీటితోపాటు మరో ఎనిమిది ప్రాంతాలు.. పెషావర్, ఝూంగ్, సింధ్ రాష్ట్రంలోని హైదరాబాద్, పంజాబ్ రాష్ట్రంలోని గుజ్రాత్, గుజ్రన్‌వాలా, భావల్‌నగర్, అట్టోక్, చోర్‌లలోనూ భారత్ దాడులు జరిగాయని చెబుతూ.. ఆ ప్రాంతాల మ్యాప్‌ను కూడా పెట్టింది. భారత్ దాడిచేసినట్టు చెప్పిన ప్రాంతాలకన్నా కూడా.. ఈ ప్రాంతాల్లో కొన్ని పాక్ భూభాగంలో మరింత లోపల ఉండటం గమనార్హం. అయితే భారత్ వాస్తవంగా దాడి చేసిన కొన్ని ఎయిర్‌బేసల వివరాలు దాచిపెట్టడం, ఎక్కడో దూరంగా ఉన్న ప్రాంతాలను పేర్కొనడంపై సందేహాలు వస్తున్నాయని రక్షణ నిపుణులు చెబుతున్నారు.

## గృహహింస బాధితులకు రక్షణ


**న్యూఢిల్లీ-నవభూమి:** గృహహింస బాధితులకు రక్షణ కల్పించటానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక అధికారులను ఆరు వారాల్లోపు నియమించాలని రాష్ట్ర, కేంద్రపాలితప్రాంతాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. గృహహింస నిరోధక చట్టం నిబంధనలు సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీషచంద్రశర్మలతో కూడిన ధర్మాసనం గత నెల 20వ తేదీన ఇచ్చిన తీర్పు తాలూకు పూర్తి వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈ తీర్పు కాపీని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. తీర్పులోని ముఖ్యాంశాలు..మహిళా, శిశు సంక్షేమశాఖలో జిల్లా, తాలూకా స్థాయిల్లో పని చేస్తున్న అధికారుల్లో కొందరిని గృహహింస బాధితుల కోసం 'రక్షణ అధికారులు'గా నియమించాలి. దీనికోసం ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంత ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి నియామకాల్ని ఆరు వారాల్లోగా పూర్తి చేయాలి. రక్షణ అధికారులు గృహహింస నిరోధక చట్టంలోని సెక్షన్ 9కి అనుగుణంగా విధులను నిర్వర్తించాలి. గృహహింస నిరోధక చట్టం సెక్షన్ 11 ప్రకారం.. బాధిత మహిళలకు చట్టం కల్పించే రక్షణ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలి.





# అల్లం తాజాగా

మనం తరచూ అల్లాన్ని ఉపయోగిస్తూ ఉంటాం. అల్లం తాజాగా ఉంటేనే వంటకాల రుచి పెరుగుతుంది. అలాగే శరీరానికి ఆరోగ్యం చేకూరుతుంది. బజారు నుంచి కొని తెచ్చిన తరవాత సరైన పద్ధతిలో నిల్వ చేయకపోతే అల్లం త్వరగా చెడిపోతుంది. అలాకాకుండా అల్లాన్ని నిల్వ చేసే విధానాల గురించి తెలుసుకుందాం...అల్లాన్ని నిల్వ చేసేముందు దాన్ని నీళ్లతో శుభ్రంగా కడిగి నీడలో ఆరబెట్టాలి. తేమ ఎక్కువగా లేకుండా పొడిగా ఉండేలా చూసుకోవాలి. శుభ్రంగా, పొడిగా ఉన్న అల్లాన్ని ఒక కాగితంలో చుట్టి గాలి చొరబడని డబ్బాలో ఉంచి ఫ్రిజ్‌లో పెడితే నెల రోజులపాటు నిల్వ ఉంటుంది. అదే గాలి ఆడేలా ఒక ప్లాస్టిక్ బుట్టలో పెడితే పది రోజులు వాడుకోవడానికి వీలుగా ఉంటుంది. పేపర్ టవల్‌ను నీళ్లతో కొద్దిగా తడపాలి. దానితో అల్లాన్ని చుట్టి ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి ఫ్రిజ్‌లో పెడితే అల్లం తేమతో తాజాగా ఉంటుంది. అల్లాన్ని తడి మట్టితో కప్పి ఉంచితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. మట్టి తడారిపోకుండా రెండు రోజులకు ఓసారి నీళ్లు చల్లుతూ ఉండాలి. పూర్వం ఈ పద్ధతినే అనుసరించేవారు. అల్లాన్ని చిన్న ముక్కలుగా తరిగి లేదంటే తురుముకుని జిప్‌లాక్ కవర్‌లో వేసి ఫ్రీజర్లో ఉంచితే ఆర్నెల్లు తాజాగా ఉంటుంది. తొక్కతీసి సన్నని ముక్కలుగా తరిగి ఎండలో ఆరబెట్టాలి. తేమ లేకుండా ఎండిన అల్లం ముక్కలను ఒక డబ్బాలో భద్రపరచుకుంటే ఏడాది పాటు వాడుకోవచ్చు. అల్లాన్ని సన్నగా తురిమి అందులో కొద్దిగా ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో నింపి గట్టిగా మూత బిగించి ఫ్రిజ్‌లో పెడితే నెల రోజులు తాజాగా ఉంటుంది.



# కాఫీ పౌడర్‌తో ఇంట్లోనే ఫేస్‌ప్యాక్ వేయండి

అందంగా కనిపించడం కష్టమని ఫీలయ్యేవారు కాఫీ పొడితోనే కళ తెప్పించొచ్చు. ఇది ఖర్చులేకుండానే ముఖాన్ని కళకళలాడేలా చేస్తుంది. కాఫీ పౌడర్‌తో ఇంట్లోనే ఫేస్‌ప్యాక్ వేయండి, బ్యూటీ పార్లర్స్‌లో చేసిన ఫేషియల్ కంటే డబుల్ గ్లో మీ సొంతమవుతుంది కాఫీ పౌడర్ అందాన్ని పెంచడంలో చాలా బాగా పనిచేస్తుంది. దీనిని వాడడం వల్ల మృతకణాలు తొలగించి, జుట్టుకి సహజ మెరుపుని అందిస్తుంది. కాఫీలో కెఫిన్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి చర్మంపై ఉండే చాలా సమస్యల్ని తగ్గిస్తాయి. ప్రతీ విషయానికి డబ్బులతోనే అవసరం లేదు. కాస్తా ఓపిక, మరింత తీరిక ఉంటే చాలు. అలానే అందాన్ని పెంచుకోవడానికి బయటికి వెళ్లి వేలకి వేలు ఖర్చు పెట్టకుండానే ఇంట్లోని కొన్ని టిప్స్‌ని ఫాలో అయి అందాన్ని పెంచుకోవచ్చు. అందులో భాగంగా కాఫీని వాడి బ్యూటీని ఎలా ఎన్‌హాన్స్ చేసుకోవచ్చు.

**సంబంధిత కథనాలు**

పిల్లల ముందు పేరెంట్స్ చేయకూడని తప్పులు, వాటి వల్లే పిల్లలకి చెడు అలవాట్లు వస్తాయి

**పాలతో..**

ముందుగా టేబుల్ స్పూన్ కాఫీ పౌడర్‌లో పాలు కలపాలి. దీనిని ఫేస్‌ప్యాక్‌లా చేయాలి. ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల తర్వాత క్లీన్ చేయండి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే ముఖంపై ఉన్న మచ్చలు మాయమవుతాయి. ముఖంపై గీతలు, ముడతలు తగ్గుతాయి. స్ట్రెచ్ మార్క్స్‌ని కూడా తగ్గించడంలో ఇది చాలా బాగా హెల్ప్ అవుతుంది.

**ఆలివ్ ఆయిల్**

కాఫీ పౌడర్‌లో కొద్దిగా పంచదార, నిమ్మరసం, తేనె, స్పూన్ పరిమాణంలో ఆలివ్ ఆయిల్ వేసి మొత్తం కలిపి పేస్టులా చేయాలి. దీనిని ప్యాక్‌లా చేసిన తర్వాత దానిని ముఖం, మెడ, చేతులకి రాసి మృదువుగా రుద్దాలి. దీని వల్ల మృతకణాలు తొలగి స్కిన్ మృదువుగా మారుతుంది.

**పెరుగు**

ఎండలో ఎక్కువగా తిరిగినప్పుడు ముఖంపై టాన్ ఏర్పడుతుంది. అలాంటప్పుడు కాఫీ పౌడర్ చక్కని పరిష్కారంగా ఉంటుంది. కాఫీ పౌడర్‌లో కొద్దిగా పెరుగు, చెంచా తేనె వేసి కలపాలి. దీనిని ముఖానికి రాయాలి. దీంతో చర్మం కాంతివంతంగా కనిపిస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా, తాజాగా కనిపించేలా చేస్తుంది.

**స్క్రబ్**

రెండు చెంచాలా కాఫీ పౌడర్‌లో రెండు చెంచాల ఆలివ్ ఆయిల్, నానబెట్టిన బాదంని రుబ్బి పేస్టులా చేయాలి. కాసిన్నీ పాలు రెండు చెంచాల శనగపిండి కలిపి ఒంటికి నలుగులా రుద్దుకోవచ్చు. ఇది స్క్రబ్‌లా పనిచేస్తుంది. చర్మానికి నిగారింపుని తీసుకొస్తుంది.

**బెనిఫిట్స్**

కాఫీని ముఖానికి రాయడం వల్ల చర్మంపై మృతకణాలను తొలగించి స్కిన్ సాఫ్ట్‌గా చేస్తుంది. కాఫీ పౌడర్‌లోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మానికి సహజ మెరుపుని అందిస్తుంది. ఈ పౌడర్ రక్తప్రసరణని మెరుగ్గా చేసి చర్మానికి ఆక్సిజన్ అందేలా చేస్తుంది. కాఫీ పౌడర్ రాయడం వల్ల ముడతలు, నల్లని వలయాలు తగ్గుతాయి. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా యాక్నే సమస్యలు దూరమవుతాయి.

**ఫ్రీలాన్సర్‌గా పని చేస్తారా**
కొంత ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు. హైదరాబాద్‌లో ఉన్న యువతులు,మహిళలకు అవకాశం. ఇంటర్వ్యూలు చేసి చక్కగా రాయగలిగిన వారికి ఆహ్వానం సంప్రదించండి:
9392611544

# అన్నం తింటే షుగర్ పెరుగుతుందనే భయం వద్దు



షుగర్ వచ్చిన ప్రతి వ్యక్తికీ డాక్టర్లు ముందుగా చెప్పే మాట ఒకటే. రైస్ వీలైనంత వరకూ తగ్గించాలి. రోజుకు ఓ పూట మాత్రమే అన్నం తిని మిగతా రెండు పూటలు ఇంకేదైనా డైట్ తీసుకోవాలని సలహా ఇస్తారు. అందుకే..చాలా మంది షుగర్ పేషెంట్స్ వైట్ రైస్ ని అవాయిడ్ చేస్తారు. అన్నంలో చక్కెర నిల్వలు ఎక్కువగా ఉంటాయి. ఎక్కువ మొత్తంలో తీసుకుంటే అమాంతం షుగర్ పెరిగిపోతుంది. అయితే..రైస్ కి, షుగర్ లెవెల్స్ లింక్ ఉన్న మాట వాస్తవమే.

కానీ..వేడి వేడి అన్నంతో పోల్చి చూస్తే చద్దన్నంతో షుగర్ పెరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెబుతున్నారు న్యూట్రిషనిస్ట్ రష్మి. అప్పుడే వండుకున్న అన్నం తిన్నప్పటితో కంపేర్ చేస్తే చద్దన్నం తిన్నప్పుడు షుగర్ లెవెల్స్ కంట్రోల్ లోనే ఉంటాయని వివరిస్తున్నారు. అందుకు కారణాలేంటో కూడా ఎక్స్ ప్లెయిన్ చేశారు. వేడన్నం, చద్దన్నం మధ్య ఎందుకంత తేడా. రాత్రి మిగిలిన అన్నం ఉదయం తింటే షుగర్ ఎందుకు కంట్రోల్ అవుతుంది. దీనిపై న్యూట్రిషనిస్ట్ రష్మి ఏం చెప్పారో తెలుసుకుందాం.

మంచి ఆకలి మీద ఉన్నప్పుడు వేడి వేడి అన్నంలో కాస్తంత పచ్చడి కలుపుకుని తిన్నా సరే రుచికరంగా అనిపిస్తుంది. ఆకలి తీరిపోతుంది. అయితే..ఇలా ఆకలి తీర్చి శక్తినిచ్చే ...టు చేస్తుంది. ఇందులో ఉండే చక్కెర కారణంగా డయాబెటిస్ ఉన్న వాళ్లలో షుగర్ లెవెల్స్ ఉన్నట్టుండి పెరిగిపోతాయి. అందుకే..షుగర్ పేషెంట్స్ రైస్ ని చాలా తక్కువ క్వాంటిటీలో తీసుకుంటారు. ఈ మధ్య కాలంలో జొన్నలు, సజ్జలు, రాగులతో రొట్టెలు చేసుకుని తింటున్నారు. ఇవి షుగర్ ని కంట్రోల్ చేయడంలో



తోడ్పడతాయి.

అయితే.. అన్నంతో ఈ షుగర్ పెరిగినప్పటికీ..చద్దన్నం లేదా ఫ్రిజ్ లో పెట్టిన అన్నంతో ఇలాంటి ఇబ్బంది ఉండదు అని చెబుతున్నారు న్యూట్రిషనిస్ట్.

చల్ల అన్నమే మేలు..రాత్రి అన్నం మిగిలిపోతే మరుసటి రోజు ఏం తింటాంలే అని చెత్త బుట్టలో పారేస్తారు. కానీ..ఇలా మిగిలిపోయి అన్నంతోనే షుగర్ కంట్రోల్ చేసుకోవచ్చు. వినడానికి కాస్త భిన్నంగా అనిపించినా ఇదే నిజం అంటున్నారు న్యూట్రిషనిస్ట్ రష్మి. నిజానికి షుగర్ నియంత్రణలో ఉండాలంటే గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. అయితే..అప్పుడే వండిన అన్నంలో ఈ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. అందుకే.. తినగానే షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. ఎప్పుడైతే దీన్ని రాత్రంతా నిల్వ ఉంచుతారో..అప్పుడు ఈ ఇండెక్స్ తగ్గిపోతుంది. అంటే..అది షుగర్ పేషెంట్స్ కూడా తినేందుకు అనువుగా మారుతుంది. ఇలా ఎందుకు జరుగుతుందో చూద్దాం. అన్నం రాత్రంతా నిల్వ ఉంచడం లేదా ఫ్రిజ్ లో పెట్టడం ద్వారా అందులో ఉండే పిండి పదార్థం తగ్గుతుంది. సాధారణంగా ఈ స్టార్చ్ కారణంగా షుగర్ పెరుగుతుంది. కానీ..ఇలా రాత్రంతా ఉంచడం వల్ల అన్నంలోని ఈ స్టార్చ్ మోతాదు తగ్గుతుంది. దీన్ని రెసిస్టెంట్ స్టార్చ్ అని పిలుస్తారు. మామూలుగా అయితే అన్నంలో ఉండే చక్కెర శరీరంలోకి వెళ్లిన తరవాత ముక్కలుగా విడిపోయి చక్కెరలో కలిసిపోతుంది. ఈ కారణంగానే షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. కానీ..ఈ రెసిస్టెంట్ స్టార్చ్ అలా విడిపోదు. సులువుగా అరిగేందుకు అనువుగా మారిపోతుంది. అందుకే..చల్ల అన్నం తింటే సులువుగా జీర్ణం అవుతుంది. దీన్ని సైంటిఫిక్ గా స్టార్చ్ రిట్రోగ్రేడేషన్ అంటారు. అంటే..ఇలా ఉన్న అన్నం తింటే అందులో ఉండే పిండి పదార్థాన్ని లేదా చక్కెరను శరీరం అబ్జార్బ్ చేసుకోదు. అందుకే..షుగర్ లెవెల్స్ పెరగవు.

# అమ్మ చేతి గోరుముద్ద!



పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరి చూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం.

పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

**అమ్మమ్మల ఆహారం!**

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు.

అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి, జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్ధకైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడొల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

**పేచీ పెట్టే పిల్లలతో ఇలా...**

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది.

ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్థి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టివి, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

**పోషకాల చిరుతిళ్లు ఇవే!**

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లుగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చికూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు.

షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్దోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

**ఆకలి తెలియనివ్వాలి**


సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపు నిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పుడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు.

కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.

**పిల్లల ఆహారం పసందుగా...**

అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు... ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లుగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి. 'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి. చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తినీ రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.

# జుట్టుకు రంగు వద్దు



ఈ రోజుల్లో అందంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఇక, జుట్టు ప్రతి ఒక్కరి అందంలో కీలకపాత్ర పోషిస్తుంది. అయితే, ఈ రోజుల్లో చాలా మంది జుట్టు సమస్యలతో బాధపడుతున్నారు. అందులో తెల్ల జుట్టు ఒకటి. సాధారణంగా లేటు వయసులో తెల్ల జుట్టు వస్తుంది. అయితే, ఈ రోజుల్లో చాలా మంది చిన్న వయసులోనే తెల్ల జుట్టు సమస్యతో బాధపడుతున్నారు. నిండా ముప్పై ఏళ్లు రాక ముందే తలంతా తెల్ల జుట్టుతో కనిపించే వారు బోలెడు. ఇక, తెల్ల జుట్టు సమస్యను తగ్గించుకోవడానికి మార్కెట్లో దొరికే కెమికల్ డై, హెన్నా ప్రొడక్ట్స్ వాడుతున్నారు. అయితే, ఇవి తాత్కాలికంగా మాత్రమే తెల్ల జుట్టును నల్లగా మారుస్తున్నాయి. ఆ తర్వాత మళ్లీ తెల్ల జుట్టు కనిపించడం ప్రారంభమవుతుంది. అయితే, తెల్ల జుట్టు రాకుండా ఆ సమస్యను తగ్గించేందుకు కొన్ని చిట్కాల్ని ప్రముఖ డెర్మాటాలజిస్ట్ యుగల్ రాజ్‌పుత్ కాన్పూర్ చెప్పారు. ఈ చిట్కాల్ని రెగ్యులర్‌గా ఫాలో అయితే తెల్ల జుట్టు రాకుండా ఆపవచ్చు. ఇంతకీ ఆ చిట్కాలేంటో తెలుసుకుందాం.

చిన్న వయసులోనే జుట్టు తెల్లబడటానికి అనేక కారణాలు ఉన్నాయని కాన్పూర్‌లోని %+ూఎవీ% మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ యుగల్ రాజ్‌పుత్ చెప్పారు. ఈ సమస్యకు అతిపెద్ద కారణం పోషకాహార లోపం అంటే అవసరమైన పోషకాలు లేకపోవడం. సరైన ఆహారం తీసుకోకపోతే, శరీరంలో పోషకాల లోపం ఏర్పడుతుంది. దీంతో జుట్టు బూడిద రంగులోకి మారడం ప్రారంభమవుతుంది. విటమిన్ %దీ%12 లోపం, దీర్ఘకాలిక అనారోగ్యం, జన్యుపరమైన రుగ్మత, థైరాయిడ్ రుగ్మత, పరాన్నజీవి సంక్రమణ, అధిక ఒత్తిడి కారణంగా చిన్న వయసులోనే బూడిద జుట్టు సమస్య వస్తుందని డాక్టర్ తెలిపారు. ఇక, ఈ సమస్యను నివారించడానికి డాక్టర్ కొన్ని చిట్కాలు చెప్పారు. అవేంటో ఓ లుక్కేద్దాం.

**పోషకాలు అధికంగా ఉండే ఆహారం**

తెల్ల జుట్టు సమస్యను నివారించడానికి, పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని చర్మవ్యాధి నిపుణులు యుగల్ అంటున్నారు. పోషకాలు పుష్కలంగా పండ్లు, కూరగాయలు వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవాలి. సీజన్ ఏదైనా సరే సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలని డాక్టర్ చెప్పారు. దీంతో విటమిన్ డి పుష్కలంగా పొందవచ్చు. శాఖాహారులు ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు.

**తలకు మసాజ్**

తెల్ల జుట్టు సమస్యతో బాధపడేవారు వారానికి ఒకసారి తలకు బాగా మసాజ్ చేసుకోవాలని డాక్టర్ సూచించారు. తలకు మసాజ్ చేయడం వల్ల మైక్రో సర్క్యులేషన్ మెరుగుపడుతుంది. దీంతో జుట్టు మూలాలకు రక్త సరఫరా సరిగ్గా జరుగుతుంది. కొబ్బరి నూనె, ఆవ నూనె, నువ్వుల నూనె వీటిలో ఏదైనా ఒక్కదానితో తలకు మసాజ్ చేసుకోవాలని డాక్టర్ చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల జుట్టు బలంగా మారుతుంది. అంతేకాకుండా తెల్ల జుట్టు సమస్య నుంచి బయటపడవచ్చని తెలిపారు.

**షాంపూ తర్వాత కండీషనర్**



తల స్నానం చేసిన తర్వాత జుట్టును బాగా ఆరబెట్టుకోవాలని డాక్టర్ యుగల్ అంటున్నారు. వారానికి రెండు మూడు సార్లు షాంపూతో స్నానం చేసిన తర్వాత జుట్టుకు కండీషనర్ వాడాలి. ఇది జుట్టును తేమగా ఉంచుతుంది. ఇలా చేయడం వల్ల జుట్టు తెల్లబడే ప్రమాదం తగ్గుతుంది. షాంపూ తర్వాత జుట్టుకు కండీషనర్ అప్లై చేయడం వల్ల చుండ్ర సమస్య కూడా తగ్గుతుందని డాక్టర్ చెబుతున్నారు.

**జుట్టుకు రంగు వద్దు**

కొంతమంది జుట్టు తెల్లగా మారిన వెంటనే హెయిర్ కలర్ వేయడం ప్రారంభిస్తారు. ఇది తెల్ల జుట్టు సమస్యను పెంచుతుంది. మార్కెట్లో దొరికే హెయిర్ కలర్, కెమికల్ డైల్లో జుట్టుకు హాని కలిగించే రసాయనాలు ఉంటాయి. తెల్ల జుట్టు సమస్యతో బాధపడేవారు హెయిర్ కలర్ వేయకపోవడమే మంచిదని డాక్టర్ అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెల్ల జుట్టు సమస్యతో బాధపడేవారు వైద్యుణ్ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మేలు.

**వ్యాయామం**

జుట్టు ఆరోగ్యానికి, వ్యాయామానికి సంబంధం ఏముందని అనుకుంటున్నారా? వ్యాయామంతో జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ అంటున్నారు. రెగ్యులర్‌గా వ్యాయామం జుట్టుపై మంచి ప్రభావాన్ని చూపుతుంది. జుట్టు సమస్యలను తగ్గిస్తుంది. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ దాదాపు 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. వ్యాయామం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీంతో ఒత్తిడి తగ్గుతుంది. తెల్ల జుట్టు సమస్య కూడా తగ్గుతుందని డాక్టర్ యుగల్ చెబుతున్నారు.

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

11 | హైదరాబాద్ బుధవారం 04 । జూన్ । 2025


## స్టీల్, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు.. ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు



**న్యూయార్క్-నవభూమి:** రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ తాజాగా సంతకాలు చేశారు. టారిఫ్‌లు అమెరికా కాలమానం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 12:01 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. యూకేతో వాణిజ్య ఒప్పందం అమలులో కాగా, స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. స్వదేశీ స్టీల్ పరిశ్రమను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం నిర్ణయం వల్ల స్థానిక స్టీల్ పరిశ్రమకు ఊతం వస్తుందని, జాతీయ సరఫరా పెరుగుతుందని, దీంతో చైనాపై ఆధారపడే సందర్భాలు తగ్గుతాయని ట్రంప్ పేర్కొన్నారు.అమెరికా స్టీల్ పరిశ్రమ అభివృద్ధి కోసం 14 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే ఆ డీల్‌కు చెందిన తుది నిర్ణయం ఇంకా తీసుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ పరిశ్రమలో ఇక నుంచి ఉద్యోగులు తీసివేత ఉండదని, ఔట్ సోర్సింగ్ కూడా ఉండదన్నారు.

## వరుస నష్టాలకు బ్రేక్.. టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే



**ముంబై-నవభూమి:** గత మూడు రోజులుగా నష్టాలను ఎదుర్కొన్న దేశీయ సూచీలు బుధవారం లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, హెవీ వెయిట్ షేర్లలో కొనుగోళ్లు స్టాక్ మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడం కూడా కలిసి వచ్చింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో రోజును ముగించాయి. మంగళవారం ముగింపు (80, 737)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ కాసేపు లాభనష్టాలతో దోబూచులాడింది. ఆ తర్వాత లాభాల్లోకి ప్రవేశించి స్థిరంగా కొనసాగింది. బుధవారం సెన్సెక్స్ 80, 705 - 81, 087 శ్రేణి మధ్యలో కొనసాగింది. చివరకు సెన్సెక్స్ 260 పాయింట్ల లాభంతో 80, 998 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 77 పాయింట్ల లాభంతో 24, 620 వద్ద రోజును ముగించింది. హెవీ వెయిట్ షేర్లలో కొనుగోళ్లు ప్రధాన సూచీలను ముందుకు నడిపించాయి. సెన్సెక్స్‌లో రైల్ వికాస్, పీబీ ఫిన్‌టెక్, సీఈఎస్‌సీ, జుబిలెంట్ ఫుడ్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్, చోలా ఇన్వెస్ట్, ఆల్కెమ్ ల్యాబ్స్, మనప్పురం ఫైనాన్స్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 407 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 76 పాయింట్లు లాభపడింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.90గా ఉంది.

## భారత్‌లో పన్నుల భారం ఎక్కువ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత విమాన యాన రంగం పై ప్రభుత్వం విధిస్తున్న పన్నులపై ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. పన్నుల నిర్వచనంలోనూ స్పష్టత లేకుండా పోతోందని ఐఏటీఏ వార్షిక సదస్సుకు హాజరైన ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ తెలిపారు. ఈ విషయంలో స్పష్టత ఏర్పడితే తప్ప భారత్‌లో విమానయాన రంగం తన శక్తికి తగ్గట్టు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం లేదని స్పష్టం చేశారు. భారత విమానాశ్రయాల్లో వసూలు చేస్తున్న చార్జీలపైనా వాల్ష్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో మరే దేశంలోనూ భారత ఎయిర్‌పోర్టుల్లో ఉన్నన్ని చార్జీలు లేవన్నారు. ఈ చార్జీలు విమానయాన సంస్థలకు భారం కాని స్థాయిలో ఉండాలన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా భారత్‌లో విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఈ విషయంలో భారత్ త్వరలోనే చైనాను మించిపోతుందని వాల్ష్ స్పష్టం చేశారు.

### అద్భుత అవకాశాలు: వర్జిన్ అట్లాంటిక్

విమానయానానికి సంబంధించి భారత్ అద్భుత అవకాశాల గని అని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే వర్జిన్ అట్లాంటిక్ విమానయాన సంస్థ తెలిపింది. భారత-బ్రిటన్ ఎఫ్‌టీఏ నేపథ్యంలో సరుకు రవాణ కోసం భారత్‌కు మరిన్ని విమాన సర్వీసు ప్రారంభించబోతున్నట్టు ఆ సంస్థ సీఈఓ షాయ్ వీస్ చెప్పారు. అమెరికా తర్వాత ప్రస్తుతం భారత్ తమకు అతిపెద్ద మార్కెట్ అన్నారు. భారత్ నుంచి ప్రస్తుతం ఏటా తమ విమానాల ద్వారా 10 లక్షల మంది ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తన సాంకేతిక వ్యవస్థలను ఏఐ ఆధారిత సొల్యూషన్స్‌తో ఆధునీకరించేందుకు వర్జిన్ అట్లాంటిక్ సంస్థ టీసీఎస‌తో ఐఏటీఏ సదస్సు సందర్భంగా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం ఏడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

## ముంబైలో టెస్లా భారీ గిడ్డంగి




**ముంబై-నవభూమి:** విద్యుత్ కార్ల తయారీలోని టెస్లా అనుబంధ సంస్థ టెస్లా ఇండియా మోటార్ అండ్ ఎనర్జీ ముంబైలోని లోధా లాజిస్టిక్స్ పార్కులో 24,565 చదరపు అడుగుల విస్తీర్ణం గల గిడ్డంగి స్థలాన్ని లీజుకు తీసుకుంది. దీని నెలవారీ అద్దె రూ.37.53 లక్షలని డేటా అనలిటిక్స్ సంస్థ సీఆర్ఈ మాట్రిక్స్ తెలిపింది. ఏటా 5%అద్దె పెంపు అంగీకారంతో టెస్లా ఈ స్థలా న్ని 5ఏళ్ల కాలానికి లీజుకు తీసుకున్నట్టు తెలిపింది.

## ఈ డాట్ ఉంటే అమెజాన్, లేదంటే ఫేక్.. అలాంటి ఉత్పత్తులకు చెక్

**ముంబై-నవభూమి:** ఆన్‌లైన్ షాపింగ్ ప్యాకేజింగ్‌లో జరిగే మోసాలను అరికట్టేందుకు అమెజాన్ సరికొత్తగా ముందుకొచ్చింది. వినియోగదారుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ, కొత్త టాంపర్ ప్రూఫ్ ప్యాకేజింగ్ టెక్నాలజీను ప్రవేశపెట్టింది. ఈ టెక్నాలజీ సహాయంతో ఆ ప్యాకేజీని ఎవరైనా మార్చాలని చూస్తే వినియోగదారులకు వెంటనే సమాచారం అందుతుంది. ఇది భద్రతతో పాటు, వినియోగదారుల నమ్మకాన్ని కూడా పెంచేందుకు సహాయపడుతుంది. పింక్ డాట్ ఉందా..మారుతున్న కాలానికి తగ్గట్లు అమెజాన్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇకపై అమెజాన్‌లో ఆన్‌లైన్ షాపింగ్ చేస్తే ఫేక్ ఉత్పత్తులు వచ్చే అవకాశం ఉండదు. ప్రస్తుతం అమెజాన్ డెలివరీ ప్యాకేజీ ట్యాంపర్ ప్రూఫ్ అవునా కాదా అని నిర్ధారించుకోవడానికి మీరు పింక్ డాట్‌ను తనిఖీ చేయాల్సి ఉంటుంది. మీరు అర్డర్ చేసిన ప్యాకేజీపై మీకు పింక్ డాట్ కనిపిస్తే అది టాంపర్ ప్రూఫ్ ప్యాకేజింగ్ అని అర్థం.అమెజాన్ ప్రవేశపెట్టిన టాంపర్ ప్రూఫ్ ప్యాకేజింగ్‌లో ప్రత్యేకమైన సీల్ ఉంటుంది. ఈ సీల్‌లను వేడి లేదా ఇతర మార్పులతో తొలగిస్తే, దాని రంగు మారుతుంది. తద్వారా ప్యాకేజింగ్‌లో మార్పులు జరిగాయో లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఇది టాంపరింగ్‌ను సూచిస్తుంది. ప్యాకేజింగ్‌లో మార్పులు జరిగినట్లయితే వినియోగదారులు వెంటనే తెలుసుకుంటారు. తద్వారా వారు అపరిచిత వస్తువులు పొందకుండా ఉంటారు. ఈ టెక్నాలజీ ద్వారా ఇతర ఉత్పత్తులు మార్కెట్లోకి రావడం తగ్గుతుంది. ప్రత్యేక ఐడీ కోడ్‌లు, ధృవీకరణ ద్వారా ప్యాకేజింగ్ ట్రాకింగ్ కూడా ఈజీ అవుతుంది.

## ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా వ్యాఖ్యలు వైరల్



**ముంబై-నవభూమి:** ఆర్‌జీపీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. సందర్భాన్ను బట్టి ఆసక్తికర అంశాలతో ఆయన నెటిజన్లను పలకరిస్తున్నారు. తాజాగా తన కంపెనీలోని ఉద్యోగులతో మాట్లాడిన గోయెంకా మాటలు వైరల్ అవుతున్నాయి. తన చమత్కారంతో ఉద్యోగుల ముఖాల్లో నవ్వులు పూయించారు గోయెంకా. తాను ఆదివారాలు పని చేయండి, ఇంట్లో భార్య వైపు చూస్తూ ఎంత సేపు కూర్చుంటారు అనే మాటలు మాట్లాడడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.'ఇంతకు ముందు ఎల్ అండ్ టీ కంపెనీ ఛైర్మన్ ఎస్‌ఎన్ సుబ్రహ్మణ్యన్ తన ఉద్యోగులతో మాట్లాడిన అంశాలతో ఇబ్బందుల్లో పడ్డారు. ఆ విధంగా నేను ఆదివారం పని చేయడం, భార్యల వైపు చూస్తూ కూర్చోవడం గురించి మాట్లాడడం లేదు.' అంటూ హర్ష్ గోయెంకా వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడుతుంటే ఉద్యోగులు పగల బడి నవ్వారు. ప్రస్తుతం గోయెంకా వ్యాఖ్యలు వైరల్ అవడంతో నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. మీ చమత్కారంతో ఉద్యోగుల ముఖాల్లో నవ్వులు పూయించారు అంటూ ఓ నెటిజన్ కామెంట్ చేశారు. మీ కంపెనీలోని ఉద్యోగులు పనిలో సంతృప్తితో ఉన్నారని మా అభిప్రాయం అని ఒకరు పేర్కొన్నారు.కొద్ది రోజుల క్రితం ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. వారానికి 90 గంటలు పని చేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలంటూ ఉద్యోగులకు సూచించారు. ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు ఎంత కాలం అలా భార్యను చూస్తూ ఉంటారు అంటే వ్యాఖ్యానించారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ టైం ఉండేలా చూడాలన్నారు. భార్యలకు ఈ విషయంపై వివరించాలన్నారు. ఆయన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు ఎదురయ్యాయి. ప్రముఖులు, సెలబ్రిటీలు సైతం స్పందించారు. వారానికి 90 గంటలు సరైన నిర్ణయం కాదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.గతంలోనూ వారానికి 90 గంటల పనిపై హర్ష్ గోయెంకా స్పందించారు. ' వారానికి 90 గంటలు పని చేయడమా? ఆదివారాన్ని సన్- డ్యూటీ, డే ఆఫ్ ను ఊహాజనిత భావన అని మార్చాలి. కష్టపడి, తెలివిగా పని చేయడాన్నే నమ్ముతాను. జీవితాన్ని శాశ్వతమైన ఆఫీసు షిఫ్టుగా మార్చినట్లయితే వినాశనానికి దారి తీస్తుంది తప్ప విజయాన్ని ఇవ్వదు. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఒక ఆప్షన్ కాదు, అవసరం ' అని హర్ష్ గోయెంకా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆయన వ్యాఖ్యలను పలువురు సమర్థించారు.

## భారీగా పెరిగిన రూ.500 దొంగ నోట్లు




**ముంబై-నవభూమి:** పెద్ద నోట్ల రద్దు తర్వాత వాటి స్థానంలో రూ. 2000, రూ.500 కొత్త కరెన్సీ నోట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకొచ్చింది. ఆ తర్వాత కొద్ది నెలల్లోనే రూ. 2000 నోట్ల ముద్రణ ఆపేసి ఆ తర్వాత చలామణి నుంచి ఉపసంహరించారు. ఇప్పుడు పెద్ద నోటు అంటే రూ. 500 మాత్రమే. దీంతో ఈ రూ. 500 నోట్లలో దొంగ నోట్ల చలామణి భారీగా పెరిగిపోయింది. మార్కెట్లో ఎక్కువగా చలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. అమాయకులకు నకిలీ నోట్లను కట్టబెడుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే రూ. 500 నకిలీ నోట్లు 37.3 శాతం మేర పెరిగినట్లు స్వయంగా ఆర్‌బీఐ చెప్పడం ఆందోళన కలిగించే విషయమే.ఇటీవలే ఆర్‌బీఐ వార్షిక నివేదిక విడుదల చేసింది. ఇందులో రూ. 500 నకిలీ నోట్లపై సంచలన విషయాలు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం 2024- 25లో బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.500 నకిలో నోట్లను గుర్తించడం 37.3 శాతం మేర పెరిగినట్లు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో కొత్త రూ. 500 నోట్ల మాదిరిగా ఉన్నవి ఏకంగా 1.18 లక్షలు నోట్లు గుర్తించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ విలువ రూ. 5.88 కోట్లుగా ఉంటుందని పేర్కొంది. అంతకు ముందు ఏడాది 2023- 24లో రూ. 4.28 కోట్లు విలువైన నకిలీ నోట్లను గుర్తించగా ఇప్పుడు అది 37.3 శాతం మేర పెరిగిందని వెల్లడించింది. కెహతా హై వెబ్‌సైట్లో ఒరిజినల్ రూ. 500 నోటుకు సంబంధించిన వివరాలను అందించింది. నోటులోని నిలువు గీత వంచినప్పుడు గ్రీన్ కలర్ నుంచి ముదురు నీలంలోకి మారుతుంది. రంగు మారకపోతే నకిలీ నోటుగా పరిగణించాలి. నోటును వెలుతురులో చూస్తే మహాత్మా గాంధీ ఫోటో, 500 అనే అంకె వాటర్‌మార్క్ కనిపిస్తాయి. ఒరిజినల్ నోటుపై చిన్న సైజులో హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అక్షరాలు కనిపిస్తాయి. ఒరిజినల్ కరెన్సీ నోటు కాగితంతో తయారు చేయరు. అది ప్రత్యేకమైన వస్త్రంతో తయారవుతుంది. తడిచినా సులభంగా చిరగదు. మహాత్మా గాంధీ ఫోటో ఎడమ, కుడి చివర్లలో క్రాస్‌గా 5 చిన్న గీతలు ఉబ్బెత్తుగా ఉంటాయి. చేతితో తాకితే తెలుస్తాయి. 500 సంఖ్య దేవనాగరి లిపిలో ముద్రిస్తారు. నోటును కుడివైపున వెలుతురుకు పట్టి చూసినట్లయితే లోపల ఒక చిత్రం కనిపిస్తుంది. నోటుపై అశోక స్తూపం చిహ్నం ఉంటుంది.

## రూ.1199కే విమాన ప్రయాణం




**ముంబై-నవభూమి:** మీరు ఏదైనా టూర్ వెళ్లాలనుకుంటున్నారా? విమాన ప్రయాణం అయితే బెటర్ అనుకుంటున్నారా? అయితే ఈ ఆఫర్ మీకోసమే. కేవలం బస్ టికెట్ ధరకే విమాన ప్రయాణం చేయవచ్చు. దిగ్గజ ఎయిర్‌లైన్స్ అయిన ఇండిగో మరోసారి బంపర్ ఆఫర్ తీసుకొచ్చింది. గెట్ అవే సేల్ ఎరుతో ప్రత్యేక పరిమిత కాల తగ్గింపు సేల్ తెచ్చింది. దీని ద్వారా కేవలం రూ. 1199 కే ఫ్లైట్ టికెట్లు అందిస్తోంది. ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ తమ కస్టమర్ల కోసం ఎంపిక చేసిన దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో స్పెషల్ వన్ వే ఫేర్స్ తీసుకొచ్చింది. అలాగే యాడ్ ఆన్స్ పై ప్రత్యేక తగ్గింపు సైతం ఇస్తోంది.ఇండిగో వెబ్‌సైట్ goindigo.in లేదా ఇండిగో మొబైల్ యాప్ లేదా ఇండిగో 6ESKai లేదా ఇండిగోవాట్సాప్ 7065145858 లేదా ట్రావెల్ పార్ట్నర్ల ద్వారా టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చు. ఇది ఒక పరిమిత కాల ఆఫర్. జూన్ 4, 2025 రోజున టికెట్ల బుకింగ్ మొదలైంది. జూన్ 6, 2025 అర్ధరాత్రి 23.59 గంటల వరకు టికెట్లు బుకింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ స్పెషల్ సేల్ ద్వారా టికెట్లు బుకింగ్ చేసుకుని జూన్ 12, 2025 నుంచి సెప్టెంబర్ 24, 2025 వరకు ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చు. మీకు అనుకూలమైన టైంలో ట్రిప్ ప్లాన్ చేసుకుని టికెట్లు బుక్ చేసుకోవచ్చు.ఈ ఆఫర్లో భాగంగా దేశీయ మార్గాల్లో వన్ వే ఫ్లైట్ టికెట్ ధర రూ. 1199 నుంచి ఇక అంతర్జాతీయ మార్గాల్లో అయితే రూ. 4,599 నుంచి టికెట్ ధరలు మొదలవుతున్నాయి. ముంబై-విజయవాడ, కడప-హైదరాబాద్, గోండియా-హైదరాబాద్, సేలం- హైదరాబాద్, కడప-విజయవాడ మధ్య తిరిగే విమానాల్లోనూ టికెట్ ధర రూ. 1199కే లభిస్తోంది.మరోవైపు.. యాడ్ ఆన్స్‌పై ప్రత్యేక తగ్గింపు కల్పిస్తోంది ఇండిగో. డొమెస్టిక్ రూట్లలో అదనపు లగేజీపై ప్రీ బుకింగ్ చేస్తే 50 శాతం వరకు తగ్గింపు ఇస్తోంది. ప్రీ బుకింగ్ మీల్స్ పై 50 శాతం డిస్కౌంట్ ఇస్తోంది. ఎమర్జెన్సీ ఎక్సెల్ సీట్స్ రూ. 500 నుంచి మొదలవుతున్నాయి. రూ. 299 ప్లాన్ తీసుకుంటే జీరో క్యాన్సలేషన్ ఛార్జీలు ఉంటాయి. ఈ ఆఫర్ ఇండిగో ఆఫరేట్ చేస్తున్న నాన్ స్టాక్, మల్టీ సిటీ, కెనెక్టింగ్ ఫ్లైట్స్ కి మాత్రమే వర్తిస్తుంది. పూర్తి వివరాలకు ఇండిగో అధికారిక వెబ్‌సైట్ చూడాలని కంపెనీ తెలిపింది.

## భారతీయులు మోజుపడి కొంటున్న ఎలక్ట్రిక్ స్కూటర్



**ముంబై-నవభూమి:** భారతదేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ టూ-వీలర్ తయారీ కంపెనీ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ నుంచి లాంచ్ అయిన ఓ స్కూటర్ అదరగొడుతోంది. భారతీయుల మనసుల్లో తనదైన ముద్ర వేసింది. ఈ స్కూటర్‌ను మోజుపడి కొనుగోలు చేస్తున్నారు. అదే ఏథర్ రిజ్టా ఈ స్కూటర్ విడుదల చేసిన కేవలం సంవత్సరంలోనే 1 లక్ష యూనిట్ల రిటైల్ అమ్మకాల మైలురాయిని అందుకోవడం విశేషం.ఏప్రిల్ 2024లోనే ఈ ఏథర్ రిజ్టా స్కూటర్ విడుదలైంది. అప్పటి నుంచి రిజ్టాకు దేశవ్యాప్తంగా ఫ్యామిలీ స్కూటర్ కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఏథర్ మొత్తం మార్కెట్ వాటాలో గణనీయమైన వృద్ధికి ఇది దోహదపడినట్లు కంపెనీ తెలిపింది.'రిజ్టాతో ఒక లక్ష యూనిట్ల మైలురాయిని చేరుకోవడం సంతోషంగా ఉంది. భారతీయ కుటుంబాల అవసరాలను తీర్చడంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా రూపొందించిన రిజ్టా మా పరిధిని విస్తరించడంలో , విస్తృత శ్రేణిలో కస్టమర్లతో అనుసంధానం అవ్వడంలో కీలక పాత్ర పోషించింది. ఇది ఫ్యామిలీ స్కూటర్. గొప్ప డిజైన్‌లో ప్యాక్ చేసిన విశాల , సౌకర్యవంతమైన సీటు తగినంత నిల్వ సామర్థ్యం, భద్రతా వంటి అంశాలు రోజువారీ ప్రయాణాన్ని సులభతరం చేస్తాయి. ఈ స్కూటర్ విడుదల చేసినప్పటి నుంచి సంవత్సరం కంటే తక్కువ సమయంలోనే మా మార్కెట్ వాటాను పలు రాష్ట్రాల్లో పెంచుకునేందుకు, మా వినియోగదారుల ప్రొఫైల్‌ను విస్తృతం చేసేందుకు, మా కార్యకలాపాలు పరిమితంగా ఉన్న రాష్ట్రాల్లో వ్యాపార విస్తరణకు రిజ్టా సహాయపడింది.' అని ఏథర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్నీత్ ఫోకెలా అన్నారు.గత ఆర్థిక సంవత్సరం 2025 రెండవ త్రైమాసికంలో ఏథర్ రిజ్టా డెలివరీలను ప్రారంభించారు. ఆ తర్వాత గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల్లో ఏథర్ కంపెనీ తన మార్కెట్ వాటాను గణనీయంగా పెంచుకుంది. ఎక్కువ మంది కొనుగోలుదారులకు ప్రాధాన్యత ఎంపికగా రిజ్టా స్కూటర్ నిలిచింది. ఏథర్ కంపెనీ మొత్తం అమ్మకాలలో దాదాపు 60 శాతం మేర రిజ్టానే వాటా కైవసం చేసుకోవడం విశేషం. స్మార్ట్ టెక్నాలజీ, సౌకర్యంతో రోజు వారీ వినియోగాన్ని సమతుల్యం చేస్తూ బలమైన ఫీచర్లను కలిగి ఉంది. దీంతో వాహన వినియోగదారుల మనసును రిజ్టా గెలుచుకుందని కంపెనీ వర్గాలు తెలిపాయి.56 లీటర్ అండర్-సీట్ స్టోరేజ్, సౌకర్యవంతమైన సీటు, అనుకూలమైన ఫ్లోర్‌బోర్డ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్- స్కిడ్ కంట్రోల్ రిజ్టాలో కొత్తగా పరిచయం చేశారు. టో అండ్ థెఫ్ట్ అలర్ట్ సిస్టమ్, టెయిల్ లైట్ ఎమర్జెన్సీ స్టాప్ సిస్టమ్, లైవ్ లొకేషన్ షేరింగ్, నేవిగేషన్ కోసం డాష్ బోర్డు పై గూగుల్ మ్యాప్స్ వంటివి ఇందులో ఉన్నాయి. రిజ్టాను ఏప్రిల్ 2024లో జరిగిన ఏథర్ కమ్యూనిటీ డేలో ఆవిష్కరించారు. జూన్ 2024 నుంచి దేశ వ్యాప్తంగా వాణిజ్య విక్రయాలు మొదలయ్యాయి. అంటే ఏడాదిలోపే లక్ష స్కూటర్లకుపైగా అమ్ముడువడం చూస్తే భారతీయుల మనసులో ఎంతగా స్థానం దక్కించుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

## పసిడి ప్రియులకు షాక్.. మళ్లీ పెరిగిన బంగారం ధరలు..



**ముంబై-నవభూమి:** భారత్, పాకిస్తాన్ యుద్ధం తర్వాత బంగారం ధరలు భారీగా తగ్గుతూ వచ్చాయి. లక్ష రూపాయల దగ్గర ట్రేడ్ అయిన స్వచ్ఛమైన బంగారం.. యుద్ధం తర్వాత 96 వేలకు చేరింది. బంగారం కొనాలనుకునే వారు ఎంతో సంతోషించారు. అయితే, ఇప్పుడు పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. బంగారానికి రెక్కలు వచ్చాయి. 96 వేల నుంచి ఇప్పుడు 99 వేలకు స్వచ్ఛమైన బంగారం ధర చేరింది. పేద, మధ్య తరగతి వారికి ఇది నిజంగా షాకింగ్ న్యూస్ అనే చెప్పాలి.

**హైదరాబాద్‌లో బంగారం ధరలు ఇలా..**

భాగ్య నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,800 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 99,060 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,300 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 99,070 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,810 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,310 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

నగరంలో వెండి ధరలు ఇలా ..మొన్నటి వరకు బంగారం ధరలతో సంబంధం లేకుండా వెండి ధరలు ప్రతీ రోజు ఎంతో కొంత తగ్గుతూ వచ్చాయి. కానీ, ఈ రోజు వెండి ధరలు కూడా అనుకోని షాక్ ఇచ్చాయి. నిన్న హైదరాబాద్ నగరంలో 100 గ్రాముల వెండి ధర 10,010 దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,00,100 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాముల వెండిపై 10 రూపాయలు, కేజీ వెండిపై 100 రూపాయలు పెరిగింది. 100 గ్రాముల వెండి ధర నేడు 10,020 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ వెండి ధర 1,00,200 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## ఇక చెన్నై పెట్రోలియం పెట్రోల్ పంపులు



**చెన్నై-నవభూమి:** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అనుబంధ సంస్థ చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) రిటైల్ ఇంధన విక్రయ విభాగంలోకి అడుగుపెడుతోంది. వ్యాపార విస్తరణలో భాగంగా.. పెట్రోల్, డీజిల్ విక్రయాల కోసం సొంతంగా రిటైల్ పంపులు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ శంకర్ వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం వచ్చే రెండు మూడేళ్లలో రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. సంస్థ డైమండ్ జూబ్లీ సందర్భంగా ఈ ఏడాదే తొలి పెట్రోల్ పంపును ప్రారంభించాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. పెట్రోల్ పంపుల ఏర్పాటుకు సీపీసీఎల్ ఇప్పటికే కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు పొందింది. తొలుత ఈ పంపులను తమిళనాడులో ప్రారంభించి ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు.

## 81 000 దిగువకు సెన్సెక్స్

**ముంబై-నవభూమి:** విదేశీ నిధుల తరలింపు, పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ అస్థిరతల నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా నష్టాలతో ముగిసింది. ఎనర్జీ, ఫైనాన్స్, ఐటీ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పాల్పడ్డారు. మంగళవారం రోజంతా ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మరో 636.24 పాయింట్లు నష్టపోయి 80,737.51 వద్ద స్థిరపడగా నిఫ్టీ 174.10 పాయింట్ల నష్టంతో 24,542.50 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 798.66 పాయింట్ల మేరకు దిగజారి కనిష్ఠ స్థాయి 80,575.09ని తాకింది. బీఎసఈ మిడ్‌క్యాప్ సూచీ 0.52%, స్మాల్‌క్యాప్ సూచీ 0.07% నష్టపోయాయి. కమోడిటీస్, రియల్టీ మినహా విభాగాల వారీ సూచీలన్నీ నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో మహీంద్రా అండ్ మహీంద్రా మినహా మిగతా 29 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి.నష్టాల్లో అదానీ షేర్లు: అదానీ గ్రూప్‌పై మరోసారి ఆరోపణలు చెలరేగిన నేపథ్యంలో ఆ గ్రూప్ షేర్లు నష్టాల బాట పట్టాయి. అదానీ పోర్ట్స్ 2.42%, ఎన్‌డీటీవీ 2.25%, అదానీ ఎనర్జీ 2.18%, అదానీ పవర్ 2.02% నష్టపోయాయి. నష్టాలతో ముగిసిన ఇతర షేర్లలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ (1.89%), అదానీ టోటల్ గ్యాస్ (1.62%), అదానీ గ్రీన్ (.158%), సంఘీ ఇండస్ట్రీస్ (1.16%), అంబుజా సిమెంట్ (.088%), ఏసీసీ (0.22%), ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ (0.06%) ఉన్నాయి.6 ఐపీఓలకు సెబీ అనుమతి: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సహా 6 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు జారీ చేయడానికి సెబీ అనుమతి ఇచ్చింది. ఈ అనుమతి పొందిన ఇతర కంపెనీల్లో విక్రమ్ సోలార్, డోర్ఫ్-కెటాల్ కెమికల్స్, ఏ-వన్ స్టీల్స్ ఇండియా, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్, శ్రీజి షిప్పింగ్ గ్లోబల్ ఉన్నాయి. ఈ ఆరు కంపెనీలు కలిసి రూ.20,000 కోట్లు సమీకరించనున్నాయి.అపోలో మైక్రోసిస్టమ్స్.. ప్రిఫరెన్షియల్ షేర్లు, వారంటీల జారీ ద్వారా రూ.416 కోట్లు సమీకరించినట్లు ప్రకటించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | గురువారం | 05 । జూన్ । 2025




## ఆర్సీబీకి కంగ్రాట్స్ చెప్పిన మహేశ్ బాబు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తొలిసారి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న విషయం తెలిసిందే. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తమ మొట్టమొదటి % ట్రోఫీని ముద్దాడింది. మంగళవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌ను 6 పరుగుల తేడాతో ఓడించి ఈ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ సందర్భంగా పలువురు సినీ రాజకీయ ప్రముఖులు ఆర్‌సీబీ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తాజాగా సూపర్ స్టార్ మహేశ్ బాబు కూడా ఆర్‌సీబీ టైటిల్ కొట్టడంపై శుభకాంక్షలు తెలిపాడు. నిజమైన మనసుతో గొప్ప ఆటతీరుతో రాణించారు. 18 ఏళ్ల పట్టుదల కృషి, కల ఈరోజు సాకారం అయింది. కోహ్లీకి, RCB జట్టుకి ఈ అద్భుతమైన గెలుపుకు శుభాకాంక్షలు అంటూ మహేశ్ రాసుకోచ్చాడు.

నవచిత్ర



## అఖిల్ పెళ్లి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి ఆహ్వానాన్ని అందించిన నాగార్జున



టాలీవుడ్ స్టార్ ఫ్యామిలీ అక్కినేని ఇంటా మరోసారి పెళ్లిబాజాలు మోగనున్న విషయం తెలిసిందే. గతేడాది నాగార్జున పెద్ద కొడుకు నటుడు నాగచైతన్య శోభితా పెళ్లి జరుగగా.. తాజాగా అతడి చిన్న కొడుకు అఖిల్ కూడా పెళ్లి చేసుకోబోతున్నాడు. ప్రముఖ వ్యాపారవేత్త జుల్ఫీ రవ్‌డ్జీ కుమార్తె జైనబ్‌తో అఖిల్ నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. గత ఏడాది నవంబర్ 26న వీరి నిశ్చితార్థం జరగగా.. జూన్ 6న పెళ్లి చేసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదిలావుంటే తాజాగా అఖిల్ వెడ్డింగ్ కార్డుని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి అందజేశాడు నాగార్జున. బుధవారం ఉదయం డిప్యూటీ సీఎం నివాసానికి వెళ్లిన నాగార్జున ఉప ముఖ్యమంత్రి భట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అఖిల్ వివాహ శుభలేఖను ఆయనకు అందించారు. ఈ సందర్భంగా నాగార్జున భట్టితో కాసేపు ముచ్చటించాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

## మృణాల్ ఆశలన్నీ ఆ సినిమా మీదే..



బాలీవుడ్ లో రాణిస్తూ సీతారామం తో తెలుగు ఎంట్రీ ఇచ్చిన భామ మృణాల్ ఠాకూర్. ఆమె చేస్తున్న సినిమాల సంఖ్య తక్కువే అయినా ఇంపాక్ట్ మాత్రం బాగుంది. తెలుగులో సీతారామం హిట్ కాగా నెక్ట్స్ వచ్చిన హాయ్ నాన్నతో కూడా సక్సెస్ అందుకుంది. ఐతే థర్డ్ మూవీగా చేసిన ది ఫ్యామిలీ స్టార్ మాత్రం నిరాశపరిచింది. ఆ సినిమా తర్వాత మృణాల్ నెక్ట్స్ ఛాన్స్ అందుకోవడానికి కాస్త టైం తీసుకుంది. మరి అవకాశాలు రాలేదా లేదా తనకు నచ్చిన కథలు రాలేదా అన్నది తెలియదు కానీ అమ్మడు ఏడాది దాకా టైం ఐతే లేటెస్ట్ గా అడివి శేష్ హీరోగా వస్తున్న డెకాయిట్ ఛాన్స్ అందుకుంది మృణాల్ ఠాకూర్. డెకాయిట్ అంటూ ఒక లవ్ స్టోరీ విత్ యాక్షన్ మూవీతో రాబోతున్నారు. అడివి శేష్ చేస్తున్న ప్రతి సినిమా సంథింగ్ స్పెషల్ గా ఉంటుంది. ఓ పక్క గూఢచారి 2 సినిమా చేస్తూనే మరోపక్క డెకాయిట్ ని చేస్తున్నాడు అడివి శేష్. శేష్ తో మృణాల్ జత కడుతూ వస్తున్న డెకాయిట్ సినిమా నుంచి వచ్చిన టీజర్ అంచనాలను పెంచింది. ఐతే మృణాల్ చేతిలో ఉన్న ఏకైక తెలుగు సినిమా డెకాయిట్ మాత్రమే. అందుకే ఆ సినిమా మీదే తన ఆశలన్నీ పెట్టుకుంది అమ్మడు. డెకాయిట్ హిట్ పడితే మరికొన్ని అవకాశాలు వస్తాయి. ఐతే కథల ఎంపికలో మృణాల్ ఠాకూర్ కూడా తన ప్రత్యేకత చాటుతుంది. రెగ్యులర్ సినిమాల్లా కాకుండా హీరోయిన్ గా ఎంతోకొంత ఇంపాక్ట్ చూపించే కథలనే ఆమె సెలెక్ట్ చేసుకుంటుంది. తెలుగులో అయితే సీతారామం తో ఆమె క్రేజ్ పెరిగింది. ఐతే ఆ తర్వాత సినిమాలే ఆమె పాపులారిటీ కొనసాగించలేకపోయాయి. డెకాయిట్ సక్సెస్ అయితే మృణాల్ మళ్లీ టాలీవుడ్ లో వరుస సినిమాలు చేసే ఛాన్స్ ఉంటుంది. ఐతే తెలుగు సినిమాలు చేస్తున్నా కూడా బాలీవుడ్ లో కూడా ప్రాజెక్ట్ లు చేస్తుంది మృణాల్ ఠాకూర్. అమ్మడు చేస్తున్న సినిమాల మీద ఆడియన్స్ ఆసక్తిగా ఉంటున్నారు. తెలుగు, హిందీ భాషల్లో మృణాల్ కి మంచి ఫ్యాన్ బేస్ ఏర్పడింది. సో రాబోతున్న సినిమాలతో అమ్మడు మరింత క్రేజ్ ని ఏర్పరచుకోవాలని చూస్తుంది. మరి అది ఎంతవరకు సాధ్యమవుతుందో చూడాలి.

17

## పొట్టి బట్టలు వేసుకోవడంపై ట్రోలింగ్.. సురేఖావాణి ఏం చెప్పిందంటే..?



టి సురేఖా వాణి గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా తెలుగువారికి ఆమె సుపరిచితమే. స్టార్ హీరోల సినిమాల్లో అమ్మగా. అక్కగా ఎన్నో మంచి పాత్రల్లో నటించి మెప్పించింది. అయితే .. సినిమాల్లో కనిపించేంత పద్ధతిగా సురేఖావాణి బయట కనిపించదు. ఎవరి జీవితం వారిది అని అనుకున్నా.. నిత్యం కూతురు సుప్రీతతో కలిసి పొట్టి పొట్టి బట్టలు వేసుకొని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటుంది. దీంతో ఈ తల్లీకూతుళ్లపై విపరీతమైన ట్రోలింగ్ నడిచింది. సురేఖావాణి అయినా అప్పుడప్పుడు ఫోటోలు పోస్ట్ చేస్తుందేమో కానీ, సుప్రీత(మాత్రం నిత్యం హాట్ ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. ఇక ఎప్పటినుంచో సురేఖావాణి.. కూతురు సుప్రీతను హీరోయిన్ గా లాంచ్ చేయాలనీ గట్టి ప్రయత్నాలే చేస్తుంది. ఎట్టకేలకు సుప్రీతను హీరోయిన్ గా చేసింది. బిగ్ బాస్ ఫేమ్ అమర్ దీప్(సుప్రీత జంటగా నటిస్తున్న చిత్రం చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి(' ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ ను నేడు రిలీజ్ చేశారు. సినిమా టికెట్లుఇక ఈ టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ లో సురేఖావాణికి వారి డ్రెస్సింగ్ పై వస్తున్న నెగెటివ్ ట్రోల్స్ కు సంబంధించిన ప్రశ్న ఎదురయ్యింది. మూవీలో చేస్తున్న స్టార్స్ కు, యాంకర్స్ కు వాళ్ళకంటూ ఒక సోషల్ లైఫ్ ఉంటుంది. వారు బయటకు ఎక్కడికి వెళ్లినా.. ఫోటోలు పెట్టినా.. బయట జనాలు ఒక ఆడపిల్ల బట్టలు ఎలా వేసుకుంటుంది అనేది కూడా కామెంట్స్ చేస్తున్నారు. వారికి మీరేం చెప్తారు అన్న ప్రశ్నకు సురేఖావాణి ఈ విధంగా చెప్పుకొచ్చింది. " ఒక్కొక్కరి పర్సెప్షన్ ఒక్కొక్కలా ఉంటుంది. అందరి బుర్రలు ఒకలా ఆలోచించలేవు. వాడేదో అలా ఆలోచించుకొని.. అలా రాసుకుంటున్నాడు. అది వాడి పర్సెప్షన్. కానీ, అది మనం ఎంతవరకు తీసుకుంటున్నామన్నది మన మైండ్ కు ఉండాలి. ఇదివరకు ఇలాంటి కామెంట్స్ చూసినప్పుడు మేమిద్దరం రియాక్ట్ అయ్యి.. రిప్లైలు ఇచ్చేవాళ్ళం. ఆ తరువాత చూసి నవ్వుకోవడం స్టార్ట్ చేసాం. దాని తరువాత అసలు పట్టించుకోవడం మానేసాం" అని చెప్పుకొచ్చింది.

## దుబాయ్ ఈవెంట్‌లో సమంత..



టాలీవుడ్ స్టార్ నటి సమంతగురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయం, నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఇక పలు అనారోగ్య కారణాలతో ఇటీవలే సినిమాలకు కాస్త బ్రేక్ తీసుకున్న సామ్.. ఇప్పుడిప్పుడే మళ్లీ ఫామ్‌లోకి వచ్చింది. వరుస ప్రాజెక్టులతో బిజీగా మారిపోయింది. వరుస పెట్టి సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చేస్తోంది. అదే సమయంలో ఈవెంట్స్‌లో పాల్గొంటూ సందడి చేస్తోంది. తాజాగా సమంత దుబాయ్‌లో సందడి చేసింది. అక్కడ జరిగిన ఓ స్పెషల్ ఈవెంట్‌కు చాలా స్పెషల్‌గా ముస్తాబై వచ్చింది. ఎంబ్రాయిడరీ నెట్ గోల్డ్ కలర్ శారీలో మెరిసిపోయింది. సింపుల్ మేకప్, హెయి స్టైల్‌తో తన లుక్‌కు మరింత అందంగా మార్చుకని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సామ్‌ను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. వారందరితో సమంత ఫొటోలు, సెల్ఫీలకు ఫోజులిచ్చింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను సామ్ తన ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట తెగ ఆకట్టుకుంటున్నాయి. ఇక సినిమాల విషయాని కొస్తే.. టాలీవుడ్‌లో సమంత సినిమా వచ్చి రెండేళ్లవుతోంది. చివరిసారిగా విజయ్ దేవరకొండతో కలిసి 'ఖుషి' చిత్రంతో పలకరించిన ఈ బ్యూటీ ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే మూవీ చేస్తోంది. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో 'రక్త్ బ్రహ్మాండ్' అనే ప్రాజెక్ట్‌లోనూ భాగమైంది. తాను నిర్మాతగా వ్యవహరించిన తొలి చిత్రం 'శుభం'. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమా గతనెల 9న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. హారర్ థ్రిల్లర్ జానర్‌లో వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్ లో ఈ చిత్రం జూన్ 13 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

## ఆర్సీబీ గెలుపుతో బన్నీ తనయుడు ఏం చేశాడో తెలుసా?



ఏళ్లుగా ట్రోఫీ కోసం పరితపిస్తూ వచ్చిన ఆర్సీబీ జట్టు ఎట్టకేలకి తాజా సీజన్‌లో కప్ ఎగరేసుకు పోయింది. 18వ సీజన్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) ఐపీఎల్ విజేతగా అవతరించడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. 18 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఆర్సీబీ జట్టు చివరకు ఆ కలని సాకారం చేసుకుంది. మొదటి ఐపీఎల్ టైటిల్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్-2025 ఫైనల్‌లో.. ఆర్సీబీ 6 పరుగుల తేడాతో విజయం సాధించి చరిత్రను తిరగరాసింది. తొలిసారి కప్ సాధించడంతో ఆర్సీబీ ఆటగాళ్ల ఆనందం అంతా ఇంతా కాదు. బెంగళూరులోని విధాన సౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు ఆర్సీబీ విజయ యాత్రను చేపట్టనున్నారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆర్సీబీ విక్టరీ పరేడ్ ప్రారంభం కానుందని ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో తెలియజేసింది. తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న తర్వాత ఆర్సీబీ తన అభిమానులతో విజయోత్స వాలను జరుపుకోవాలని భావిస్తోంది. ఇక ఈ విజయం తర్వాత ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కుమారుడు అయాన్ కూడా ఫుల్ హ్యాపీగా ఫీలయ్యాడు. అయాన్ విరాట్ కోహ్లీకి వీరాభిమాని. ఆర్‌సీబీ విజయం సాధించడంతో బన్నీ తనయుడు ఎమోషనల్ అయ్యాడు. తలపై బాటిల్ నీళ్లు కుమ్మరించుకుని భిన్నంగా తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఆ వీడియోను అల్లు అర్జున్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకోగా, ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. మరో వైపు ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ బెంగళూరు విజయం సాధించిన వెంటనే ఆనందంతో ఎగిరి గంతేశారు. ఆయన సెలబ్రేషన్స్ తాలూకు వీడియోను అర్ధాంగి లికితారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ.. "ఈ సాలా కప్ నమ్‌దు. 18 ఏళ్ల కల నెరవేరింది. క్రేజియెస్ట్ క్రికెట్ ఫ్యాన్ ప్రశాంత్ నీల్‌కు ఇది పర్ఫెక్ట్ గిఫ్ట్" అంటూ ఆమె రాసుకొచ్చారు.

## సీనియర్ నటి లేటు వయసు ఘాటు ఫోజు



భారతీయ సినీ పరిశ్రమలో అత్యుత్తమ నటీమణులలో ఒకరైన టబు తన అద్భుతమైన నటనాభినయంతో ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. జాతీయ ఉత్తమ నటిగా నాలుగు దశాబ్దాల కెరీర్ రన్ తో టబు ఎందరికో స్ఫూర్తి. ఇటు దక్షిణాది, అటు ఉత్తరాదినా టబు పాపులారిటీ అసాధారణమైనది. నిన్నే పెళ్లాడుతా, అందరివాడు, చాందిని బార్, హైదర్ సహా చాలా చిత్రాల్లో టబు అత్యుత్తమ నటనకు ప్రశంసలు దక్కాయి. స్వీయ-నిర్మిత ఆర్టిస్టుగా తనకు ఉన్న ఫాలోయింగ్ అసాధారణమైనది. టబు భారతదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ప్రశంసలు అందుకున్నారు. బాలీవుడ్ తో పాటు హాలీవుడ్ లోను చెప్పుకోదగ్గ పాత్రల్లో నటించింది. ఇంతకుముందు ఆస్కార్ విన్నింగ్ మూవీ లైఫ్ ఆఫ్ పై(ఆంగ్ లీ దర్శకుడు) సహా పలు హాలీవుడ్ చిత్రాల్లో నటించిన టబు ఇప్పుడు మరోసారి హాలీవుడ్ చిత్రంలో నటించనుందని సమాచారం. ఇటీవల డూన్ - ప్రొఫెసీ చిత్రంలో టబు మెరుపు లాంటి నటనకు గొప్ప పేరొచ్చింది. మరోసారి టబు హాలీవుడ్ లో నటించనుందని సమాచారం. ఈ సందర్భంగా ఫిలింఫేర్ మ్యాగజైన్ తో టబు ముచ్చటించారు. తన కెరీర్ పై శాశ్వత ప్రభావం చూపిన దర్శకులకు టబు కృతజ్ఞతలు తెలిపారు. తన కెరీర్ లో గుల్జార్ సాబ్ తనకు సహజంగా నటించే అవకాశం కల్పించారని టబు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నన్ను నేను వ్యక్తపరచుకోవడంలో గుల్జార్, విశాల్ భరద్వాజ్ వంటి దర్శకులు స్వేచ్ఛ ఇచ్చారని టబు తెలిపారు. చమక్బాల్ తో విశాల్ భరద్వాజ్ సినిమా, చిత్రనిర్మాణం, నటనకు చాలా భిన్నమైన విధానాన్ని నాకు పరిచయం చేశారు. ఈ వ్యక్తులు భారీ ప్రభావాన్ని చూపుతారు. వారు మీరు పనిచేసే విధానంలో.. ముఖ్యంగా ఎదిగే చిన్న వయస్సులో ఉన్నప్పుడు నటీనటుల్లో చాలా మారుస్తారు. వారు శాశ్వత ముద్ర వేస్తారు.. అని టబు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఫిలింఫేర్ కవర్ పేజీపై టబు ఫోజ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. లేటు వయసులో టబు ఘాటు ఫోజు గురించి అభిమానులు ముచ్చటించుకుంటున్నారు.

## బెంగుళూరులో ఆర్సీబీ విక్టరీ పరేడ్..



**అహ్మదాబాద్-నవభూమి** రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టు .. ఈయేటి ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న విషయం తెలిసిందే. 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఆ జట్టు కల ఫలించింది. అహ్మదాబాద్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఫైనల్లో ఆరు పరుగుల తేడాతో పంజాబ్‌పై ఆర్సీబీ విజయం సాధించింది. ప్రస్తుతం అహ్మదాబాద్ నుంచి ఇవాళ ఆర్సీబీ క్రికెటర్లు బెంగుళూరుకు బయలుదేరారు. నరేంద్ర మోదీ స్టేడియం నుంచి ఆటగాళ్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆర్సీబీ స్వంత పట్టణం .. కర్నాటకలోని బెంగుళూరులో ఇవాళ విక్టరీ పరేడ్ నిర్వహించనున్నారు. విధాన సౌద రూట్లో ఆ ర్యాలీ ప్రారంభంకానున్నది. చిన్నస్వామి క్రికెట్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3.30 నిమిషాలకు ర్యాలీ స్టార్ట్ అవుతుంది. కర్నాటక సీఎం, డిప్యూటీ సీఎంలను ప్లేయర్లు కలుస్తారు. ఇక చిన్నస్వామి స్టేడియంలో సుమారు 50 వేల ప్రేక్షకుల మధ్య విక్టరీ పరేడ్ సంబరాలు జరగనున్నాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (35 బంతుల్లో 43, 3 ఫోర్లు) నెమ్మదిగా ఆడినా కెప్టెన్ రజత్ పటీదార్ (16 బంతుల్లో 26, 1 ఫోర్, 2 సిక్సర్లు), జితేశ్ శర్మ (10 బంతుల్లో 24, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), లివింగ్‌స్టోన్ (15 బంతుల్లో 25, 2 సిక్సర్లు) మెరుపులతో ఆ జట్టుకు పోరాడగలిగే స్కోరును అందించారు. బెంగళూరు నిర్దేశించిన 191 పరుగుల ఛేదనలో పంజాబ్.. 184/7 వద్దే ఆగిపోవడంతో మొదటి టైటిల్ నెగ్గాలన్న ఆ జట్టు ఆశలు అడియాసలయ్యాయి. ఛేదనలో శశాంక్ సింగ్ (30 బంతుల్లో 61 నాటౌట్, 3 ఫోర్లు, 6 సిక్సర్లు), జోష్ ఇంగ్లిస్ (23 బంతుల్లో 39, 1 ఫోర్,

## ఐపీఎల్‌లో తొలి టైటిల్‌ను నెగ్గిన ఆర్‌సీబీ.. మాజీ ఓనర్ విజయ్ మాల్యా రెస్పాన్స్ ఇదే..!



**అహ్మదాబాద్-నవభూమి:** 18 సంవత్సరాల నిరీక్షణకు తెరదించుతూ పంజాబ్ కింగ్స్‌పై ఉత్కంఠ పోరులో విజయం సాధించింది. ఎట్టకేలకు తొలిసారి రాయల్ చాలెంజర్ బెంగళూరు టైటిల్ విజేతగా నిలిచింది. ఈ క్రమంలో ఆర్‌సీబీ గెలుపుపై ఆ జట్టు మాజీ ఓనర్ విజయ్ మాల్యా సంతోషం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందించారు. 18 సంవత్సరాల తర్వాత ఆర్‌సీబీ చివరకు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిందని, ఈ సీజన్‌లో మొత్తం జట్టు అద్భుతంగా రాణించిందని విజయ్ మాల్యా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. జట్టు ధైర్యంగా ఆడిందని, కోచింగ్ స్టాఫ్, సహాయక సిబ్బంది నుంచి గొప్ప సహకారం అందిందంటూ.. అందరికీ అభినందనలు తెలిపారు. ఆర్‌సీబీ ఫ్రాంచైజీ స్థాపించిన నాటి నుంచి.. ఐపీఎల్ ట్రోఫీ బెంగళూరుకు రావాలనేది తన కల అని విజయ్ మాల్యా పేర్కొన్నారు. విరాట్ కోహ్లీని జట్టులో చేర్చుకునే అవకాశం తనకు లభించిందని.. 18 సంవత్సరాలు జట్టుతో అతను గడిపిన కాలం చాలా ప్రత్యేకమైందన్నారు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్, మిసర్ 360 ఏబీ డివిలియర్స్ వంటి దిగ్గజ ఆటగాళ్లను ఎంపిక చేసే గౌరవం తనకు లభించిందని.. ఆర్‌సీబీ చరిత్రలో ఎప్పుడూ వారు భాగమవుతారన్నారు. చివరకు ట్రోఫీ బెంగళూరుకు వచ్చిందని.. ఈ కలను నిజం చేసిన వారందరికీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

నవక్రీడ

## ఈ విజయానికి ఆ ఇద్దరూ అర్హులే.. విరాట్ కోహ్లీ భావోద్వేగం



**అహ్మదాబాద్-నవభూమి**ఎట్టకేలకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టైటిల్‌ను నెగ్గింది. అహ్మదాబాద్ వేదికగా పంజాబ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఆరు పరుగులతో విజయం సాధించింది. దాదాపు 18 సంవత్సరాల నిరీక్షణకు తెర దించుతూ తొలిసారిగా టైటిల్‌ను సాధించింది. ఈ విజయంతో జట్టు సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ భావోద్వేగానికి గురయ్యాడు. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 190 పరుగులు చేసింది. ఆ తర్వాత పంజాబ్ జట్టుకు శుభారంభం లభించినా.. ఆ తర్వాత తడబడింది. ముఖ్యంగా ఆర్‌సీబీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు విసిరారు. ముఖ్యంగా కృనాల్ పాండ్యా పంజాబ్‌ను ఇబ్బందిపెట్టాడు. పంజాబ్ బ్యాటర్లలో శశాంక్ సింగ్ 30 బంతుల్లో 61 పరుగులతో అజేయంగా నిలిచాడు. చివరి వరకు పంజాబ్‌ను గెలిపించేందుకు ప్రయత్నించినా అదృష్టం కలిసిరాలేదు. మ్యాచ్ గెలిచాక విరాట్ కోహ్లీ భావోద్వేగానికి గురై.. కన్నీళ్లు పెట్టుకున్నాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**